thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 100 కరీంనగర్ గురువారం, 19 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హెూం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.



## పీజేఆర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి

కొండాపూర్ నుండి గచ్చిబౌలి వరకు అనుసంధానించే పీజేఆర్ (పీ. జనార్ధన్ రెడ్డి) ఫ్లైఓవర్‌ను ఈ నెల 28న ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ప్రఖ్యాత రాజకీయ నాయకుడు మరియు ప్రజా సేవకుడు దివంగత పి. జనార్ధన్ రెడ్డికి జ్ఞాపకార్థంగా, ముఖ్యమంత్రి ఫ్లైఓవర్‌కు పీజేఆర్ ఫ్లైఓవర్ అనిపేరు పెట్టాలని సూచించారు. ప్రారంభోత్సవానికి ముందే పెయింటింగ్ మరియు సుందరీకరణతో సహా అన్ని పనులను పూర్తి చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కమిషనర్ జీహెచ్‌ఎంసీ, ఆర్.వి. కర్ణన్‌ను ఆదేశించారు. ఈ కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గిస్తుంది, ప్రయాణికులకు సున్నితమైన మరియు వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది. హైదరాబాద్ పౌరులకు ప్రయోజనం చేకూర్చే నాణ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అందించడానికి జీహెచ్‌ఎంసీ కట్టుబడి ఉంది అని మేయర్ తెలిపారు.



## తొమ్మిది రోజుల్లో 9వేల కోట్లు

హైదరాబాద్ : 9 రోజుల్లో 9,000 కోట్ల రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాలో జమ చేసి తీరుతామని డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన మధిర నియోజకవర్గం బోనకల్ మండలం జానకిపురంలో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. ఈనెల 16న ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు సోదరులకు పెట్టుబడి సహాయంగా రైతు భరోసా నిధులను జమ చేస్తూ వస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు.

రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1,49,39,11 కోట్ల ఎకరాలకు తొమ్మిది వేల కోట్లు జమ చేయనున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అన్నదాతల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, రైతు బీమా వంటి కార్యక్రమాలతో ప్రతి సంవత్సరం రైతుల కోసం 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం, ఐదు సంవత్సరాల కాలంలో రైతుల కోసం మూడున్నర లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. పదేళ్లు పరిపాలించిన వారు వరి వేస్తే ఉరే అన్నారు, మేము వ్యవసాయాన్ని పండుగల మారుస్తున్నాం, సరిగ్గా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చి వరి ఉత్పత్తి పెంచి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాం అన్నారు. వరితోపాటు ఇతర పంటల ఉత్పత్తి రాష్ట్రంలో గణనీయంగా పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.





న్యూఢిల్లీ: బనకచర్ల ప్రాజెక్టు వివాదంపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భేటీ అయ్యారు. బుధవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్ లో కేంద్ర మంత్రులు ఇద్దరు సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరిపై నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చించారు.

కేంద్ర జలశక్తిమంత్రిత్వ శా ఖ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన తర్వాతే గోదావరిపై బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డియి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారు.

అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించిన తర్వాత పారదర్శకంగా ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఆర్ పాటిల్ భరోసా ఇచ్చారు.

# ఏపీ అలా చేస్తే....

# బనకచర్లకు అడ్డుచెప్పం!




## తేల్చి చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : గోదావరి బేసిన్ లో తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. గోదావరిలో హక్కుగా ఉన్న968 టీఎంసీలు వినియోగించుకునేందుకు తమకు అనుమతివ్వాలన్నారు. కృష్ణా బేసిన్ లో 500 టీఎంసీలకు, గోదావరి బేసిన్ లో 1000 టీఎంసీలకు ఎన్ వోసీ ఇస్తే ఏపీ బనకచర్లకు ఎలాంటి అభ్యంతరాలు చెప్పబోమన్నారు సీఎం రేవంత్. తమ ప్రాజెక్టుల్లో నీళు లేకుండా మిగులు జలాలు ఉన్నాయని ఏపీ చెబుతోంది.. కృష్ణా జలాల్లో పదేళ్లలో 299 టీఎంసీలు ఏనాడైనా వాడారా అని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన ద్రోహం వల్ల ఏపీకి నీళ్లు వస్తున్నాయన్నారు రేవంత్. ఐదు నెలలుగా తెలంగాణ అభ్యంతరాలతోనే బనకచర్ల అనుమతిపై కేంద్రం పునరాలోచనలో పడిందన్నారు రేవంత్. కేసీఆర్ చేసి పాపం వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేదని..దక్షిణ తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తి చేయకుండా కేసీఆర్ ద్రోహం చేశారని ఫైర్ అయ్యారు రేవంత్. తెలుగు రాష్ట్రాల మధ్య బనకచర్ల వివాదం నడుస్తోన్న సంగతి తెలిసిందే..ఇవాళ బనకచర్లపై తెలంగాణ ఎంపీలతో సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షం నిర్వహించారు. ఏపీ చేపడుతోన్న బనకచర్ల వల్ల తెలంగాణకు జరుగుతోన్న నష్టంపై వివరించారు. ప్రధాని మోదీని కలిసి బనకచర్లపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు రేవంత్.

**ఢిల్లీకి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ !**... ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన గోదావరి–బనకచెర్ల లింక్ ప్రాజెక్టుపై కేంద్రానికి ఫిర్యాదు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రేపు ఢిల్లీకి బయలుదేరుతున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కలిసి, గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న తీవ్ర అభ్యంతరాలను వినిపించనున్నారు. గోదావరి నుండి పోలవరం వద్ద 200 టీఎంసీ అదుగుల నీటిని రాయలసీమకు తరలించే ప్రణాళికను ఏపీ ప్రభుత్వం రూపొందించగా, ఇది తెలంగాణ హక్కులకు విఘాతం కలిగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ సందర్భంలో, తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించబోయే ముఖ్యమైన విషయాలలో, గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రీ–ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని... వివరణాత్మక ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను పక్కన పెట్టాలని కూడా కోరుతుంది. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తుంది కాగా, ఇప్పటికే జూన్ 3న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ ఢిల్లీలో పాటిల్‌ను కలిసి ఈ అంశంపై తమ అభ్యంతరాలను తెలియజేశారు. అయితే ప్రభుత్వం మరింత దృష్టి సారించి, స్పష్టమైన చర్యల కోసం మళ్లీ ఢిల్లీ పర్యటనకు సిద్ధమైంది. రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ సర్కార్ ఎలాంటి రాజీ చేయబోదని స్పష్టంగా చెబుతోంది. గోదావరి నీటి వివాదం నేపథ్యంలో రేపటి ఢిల్లీ పర్యటన రాష్ట్ర రాజకీయంగా కీలకం కానుంది.



# అల్లూరి జిల్లాలో మావో అగ్రనేతల కాల్చివేత

## పోలీస్ గుప్పిట్లో కేంద్ర కమిటీ నేతల ఆనవాళ్లు

## - గురితప్పని పోలీస్ ఆపరేషన్

## మైదానంలో సేఫ్ అరణ్యంలో అవుట్..

**చురకలు ప్రత్యేక ప్రతినిధి**

అది చత్తీస్ఘడ్ కావచ్చు..అది ఒడిషా కావచ్చు ,అది ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ఐఉండొచ్చు..అడవులన్నీ అన్నల రక్తంతో తడిసి పోతున్నాయి.భుదవారం నాటి నెత్తురు మావో అగ్రనేతలు గాజర్ల రవిఏగణేష్,మహిళా ముఖ్య నేత్రి అరుణ రక్తంతో అల్లూరి సీతారామ రాజు తిరిగిన నేల తూటాల శబ్ధంథో తడిసి పోయింది.అసలు రెండేళ్ల కాలం నుండి కేంద్ర రాష్ట బలగలు జల్లెడ పట్టి అగ్రనేతలపై గురితప్పకుండా తూటా పేల్చుతున్నాయే.ఈ పరిణమాంలో మావోయిస్టుల ఉనికి ప్రమాదంలో పడిందని చెప్పొచ్చు.మావో ముఖ్యనేత బల్మూరి నారాయణరావు అరెస్టు తర్వాత మావోలు గడ్డు స్థితిలోకి వెళ్లారు పార్టీ సెక్రటరీ నంబల్లాకేశవరావు,ముందుగా చలపతి మొన్న సుధాకర్ సహ భిహార్ మాంజా ఇప్పుడు గణేష్ వరుసబెట్టి పోలీసులు చంపుతున్నారు.ఈ వ్యవహారం విప్లవ అభిమానులను నిద్రలేకుండా చేస్తుంది. రేపు ఎవరు ఎక్కడ ఎన్కౌంటర్ అవుతారోనానే భయం వెంటాడుతుంది.

తమ ఉనికిని కాపాడుకునేందుకు మావోయిస్టులు శక్తికి మించి పోరాడుతుంటే.. మరోవైపు వచ్చే ఏడాది నాటికి మావోయిస్టుల మాట వినబడకుండా వారిని సమూలంగా అంతమొందించాలనే లక్ష్యంతో భద్రతా బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో మెప్పేట దాడిని కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు అగ్ర నేతలను టార్గెట్గా చేసుకుని సాయుధ బలగాలు గురి చూసి ఎటాక్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లే ప్రయత్నం చేస్తున్న క్రమంలో బుల్లెట్ దెబ్బలకు విలవిలలాడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. 'ఆపరేషన్ కగార్' మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎదురుకాల్పుల్లో సుమారు 200పైగా మావోయిస్టులు మరణించారు. ఇదే సమయంలో దండకారణ్యంలో భద్రతా బలగాల చేపడుతోన్న మారణహెూమాన్ని వెంటనే నిలిపివేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు, పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

**నాడు కాల్పుల విరమణకు ఒప్పందం.....** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2004లో ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపుతామని ప్రకటించారు. ఆ ఎలక్షన్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించింది. మే నెలలో సీఎంగా వైఎస్ ముఖ్యమంత్రి బాధ్యతలు చెపట్టిన తర్వాత మూడు నెలలకే మావోయిస్టులతో కాల్పుల విరమణకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇక 1992లో మావోయిస్టులపై విధించిన బ్యాన్ను సైతం ఎత్తవేసింది. ఆ వరుస పరిణామాలతో ప్రభుత్వంతో శాంతి చర్చలకు సహృద్భావ వాతావరణం ఏర్పడింది.

**శాంతి చర్చలు హాజరైన మావోయిస్టు అగ్రనేతలు....** ఎట్టకేలకు ప్రభుత్వంతో మావోయిస్టుల శాంతి చర్చలకు సమయం ఎట్టకేలకు రానే వచ్చింది. 2004, అక్టోబర్ 15 నుంచి 18 వరకు నాటి హెూంమంత్రి జానారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఈ భేటీకి సీపీఐ (మావోయిస్ట్) నాయకులైన అక్కిరాజు హరగోపాల్ రామకృష్ణ (ఆర్కే), చలం అలియాస్ సుధాకర్, గాజర్ల రవి అలియాస్ గణేశ్, జనశక్తి నేత రియాజ్, కూర దేవేందర్ అలియాస్ అమర్ లు హాజరయ్యారు. వారితో హెూంమంత్రి ఆధ్వర్యంలోని నలుగురు సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయింది. సమావేశంలో భాగంగా గిరిజన భూముల రక్షణ, భూ సంస్కరణలు, గిరిజన హక్కులు ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య హక్కుల పునరుద్ధరణ, దళితులకు సామాజిక న్యాయం. అన్ని రంగాల్లో మహిళలకు సమాన హక్కులు, మైనారిటీల రక్షణే ప్రధానాంశాలుగా చర్చలు జరిగాయి.

**చర్చలు విఫలం.. మావోయిస్టులపై ప్రత్యక్ష యుద్ధం...** ప్రభుత్వంతో మావోయిస్టుల శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని కోరడంతో అందుకు వారు అంగీకరించ లేదు. శాంతి చర్చలు ముగిసిన మరుసటి రోజు నుంచే అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సర్కార్ మావోయిస్టులపై ప్రత్యక్ష యుద్ధాన్ని ప్రకటించింది. డీజీపీ స్వరణ్ జీత్ సేన్ ఆదేశాల మేరకు పోలీసులు, గ్రేహౌండ్స్ సిబ్బంది వరుస కూంబింగ్ ఆపరేషన్లు చేపడుతూ రాష్ట్రాన్ని ఎన్కౌంటర్లతో అట్టుడికించారు. ఈ పరిణామాలతో మావోయిస్టులకు ప్రభుత్వంపై విశ్వాసం దెబ్బతిన్నది. వరవర రావు, గద్దర్ వంటి ప్రముఖులు శాంతి చర్చలను కొలిక్కి తీసుకొద్దామని ప్రయత్నించినా విఫలయత్నమే అయింది.

**ఒక్కొక్కరుగా ఎన్కౌంటర్లలో ఆ నలుగురు మృతి....** 2004 శాంతి చర్చల్లో పాల్గొన్న మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరుగా వరున ఎన్కౌంటర్లలో ప్రాణాలు విడిచారు. 2005లోనే జనశక్తి కీలక నేత రియాజ్ ఎన్కౌంటర్లో మరణించారు. అనంతరం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ (ఆర్కే) 2021లో అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఈ నెల 5న ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చలం అలియాస్ సుధాకర్ అలియాస్ గౌతమ్ మరణించారు. ఇవాళ మారేడుమిల్లి–రంపచోడవరం మండలాల సరిహద్దులో జరిగిన ఎన్కౌంటర్లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ మృతి చెందారు. అయితే, 2004 శాంతి చర్చల్లో పాల్గొన్న ఐదుగురిలో ఒకే ఒక్కరు ప్రాణాలతో ఉన్నారు. అతడే.. జనశక్తి నేత కూర దేవేందర్ అలియాస్ అమర్. ఆయన స్వయానా భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్–లెనినిస్ట్) జనశక్తి నేత కూర రాజన్న తమ్ముడు, అరుణోదయ విమలక్కకు సహచరుడు.



## బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్
## హాజరుకాని కిషన్ రెడ్డి, బండి సంజయ్

హైదరాబాద్ : ఏపీ చేపడుతోన్న బనకచర్ల ప్రాజెక్టుపై అఖిలపక్ష ఎంపీలతో తెలంగాణ సచివాలయంలో ఇరిగేషన్ శాఖ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తోంది. బనకచర్ల వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని వివరిస్తున్నారు ఇరిగేషన్ అధికారులు. సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్,రేణుకా చౌదరి,ఎంపీ చామల, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, ఎంఐఎం ఎంపీ ఓవైసీ, బీజేపీ నుంచి డీకే అరుణ, రఘునందన్ రావు, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్రన్ హాజరయ్యారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ హాజరు కాలేదు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్.. బనకచర్లపై కేంద్రానికి ఏపీ ఫ్రీ ఫిజిబులిటీ సమర్పించిందన్నారు.ఏపీ పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘించిందని చెప్పారు.అన్ని పార్టీలను మేము సంప్రదించాం.. బనకచర్లపై అన్ని పార్టీల ఎంపీల అభిప్రాయాలు కీలకమన్నారు. సీఎం సూచనలతో అఖిలపక్ష ఎంపీల సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు.



## మీది (గూగుల్) ఇన్నోవేటివ్ కంపెనీ..
## మాది ఇన్నోవేటివ్ గవర్నమెంట్

హైదరాబాద్: మీది (గూగుల్) ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ గవర్నమెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియాలో మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను బుధవారం (జూన్ 18) హైదరాబాద్‌లో సీఎం రేవంత్ ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. బుధవారం (జూన్ 18) మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు, గూగుల్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన జీవితాలన్నీ డిజిటల్‌గా మారాయని.. మన ఎకానమీ.. గవర్నమెంట్ అన్ని డిజిటల్ అయ్యాయని తెలిపారు. దీంతో డిజిటల్?గా సెక్యూర్‌గా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ హైదరాబాద్లో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్ లో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నామని.. దీనికి ఆనంద్ మహీంద్రా చైర్మెన్?గా ఉంటున్నారని తెలిపారు. సర్టిఫికేట్?లు ఒక్కటే కాదని.. యువతకు నైపుణ్యాన్ని కూడా అందించాలని కోరారు. రాష్ట్రంలోని– కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చబోతున్నామని చెప్పారు.

గూగుల్ క్యాంపస్ 2 ఎకరాల్లో ఉంది.. కానీ మా మహిళల క్యాంపస్ మీ ఆఫీసు ముందు మూడున్నర ఎకరాల్లో ఉందని.. వాళ్ళే మీ కాంపిటీటర్స్ అని అన్నారు. ట్రాన్స్ జెండర్స్?కు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ వ్యవస్థలోకి తీసుకున్నామని గుర్తు చేశారు.

## కాళేశ్వరం కమిషన్ ముందు ఎంపీ ఈటల అసత్యాలు: మంత్రి తుమ్మల



హైదరాబాద్: భారాస హయాంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు క్యాబినెట్ ముందుకు కాళేశ్వరం ప్రాజెక్టు తుది నివేదిక రాలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు.

నాడు ప్రాణహితతో పాటు అన్ని పెండింగ్ ప్రాజెక్టులపై సబ్‌కమిటీ వేశారని.. మేడిగడ్డ విషయం క్యాబినెట్ ముందుకు రాలేదని తుమ్మల చెప్పారు. కాళేశ్వరం కమిషన్ ముందు మాజీ మంత్రి, భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అసత్యాలు మాట్లాడారని ఆరోపించారు. సబ్ కమిటీ నివేదిక ఇవ్వడానికి ముందే మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చారన్నారు. అలాంటప్పుడు సబ్‌కమిటీకి కాళేశ్వరానికి సంబంధమేంటని ప్రశ్నించారు.

## పదేళ్లలో గత ప్రభుత్వం కొత్త విద్యుత్ ప్రాజెక్టు నిర్మించలేదు: భట్టి విక్రమార్క



ఖమ్మం: ప్రజలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ కోసం రూ.13,992 కోట్లు చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన విద్యుత్ అంబులెన్స్‌లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. వరదల సమయంలో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణకు ప్రాణాలకు తెగించి పనిచేశారని అభినందించారు. పదేళ్లలో గత ప్రభుత్వం కొత్త విద్యుత్ ప్రాజెక్టు నిర్మించలేదని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టుల ద్వారానే విద్యుత్ సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ విచారణకు హాజరైన ప్రణీత్‌రావు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఈ విచారణకు నిందితుడు ప్రణీత్‌రావు బుధవారం హాజరయ్యారు. ఎన్నికల ముందు ఎస్ఐబీలో స్పెషల్ ఆపరేషన్ టార్గెట్‌ను ఆయన లీడ్ చేశాడు. రాజకీయ నేతలు, ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేశాడు. ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు ఆదేశాలతో ప్రణీత్‌రావు హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశాడు. నాగోల్ వద్ద మూసీ నదిలో వాటిని పడేశాడు.

**సాక్షిగా హాజరైన టీపీసీసీ అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి..** ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షుల వాంగ్మూలాలను సిట్ రికార్డు చేస్తోంది. సాక్షిగా వాంగ్మూలం ఇచ్చేందుకు సిట్ ఎదుట టీపీసీసీ అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి హాజరయ్యారు.





## గోసేవ చేస్తున్న నిజమైన సీఎం మీరే

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్త గోశాలలు నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ధన్యవాదాలు తెలిపారు. వేల సంఖ్యలో ఆవులు, దూడలు, ఎద్దులను కబేళాల్లో అక్రమంగా చంపుతున్నారని ఆరోపించారు. దీన్ని నివారించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని కోరారు. "మోడల్ గోశాలలు నిర్మించే నిర్ణయం చాలా మంచిది. గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ ఏర్పాటు చేయండి. అందులో నన్ను కూడా సభ్యుడిగా నియమించండి. దేశంలోని ముఖ్యమంత్రులందరిలో గోవులకు సేవ చేసే నిజమైన ముఖ్యమంత్రి ఎవరు అని అడిగితే గుర్తుకు వచ్చే రెండో పేరు మీదే. మొదటి పేరు యోగి ఆదిత్యనాథ్, రెండో పేరు రేవంత్ రెడ్డి. ఇలాంటి పనులు చేస్తే మీకు దేశంలో మంచి గుర్తింపు వస్తుంది. తెలంగాణలో గోవధను నిషేధించాలి" అని రాజాసింగ్ కోరారు.



## తెలంగాణ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అఖిలపక్ష ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో పాటు, భాజపా ఎంపీలు డీకే ఆరుణ, రఘునందన్‌రావు, భారాస ఎంపీ రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. "గోదావరి–బనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం. రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావరి–బనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫీజిబులిటీ నివేదిక సమర్పించింది" అని వివరించారు.

## ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస: ఎంపీ ధర్మపురి అర్వింద్





హైదరాబాద్: బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయమేంటో చెప్పామంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గర సమాధానం లేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసం ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "భాజపా భరోసా కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలను స్వీకరించాం. అనేక మంది దివ్యాంగులు వచ్చి తమ సమస్యలు తెలిపారు. వారికి ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రతి పల్లెలో కాంగ్రెస్ ఇమేజ్ భూస్థాపితం అయింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస. కేసీఆర్ డైరెక్షన్‌లో తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆయన చేస్తున్న పని పవర్ పాయింట్ ప్రజంటేషన్. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే నాటకాలాడుతున్నారు. భాజపాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. నన్ను సిట్ పిలవలేదు. మహేశ్‌కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదు" అని అర్వింద్ వ్యాఖ్యానించారు.



## సెక్రటేరియట్‌లో మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్: ఇటీవల రాష్ట్ర కేబినెట్‌లో చేరిన వివేక్ వెంకటస్వామి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2025, జూన్ 18న సెక్రటేరియట్ సెకండ్ ఫ్లోర్‌లో తనకు కేటాయించిన చాంబర్‌లో రాష్ట్ర కార్మిక, ఉపాధి, మైనింగ్, ఫ్యాక్టరీల శాఖ మంత్రిగా ఆయన ఛార్జ్ తీసుకున్నారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా తన చాంబర్‌లో మంత్రి వివేక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీమణి సరోజాతో కలిసి ప్రత్యేక పూజాల్లో పాల్గొన్నారు. అంతకుముందు బాధ్యతల స్వీకరణ కోసం సచివాలయానికి వెళ్లిన మంత్రి వివేక్‌కు ఆయన చాంబర్ ముందు పూర్ణకుంభంతో పూజారులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రి వివేక్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయన కుమారుడు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి వివేక్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఆయనను కలిసేందుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు సెక్రటేరియట్ కు తరలివచ్చారు. మంత్రిగా చార్జ్ తీసుకున్న వివేక్?కు పలువురు నేతలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఎకానమీకి అత్యంత కీలకమైన మైనింగ్ శాఖ బాధ్యతలను మంత్రి వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్ రెడ్డి కేటాయించిన సంగతి తెలిసిందే. గనుల ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు కార్మికుల సంక్షేమం, ఉపాధి, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ లాంటి కీలక బాధ్యతలు ఆయనకు అప్పగించారు. వివేక్‌కు ఉన్న అనుభవం, రాజకీయ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శాఖలను కేటాయించారు. గతంలో వివేక్ తండ్రి దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) కూడా1978–1982 మధ్య ఉమ్మడి ఏపీలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. కేంద్రంలోనూ కార్మిక మంత్రిత్వ శాఖను నిర్వహించారు. వివేక్ అన్న గడ్డం వినోద్ కూడా ఉమ్మడి ఏపీలో వైఎస్ హయాంలో 2004 నుంచి 2009 వరకు కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. ఇలా వివేక్ కుటుంబానికి కార్మికులతో సుదీర్ఘ అనుబంధం ఉన్న నేపథ్యంలో ఆయనకు దీనితోపాటు ఉపాధి, మైనింగ్ శాఖలు నిర్వహించే అవకాశం దక్కింది.





## 'కబుర్ల దేవత'ను వరించిన కేంద్ర బాల సాహిత్య పురస్కారం

దిల్లీ: కేంద్ర సాహిత్య అకాడమీ బుధవారం బాలసాహిత్య, యువ పురస్కారాలను ప్రకటించింది. మొత్తంగా 24 భాషల్లో ఉత్తమ రచనలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. తెలుగు భాషకు సంబంధించి గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' (స్టోరీ) పుస్తకాన్ని కేంద్ర బాల సాహిత్య పురస్కారం వరించగా.. ప్రసాద్ సూరి రచించిన మైరావణ నవల సాహిత్య యువ పురస్కారానికి ఎంపికైంది. భారతీయ భాషల్లో సాహిత్య రంగంలో సుప్రసిద్ధమైన వ్యక్తులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి పలు పుస్తకాలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు సిఫారసు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన బుధవారం సమావేశమైన సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఈ పురస్కారానికి ఎంపికైన పుస్తకాల పేర్లను ప్రకటించింది. అయితే, ఈ ఏడాది డోగ్రీ భాషకు సంబంధించి యువ పురస్కారం ప్రకటించలేదు. దీంతో ఈ విభాగంలో 23 భాషల్లో ప్రచురితమైన పుస్తకాలకు మాత్రమే యువ పురస్కారాలు ప్రకటించారు

ఈ పురస్కార విజేతలకు త్వరలో దిల్లీలో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు. దీనికింద గ్రహీతకు జ్ఞాపికతో పాటు రూ.50వేల నగదు అవార్డుతో సన్మానిస్తారు. తెలుగు భాషకు సంబంధించి బాల సాహిత్య పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా కన్నెగంటి అనసూయ, డా.ఎం భూపాల్ రెడ్డి, కిలపర్తి దాలినాయుడు వ్యవహరించగా.. యువ పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా జీఎస్ చలం, కుప్పిలి పద్మ, పెద్దింటి అశోక్ కుమార్ ఉన్నారు.

# గణిశాస్త్ర మేధావి బ్లేజ్ పాస్కల్ – జూన్ 19...బ్లేజ్ పాస్కల్ జయంతి

అన్ని వయసులవారూ నేడు వాడే చిన్ని యంత్రం కాలుక్యులేటర్. కూడికలు, తీసివేతలు, హెచ్చ వేతలు, భాగహారాలు ... ఒకటేమిటి, లెక్కల్లో వచ్చే ప్రతి అంశాన్నీ అతివేగంగా పరిష్కరించి తెరమీద చూపిస్తుంది. ఇది విద్యార్థులకు, వ్యాపార సంస్థలకు, అనేకులకు అనేక విధాలుగా ఉపయోగ పడుతుంది . దీన్ని కనుగొన్నశాస్త్రజ్ఞుడే బ్లెయిస్ పాస్కల్ . పాస్కల్ (జూన్ 19, 1623 – ఆగష్టు 19, 1662) పాస్కల్ సూత్రం కనిపెట్టిన శాస్త్రవేత్త. ప్రఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రజ్ఞుడు, ఆధ్యాత్మిక తత్వవేత్త. బ్లేజ్ పాస్కల్ జూన్ 19, 1623 న ఫ్రాన్స్ యొక్క దక్షిణ – మధ్య ప్రాంతంలో ఆవర్నే ప్రాంతంలో క్లెర్మాంట్ లో జన్మించాడు. ఈ ప్రాంతం ఉంది. చిన్న వయసులోనే మరణించిన గణిత మహా మేధావి. ఫ్రాన్స్ కి చెందిన పాస్కల్ 7 యేండ్ల వయస్సు నుండే జామెట్రీ పట్ల విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తూ అందరినీ ఆశ్చర్య పరచే వాడట, 12 ఏళ్ళ వయస్సులోనే ఒక త్రిభుజం లోని మూడు కోణాల మొత్తం రెండు లంబకోణాల మొత్తానికి సమానంగా ఉంటుందనే సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టాడు. దీంతో ఈయన తండ్రి పాస్కల్ ను గణితం చదవడానికి ఎక్కువగా ఆసక్తి చూపాడు. అందరూ వేనోళ్ళ కొనియాడుతున్న "యూనివర్సల్ థీరం ఆఫ్ జామెట్రీ" పాస్కల్ రూపొందించినదే. పదహారేళ్ల వయసులో శంఖు పరిచ్ఛేదాల గురించి గొప్ప వ్యాసం రాసి మహామహా గణితవేత్తలే ముక్కున వేలు వేసుకునేట్టు చేశాడు పాస్కల్. ఆ కృషిలో బయట పడ్డదే పాస్కల్ సిద్ధాంతంగా తరువాత పేరు పొందింది. శంఖు పరిచ్ఛేదంలో అంతర్లిఖితమైన ఏదైనా షడ్భుజి యొక్క అభిముఖంగా ఉండే అంచులని కలుసుకునే వరకు పొడిగిస్తే, ఆ మూడు జతల అభిముఖ అంచులు కలిసే మూడు ఖండన బిందువులు ఒకే సరళరేఖలో ఉంటాయి. ఈ సిద్ధాంతం ప్రకారం... షడ్భుజి ఆరు భుజాలు (లేదా బాహువులు) గల బహుభుజి. ఆ భుజాలు సమానంగా ఉండనక్కర్లేదు. ఆరు భుజాలు ఉన్నాయి గనుక ఒకటికి, నాలుగోది అభిముఖంగా ఉంటాయి. అలాగే 2–5, 3–6 జతల భుజాలు కూడా అభిముఖంగా ఉంటాయి. ఈ అభిముఖంగా ఉండే భుజాల జతలని పొడిగిస్తే ఎక్కడో అక్కడ కలుస్తాయి. అలా వచ్చిన మూడు ఖండన బిందువులు ఒకే సరళ రేఖ మీద ఉంటాయని సిద్ధాంతం చెప్తుంది. పాస్కల్ సిద్ధాంతం 1639 లో ప్రచురించ బడింది, "ది కోనిక్స్ ఎస్సే". పాస్కల్ యొక్క ఆధ్యాత్మిక షడ్భుజి అని పిలుస్తారు. ఆయనకు 17 ఏళ్ళు వచ్చినప్పుడు ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు డెస్ కార్టెస్ ఆయనలో ఒక గొప్ప మేధావిని చూసి ప్రశంసించాడు. అంతటి సమర్థుడు బ్లెయిస్ పాస్కల్. పాస్కల్ త్రిభుజం గురించి, దాని లక్షణాల గురించి 20ఏళ్ళ వయసులో ఒక పుస్తకం రాశాడు. పాస్కల్ జీవితమంతా ఫ్రాన్స్ లోనే గడిచింది. ఆయన తండ్రి అక్కౌంటెంట్ గా పని చేసేవాడు. రాత్రీ పగలూ లెక్కలు చేసేవాడు. తండ్రి పడుతున్న కష్టం చూచి పాస్కల్ లెక్కలు చేసే యంత్రాన్ని రూపొందించాడు. ఈ కాలిక్యులేటింగ్ మెషిన్ కూడికలు, తీసివేతలు, గుణింతాలు, భాగహారాలు వంటివి చేసిపెట్టేది. ఆ మెషీన్ పాస్కల్ తండ్రికి ఎంతగానో ఉపయోగపడేది. అయితే ఈ యంత్రాన్ని తయారు చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. కారణం దానికయ్యే ఖర్చు ఎక్కువ కావటమే. అయినప్పటికీ చాలా కాలం తరువాత 1892 విల్లియం బరఫ్స్ అనే అమెరికన్ పాస్కల్ నమూనాను ఆధారంగా



చేసుకునే ఓ కాలిక్యులేటింగ్ మెషీన్ రూపొందించాడు. పాస్కల్ సూత్రం తెలియని విద్యార్థి ఉండరు. ద్రవ పదార్ధంలో ఏదైనా ఒక బిందువు వద్ద పీడనాన్ని ఉపయోగించడం జరిగితే ఆ పీడన ప్రభావం ఆ ద్రవ పదార్ధం అన్ని వైపులకు సమానంగా విస్తరిస్తుంది. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని సిరెంజ్ ని, హైడ్రాలిక్ ప్రెస్ ను, హైడ్రాలిక్ బ్రేక్ ను రూపొందించటం జరిగింది. పాస్కల్ ఒక త్రిభుజాన్ని కూడా నిర్మించాడు. దీన్ని పాస్కల్ త్రిభుజం అంటారు. ఈ త్రిభుజం సహాయంతో ప్రాబబిలిటీ సమస్యలను సునాయాసంగా చేయవచ్చు. 1643 లో చేసిన గణిత శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత్త ఎవాంజెలిస్టా టోరిసెల్లి రూపొందించిన ప్రయోగాలను పునరావృతం చేశాడు. 1646 నుండి పాస్కల్ శూన్యతను తనిఖీ చేసే ఎంపికలను అధ్యయనం చేయడానికి తనను తాను అంకితం చేసుకున్నాడు. 1653 లో పాస్కల్ వాతావరణ పీడనం గురించి ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. హైడ్రో స్టాటిక్స్ అంశం చాలా వివరణాత్మక రీతిలో అభివృద్ధి చేయబడిన మొదటి గ్రంథంగా ఇది పరిగణించ బడుతుంది. పాస్కల్ శాస్త్రవేత్త మాత్రమే కాదు. తత్వవేత్త కూడా.

రచయిత కూడ, మతపరమైన పుస్తకాలను ఎన్నింటినో రాశాడు. జామెట్రీ, ప్రాబబిలిటీ, హైడ్రోస్టాటిక్స్, ఎంటిగ్రల్ కాలిక్యులస్ ల అంశాల మీద ఎన్నో విలువైన పరిశోధనలు చేశాడు. పాస్కల్ ప్రధాన రచనలు పాస్కల్ యొక్క సిద్ధాంతం, పాస్కలిన్, శూన్యత యొక్క ఉనికి లేదా వాతావరణ పీడనమైన పుస్తకం. 1659 లో తీవ్ర అనారోగ్యం పాలై, పాస్కల్ 1662 లో కన్ను మూశాడు. మొదటి కాలిక్యులేటర్ నుండి మొదటి ప్రజా రవాణా సేవ వరకు ఆవిష్కరణలతో అతను చిన్న వయస్సు నుండే ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చాడు. ఆయన వెలువరించిన శాస్త్రీయ వాస్తవాలు మాత్రం ఎంతో మందికి మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# ఇజ్రాయెల్ పై ఇరాన్ చీకటి దెబ్బే ఎందుకో తెలుసా..?



ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య ఐదు రోజులుగా భీకర యుద్ధం అవిరామంగా సాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ గగనతల దాడులు చేస్తుంటే.. ఆ దేశంలోని వ్యూహాత్మక ప్రాంతాలపై ఇరాన్ క్షిపణులను ప్రయోగిస్తోంది. ఈ సమయంలో.. అసలు ఇరాన్ క్షిపణులను రాత్రుల్లే ఎందుకు ప్రయోగిస్తోంది అనే చర్చ తెరపైకి వచ్చింది. దానికి కారణమూ తెలిసింది. అవును... సుమారు ఐదు రోజులుగా ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య జరుగుతోన్న భీకర యుద్ధంతో పశ్చిమాసియాలోని ప్రజానీకం వణికిపోతున్నారు. ఈ క్రమంలో.. ఇరాన్ కూడా దూకుడు పెంచింది. ఇజ్రాయెల్ పై సెలక్టివ్ గా దాడులు చేస్తుంది. ఈ నేపథ్యంలో.. ఇరాన్ రాత్రి వేళల్లోనే ఎక్కువగా క్షిపణి దాడులు ఎందుకు చేస్తుందనే ప్రశ్న తెరపైకి వచ్చింది. దీనికి ఓ సాంకేతిక కారణం ఉందంట. వాస్తవానికి ప్రత్యర్థిపై పగలు దాడి చేశామా, రాత్రులు దాడి చేశామా అనేది పెద్ద విషయం కాదు! కాకపోతే.. నిశిరాత్రి దాడి చేయడం వెనుక కొన్ని మానసిక యుద్ధతంత్రం వంటివి ఉన్నాయని అంటారు. ఇందులో భాగంగా... ఇజ్రాయెల్ వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేయడం ఇందులో ఒకటి కావొచ్చు. అయితే.. రాత్రి వేళల్లోనే క్షిపణి దాడులు చేయడం వెనుక ఇరాన్ కష్టాలు ఇరాన్ కి ఉన్నాయని అంటున్నారు. ఇందులో భాగంగా.. ఇరాన్ వద్ద ఉన్న క్షిపణుల్లో 2,000 కిలోమీటర్లకు పైబడి రేంజి ఉన్నవి మాత్రమే ఇజ్రాయెల్ లోని లక్ష్యాలను చేరుకోగలవని చెబుతున్నారు. అయితే.. ఇవి యుద్ధ విమానాల లాగా వాతావరణం నుంచి ఆక్సిజన్ ను ప్రొపెల్షన్ లోకి తీసుకోవు. ఈ నేపథ్యంలో కంబస్టన్ కోసం కచ్చితంగా ఇంధనం, ఆక్సిడైజర్ ఉండి తీరాల్సిందే. దీంతో... ద్రవ ఇంధనంతో పనిచేసేవి, ఘన ఇంధనంతో పనిచేసేవి ఉంటాయి. ప్రస్తుతం ఇరాన్ వద్ద ఉన్న దీర్ఘశ్రేణి "షబాబ్" క్షిపణుల్లో ద్రవ ఇందనాన్ని వినియోగిస్తున్నారు. వీటిని ప్రయోచించడానికి మిస్సైల్ లో ఇంధనం నింపడం ఓ పెద్ద పరీక్ష. ఇందులో భాగంగా ఆ క్షిపణి లోని రెండు వేర్వేరు ట్యాంకులలో ఇంధనం, ఆక్సిడైజర్ లను నింపాలి. దీనికి కాస్త ఎక్కువ సమయం పట్టడంతోపాటు.. ప్రమాదకరమైన ప్రక్రియ కూడా. దీనికి ఒకే చోట ఉండే లాంచ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, అదనపు సిబ్బంది అవసరం. ఈ సమయంలో.. శత్రువు ఉపగ్రహాలు, నిఘా విమానాలు ఈ క్షిపణికి పసిగట్టే అవకాశాలు అత్యధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో రాత్రి వేళల్లోనే ఈ ప్రక్రియను చేపడతారని చెబుతున్నారు. ఇక ద్రవ ఇందనం నింపే ఫతేహ్–110 వంటి క్షిపణుల్లో ఆక్సిడైజర్ కలిసే ఉంటుంది. అందువల్ల దీన్ని ఎప్పుడంటే అప్పుడు ఉపయోగించవచ్చు. అందువల్లే... ఇరాన్ ద్రవ, ఘన ఇంధన క్షిపణులు కలిపి వాడుతోంది. తమ ప్లాట్ ఫామ్ లు, ట్రక్కులు వెంటనే శత్రువు కంటపడకుండా కాపాడుకొంటూ.. ప్రత్యర్థులను దెబ్బతీసి భయపెట్టేలా వ్యూహాలు రచిస్తోంది. మరోవైపు ఇరాన్ వద్ద ఉన్న పాతతరం యుద్ధ విమానాలు ఇజ్రాయెల్ కు చేరాలంటే.. ఇరాక్, సిరియా, సౌదీ, జోర్డాన్, లెబనాన్ మొదలైన దేశాల్లోని కొన్నింటి గగనతలం పై నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అయితే.. అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయెల్ పై దాడికి తమ గగనతలాన్ని ఉపయోగించుకుంటామంటే ఆ దేశాలు అనుమతించే అవకాశం లేదు! దీంతో.. ఆ క్షిపణులనే నమ్ముకుని చీకట్లో యుద్ధం చేస్తోంది ఇరాన్! కాగా.. ఇరాన్ వద్ద ఇజ్రాయెల్ దగ్గరున్నటువంటి అత్యాధునిక విమానాలు లేవనే సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ సాంకేతికంగా చాలా అప్ డెటెడ్ అవ్వడంతో పాటు అమెరికాలాంటి మిత్రుడ్ని కలిగి ఉంది. అయితే.. ఇరాన్ వద్ద ఎప్పుడో అమెరికా, సోవియట్ రష్యా పాత విమానాలే ఉన్నాయి. అందుకే.. ఇరాన్ పూర్తిగా క్షిపణులపై ఆధారపడుతోంది! చీకట్లో దాడులు చేస్తోంది!

# స్థానిక సంస్థల ఎన్నికలు: బీసీ రిజర్వేషన్ల సంక్లిష్టం

## కాంగ్రెస్ 42% హామీ అమలు తీరుపై చర్చలు

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి సమీపిస్తున్న వేళ, బీసీ రిజర్వేషన్ల అంశం రాజకీయ, న్యాయ, సామాజిక వేదికలన్నింటినీ కలకలం రేపుతోంది. ముఖ్యంగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన "బీసీలకు 42% రిజర్వేషన్" హామీ, ఇప్పుడు కార్యరూపం దాల్చే దశకు వచ్చినపుడు అనేక ప్రశ్నలు, సందేహాలు, అడ్డంకుల మధ్య దూసుకు పోతోంది. స్థానిక సంస్థల ఎన్నికల సమీపంలో బీసీ రిజర్వేషన్ల అంశం మరోసారి సమగ్ర చర్చకు దారి తీసింది. తెలంగాణలో ఇటీవల ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో బీసీలకు స్థానిక సంస్థల స్థాయిలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టంగా ప్రకటించింది. ఈ హామీ సామాజిక న్యాయ పరిరక్షణలో కొత్త ఒరవడి తీసుకు రాగలదా? లేక మరొకసారి రాజకీయ వాగ్దానంగా మిగిలి పోతుందా? అన్న ప్రశ్నలు ప్రజాస్వామ్య పరిరక్షక వర్గాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. భారత రాజ్యాంగం 73వ, 74వ సవరణల ద్వారా దేశంలో ప్రజాపాలన వికేంద్రీకరణ దిశగా పదునెక్కింది. గ్రామ పంచాయతీ నుండి మహానగర పాలక సంస్థల వరకు ఎన్నికల ద్వారా ఏర్పడే స్థానిక సంస్థలకు సముచితంగా ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకోవడంలో సామాజిక న్యాయం కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించి రాజకీయ ప్రాతినిధ్యాన్ని గట్టి చేయాలనే ఆవశ్యకత రాజ్యాంగమే గుర్తించింది. అయితే ఈ రిజర్వేషన్ల అమలులో అనేక అనిష్టపరిణామాలు, న్యాయ సవాళ్లు, రాజకీయ లబ్ధిపరచుకునే ప్రయత్నాలు దర్శనమిస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశం అత్యంత సంక్లిష్టంగా రూపాంతరం చెందింది. రాష్ట్రానికి రాష్ట్రానికి బీసీ వర్గీకరణలో భిన్నత ఉంది. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎటువంటి స్థితిలో ఉన్నారన్నదానిపై సమగ్ర అధ్యయనం చేయకుండానే వాటికి కోటాలను ఖరారు చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతోంది. సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పుల్లో బీసీలకు రిజర్వేషన్ అమలులో మూడు ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఒకటి – శాస్త్రీయంగా సేకరించిన డేటా ఆధారంగా బీసీల వెనుకబడిన స్థితిని నిర్ధారించాలి. రెండు – రిజర్వేషన్ల ప్రభావం ప్రజాస్వామ్య సమతుల్యంపై ఎలా ఉంటుందో పరిశీలించాలి. మూడవది %–% మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. ఈ నిబంధనల మధ్య కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్ హామీ రాజ్యాంగ బద్ధతకు అనుగుణమా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో బీసీల సంఖ్య సుమారు 50 శాతం వరకు ఉన్నదని కొన్ని సర్వేలు సూచించినా, రాష్ట్ర స్థాయిలో శాస్త్రీయంగా ధృవీకరించిన డేటా ఇప్పటికీ అందుబాటులో లేదు. 2010లో సుప్రీంకోర్టు మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో ఇచ్చిన తీర్పులో, లెక్కించ తగిన డాటా లేకుండా రిజర్వేషన్లు ఇవ్వడం సబబు కాదని స్పష్టం చేసింది. ఈ తీర్పు ఆధారంగా ఇటీవలే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లపై ఎన్నికల ప్రక్రియ నిలిపివేయబడ్డ సందర్భాలు ఉన్నాయి. అదే బాటలో 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బీసీ రిజర్వేషన్ల గడిచిన అనుసరణలు సైతం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు ముందు ఆయా న్యాయ మార్గదర్శకాలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటు బీసీ వర్గాలు మాత్రం 42 శాతం హామీ అమలుపై స్పష్టత కోరుతున్నాయి. దశాబ్దాలుగా స్థానిక సంస్థల రాజకీయాల్లో బీసీ వర్గాల అధికార ప్రాతినిధ్యం పెరిగినప్పటికీ, వాటిలోనూ కొద్ది వర్గాలకే పదేపదే అవకాశాలు లభిస్తున్నాయని




విమర్శలు వినిపిస్తున్నాయి. బీసీల్లోని వివిధ ఉపవర్గాలకు న్యాయం జరగాలంటే, రిజర్వేషన్లలో శ్రేణీకరణ అవసరమని పలువురు నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన రోహిణీ కమిషన్ నివేదిక ప్రకారం, బీసీల్లో 15 శాతం వర్గాలే దాదాపు 80 శాతం రిజర్వేషన్‌ను వినియోగిస్తున్నాయని తేలింది. ఈ వాస్తవాల నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ పెంపునే కాకుండా, ఆ రిజర్వేషన్ పంపిణీ పద్ధతి పట్ల కూడా స్పష్టత అవసరం. ఇంకా మరో సమస్య ఏమిటంటే, బీసీ రిజర్వేషన్ల అమలును స్థానిక రాజకీయ నాయకులు, పార్టీలు నియంత్రిస్తున్న విధానం. వాస్తవంగా సామాజికంగా వెనుకబడిన వారికి అవకాశం రావాల్సిన చోట, పార్టీ అధినేతల బంధువులు, అనుచరులు, అదే వర్గానికి చెందినవారే పదే పదే పదవులను అధిష్ఠించడ మవుతోంది. దీని వలన అసలు రిజర్వేషన్ ఉద్దేశానికి విరుద్ధంగా సామాజిక సమానత్వం దెబ్బతింటోంది. ఇక కాంగ్రెస్ హామీపై వస్తున్న విమర్శల్లో ఒకటి %–% ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి స్పష్టమైన అమలుక్రమాలు లేకపోవడమే. బీసీ రిజర్వేషన్ 42 శాతం చట్టంగా అమలవ్వాలంటే అసెంబ్లీలో చట్టం చేయడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న మహిళా, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తంగా 50 శాతం మించకుండా ఉండాలన్న రాజ్యాంగ పరిమితిని ఎట్టి పరిస్థితుల్లోనూ మించలేము. అటువంటి పరిస్థితిలో బీసీలకు అదనంగా రిజర్వేషన్ ఇవ్వాలంటే, కేంద్ర రాజ్యాంగ సవరణల సహకారం కూడా అవసరమవుతుంది. బీసీ రిజర్వేషన్ల అంశం కేవలం సంఖ్యల గణితం కాదనే విషయాన్ని గుర్తించాలి. ఇది శతాబ్దాల నాటి అసమానతల పరిహార యత్నం. ప్రజాస్వామ్యంలో ప్రతినిధిత్వం కేవలం ఓట్ల మీద ఆధారపడి ఉండకూడదు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నదే రిజర్వేషన్ లక్ష్యం. కానీ ఆ లక్ష్యాన్ని ఆచరణలో అమలు చేయాలంటే, సమగ్ర డేటా, శాస్త్రీయ పద్ధతులు, పారదర్శక విధానాలు, రాజకీయ సంకల్పం అవసరం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ బీసీ వర్గాలకు ఆశను కలిగించినా, దానిని కార్యరూపం దాల్చించాలంటే రాజకీయ ప్రకటనలకన్నా పైగా చట్టబద్ధ ప్రణాళిక అవసరం. ఒకవేళ ప్రభుత్వం శాస్త్రీయంగా బీసీ జనాభా గణాంకాలను సేకరించి, హైకోర్టు %–% సుప్రీంకోర్టుల మార్గదర్శకాలను అనుసరిస్తూ, అవసరమైతే కేంద్రంతో రాజ్యాంగ సవరణపై చర్చ జరిపితేనే ఈ సమస్యకు సుస్థిర పరిష్కారం కనుగొన గలుగుతుంది. లేదంటే ప్రతి ఎన్నికల నాటికి ఇదే సమస్య రాజకీయం చెంది, బీసీల సామూహిక ఆకాంక్షలు ఒక రాజకీయ నినాదంగా మిగిలిపోతాయన్నది దురదృష్టకరం. బీసీ రిజర్వేషన్ల అంశం పై దృష్టి సారించే సమయం ఇది. ఇది కేవలం ఓట్ల కోసం తాత్కాలిక పథకంగా కాక, శాశ్వత సామాజిక న్యాయ సాధనగా మారేందుకు పాలకుల చిత్తశుద్ధి నిర్దేశకంగా నిలవాలి. ప్రజాస్వామ్యంలో నమ్మకం నిలబెట్టాలంటే, హామీల అమలు తప్పనిసరి. హామీలను కార్యరూపం దాల్చే విధంగా చట్టం, కార్యాచరణ రూపొందించి, సామాజిక న్యాయాన్ని సమగ్రమైన నైతికతతో స్థాపించడమే ఈ వ్యవస్థకు గౌరవం తీసుకురావగల మార్గం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# జూ.క్రికెటర్లకు బోన్ మ్యారో.. ఏజ్ ఫ్రాడ్ చెల్లదు.. బీసీసీఐ కీలక నిర్ణయం

క్రీడల్లో ప్రధానమైన మోసం.. వయసు దాచడం.. ఎక్కువ వయసు వారైనా.. తక్కువ వయసును చూపి ఎంపికకు వెళ్తుంటారు. ఇది అత్యధికంగా క్రికెట్ లోనే జరుగుతుంది. అత్యంత ఆదరణ ఉన్న క్రీడ కాబట్టి ఇది సహజం అనుకోవాలి. జాతీయ స్థాయికి ఎదిగిన ఆటగాళ్ల విషయంలోనూ గతంలో ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు రావడం గమనార్హం. తాజాగా కుర్ర సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా దీనికి అతీతుడు కాదు. కొందరు ఆటగాళ్ల వయసు ధ్రువీకరణకు సంబంధించి నకిలీ పత్రాలు సమర్పిస్తుండడం తరచూ సమస్యలు తెస్తోంది. ఇది వారి ఎంపిక తర్వాత బయటపడుతుండడంతో విమర్శలకు తావిస్తోంది. అందుకనే బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. జూనియర్ క్రికెట్ లో ఆయా వయసు విభాగాల క్రికెటర్లకు బోన్ మ్యారో (ఎముక వయసు నిర్ధారణ) పరీక్ష చేయనుందని సమాచారం. ఈ పద్ధతిలో అయితే కచ్చితంగా వయసు నిర్ధారణ అవడమే కారణం. ఇప్పుడు టీడబ్ల్యూ3 పద్ధతిని అవలంబిస్తున్నారు. దీంతోపాటు ఏం1



విధానం కూడా తెచ్చింది. బాలుర అండర్–16లో ఎముక పరీక్ష కటాఫ్ ను 16.5 ఏళ్లు (ఎముక వయసు 16.4 ఏళ్లు)గా నిర్ణయించింది. బాలికల అండర్ 15లో 15 ఏళ్లుగా నిర్ధారించగా.. ఎముక పరీక్ష సమయంలో 14.9 ఏళ్లు మాత్రమే ఉండాలి. ఏ ప్లస్ 1 విధానంలో బాలుర విభాగంలో అండర్– 16లో ఆటగాడు ప్రస్తుత సీజన్ లో బోన్ మ్యారో టెస్టుకు హాజరై ఫలితం 15.4 ఏళ్లుగా తేలితే.. మరుసటి ఏడాది పరీక్షకు హాజరవ్వాల్సిన అవసరం ఉండదు. బోన్ ఏజ్ 15.5 కావడమే దీనికి కారణం.

ఇది బాలికల విభాగంలోనూ వర్తిస్తుంది. ఇక వైభవ్ సూర్యవంశీ తాజా ఐపీఎల్ సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడాడు. నిరుడు నవంబరులో మెగా వేలం సమయానికి అతడి వయసు 13 ఏళ్ల 288 రోజులే. కానీ, వైభవ్ కు 15 ఏళ్లని ఆరోపణలు వచ్చాయి. దీంతో వైభవ్ తండ్రి వివరణ ఇచ్చాడు. తమ అబ్బాయికి 8 ఏళ్ల వయసులో బీసీసీఐ బోన్ మ్యారో టెస్టుకు హాజరైనట్లు చెప్పాడు. తద్వారా ఆరోపణలు నిజం కాదని తేల్చిచెప్పాడు. ఈలోగానే బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# ఆంబులెన్స్ లేదు.. పసిపాప మృతదేహంతో 90 కి.మీ. ప్రయాణించిన గిరిజనుడు!

భారతదేశం ఆర్థికంగా దూసుకుపోతోంది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి, రాబోయే ఐదేళ్లలో మూడో స్థానానికి చేరుకుంటామని పాలకులు గొప్పగా చెబుతున్నారు. అయితే ఈ అభివృద్ధి అంతా కేవలం సంపన్నులకే పరిమితమా? విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు ఇప్పటికీ పేదలకి, ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల వారికి అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి. ఇటీవల, మధ్య తరగతి ప్రజలకు కూడా ఇవి భారంగా మారాయి. ఈ వాస్తవానికి అద్దం పడుతూ మహారాష్ట్రలో జరిగిన ఒక హృదయ విదారక ఘటన గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలోని తీవ్రమైన లోపాలను, ప్రత్యేకించి గిరిజన సమాజాలకు అందుబాటులో లేని సేవల దుస్థితిని బయటపెట్టింది.

**–ప్రసవ సమస్యల నుండి విషాదం వరకు...** మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాకు చెందిన కట్కారి గిరిజన సమాజానికి చెందిన సఖారామ్ కవార్ (28), అతని భార్య అవిత (26) లు అనుభవించిన విషాదం యావత్ దేశాన్ని కదిలించింది. జూన్ 11, 2025న అవితకు ప్రసవ వేదనలు ప్రారంభమైనప్పుడు, వారి గ్రామం జోగల్‌వాడిలో అంబులెన్స్ కోసం ఎంత ఎదురుచూసినా ఎటువంటి సహాయం అందలేదు. స్థానిక ఆశ కార్యకర్త అందుబాటులో లేకపోవడం, అత్యవసర నంబర్ 108కు కూడా స్పందన రాకపోవడం వారి ఆశలను నీరుగార్చింది. చివరికి ఒక ప్రైవేట్ వాహనంలో ఖోడాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నప్పటికీ, అక్కడ గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అక్కడి నుండి మోఖాడ గ్రామీణ




ఆసుపత్రికి, ఆపై నాసిక్ సివిల్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఆలస్యం, సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడం శిశువు మరణానికి దారితీసిందని సఖారామ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

**–ఆసుపత్రుల నిర్లక్ష్యం, అమానవీయ వైఖరి...** నాసిక్ సివిల్ హాస్పిటల్‌లో అవిత మృత ఆడ శిశువును ప్రసవించింది. ఆసుపత్రి మృత శిశువు శరీరాన్ని సఖారామ్‌కు అప్పగించినప్పటికీ, దాన్ని ఇంటికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ సేవలను అందించడానికి నిరాకరించింది. దిక్కుతోచని స్థితిలో సఖారామ్ కేవలం ?20 ఖరీదు చేసే ఒక క్యారీ బ్యాగ్‌ను కొని, శిశువు మృతదేహాన్ని గుడ్డలో చుట్టి, 90 కిలోమీటర్ల దూరం రాష్ట్ర రవాణా బస్సులో తన గ్రామానికి తీసుకెళ్లవలసి వచ్చింది. ఈ దారుణం అక్కడితో ఆగలేదు. అవితను డిశ్చార్జ్ చేసినప్పుడు కూడా అంబులెన్స్ సేవలు నిరాకరించబడ్డాయి. ప్రసవం తర్వాత బలహీనమైన స్థితిలో ఉన్న ఆమె కూడా బస్సులోనే తిరిగి ప్రయాణించవలసి వచ్చింది. మోఖాడ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ భౌసాహెబ్ ఛట్టర్ అంబులెన్స్ చెడిపోయిందని చెప్పినప్పటికీ, ఈ సంఘటన ఆరోగ్య వ్యవస్థలోని నిర్వాహణ లోపాలను, మానవత్వం లోపించిన వైఖరిని స్పష్టం చేస్తుంది.

**గిరిజన సమాజాలకు అందని వైద్యం.. వ్యవస్థాగత వైఫల్యాలు....** ఈ ఘటన గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సౌకర్యాల అందుబాటు లేకపోవడాన్ని, అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి వెలుగులోకి తెచ్చింది. అంబులెన్స్ సేవలు సకాలంలో అందకపోవడం, ఆసుపత్రుల్లో సరైన చికిత్స లేకపోవడం, ఆపై సఖారామ్‌పై పోలీసు దాడి జరగడం వంటివి వ్యవస్థాగత వైఫల్యాలను స్పష్టంగా సూచిస్తున్నాయి. గిరిజన సమాజాలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక అసమానతలు వారికి ప్రాథమిక హక్కులైన ఆరోగ్య సేవలను కూడా అందని దూరంలోకి నెట్టేస్తున్నాయి. ఈ విషాదకర సంఘటన గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలను తక్షణమే బలోపేతం చేయాల్సిన అవసరాన్ని, అంబులెన్స్ సేవలను మెరుగుపరచాల్సిన ప్రాముఖ్యతను, గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలను అందుబాటులోకి తేవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతోంది. భారతదేశం ఆర్థికంగా ఎంత ఎదిగినా, తన పౌరులకు కనీస ఆరోగ్య భద్రతను కల్పించలేకపోతే, ఆ అభివృద్ధికి అర్థం ఉండదు. ఈ సంఘటన నుండి గుణపాఠం నేర్చుకొని, మరెవరికీ ఇలాంటి దుస్థితి ఎదురుకాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

# చురకలు
## సంపాదకీయం

### టెన్షన్ పెడుతోన్న జలసంధి.. ఏమిటిది?

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతోంది. దీంతో.. ఇప్పటికే చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలో శనివారం బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్ కు 6 డాలర్లకు పైగా పెరిగి ఐదు నెలల గరిష్ట స్థాయి 78 డాలర్లను దాటింది. ఇక ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకు కూడా వ్యాపిస్తే మాత్రం.. ప్రపంచ ఇంధన రవాణాకు జీవనాడిగా చెప్పే ఓ జలసంధి మూతపడే ప్రమాదం ఉందనే ఆందోళనలు మొదలయ్యాయి. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పున్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదో వంతు రవాణా అవుతుందంటే దాని ప్రాముఖ్యత అర్థం చేసుకొవచ్చు. అదే హార్మూజ్ జలసంధి. అరేబియా సముద్రంలో ఒమన్, ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన ఈ జలసంధి నుంచి నిత్యం సుమారు 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళ్తుతుంది. ఇందులో భాగంగా... ఈ జలసంధి ద్వారా ఇరాన్, సౌదీ, యూఏఈ, కువైట్, ఇరాక్ ల నుంచి ఎగుమతి అవుతోంది. లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్.ఎన్.జీ) రవాణాకు కూడా ఇది అత్యంత కీలకం. ఇందులో భాగంగా... మూడింట ఒక వంతు ఎల్.ఎన్.జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. దీనిలో అత్యధికం ఖతార్ ఎగుమతి చేస్తుంది. ఇలా చమురు రవాణా విషయంలో అత్యంత కీలకంగా ఉన్న ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయమైనా ప్రపంచ వాణిజ్యాన్ని వణికించేస్తుందని అంటారు. ఈ విషయాన్ని గుర్తించిన అగ్రరాజ్యం అమెరికా... బహ్రెయిన్ లో తన ఫిఫ్త్ ఫ్లీట్ స్థావరాన్ని ఏర్పాటు చేసుకొంది. ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎన్.ఎన్.జీ. అత్యధికంగా భారత్ తో పాటు చైనా, జపాన్, దక్షిణ కొరియాలకు ఎగుమతి అవుతోంది. భారత్ కు ఇరాక్, సౌదీ, యూఏఈ, కువైట్, ఖతార్ నుంచి దిగుమతి అవుతుంది. వాస్తవానికి మనదేశం వినియోగించే ఇంధనంలో 90% వివిధ మార్కెట్ల నుంచే దిగుమతి చేసుకొంటుండగా.. భారత్ అవసరాలకు వాడే చమురులో 40% ఈ ఒక్క మార్గం నుంచే రవాణా అవుతోంది. ఈ నేపథ్యంలో.. ఆ జలసంధి మార్గం మూసుకుపోతే.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడం తోపాటు.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. కాగా... ఇటీవల కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ... దేశీయ అవసరాలకు సరిపడా చమురు సరఫరా అవుతుందని, దానిపై ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో.. ఇప్పటికే వివిధ దేశాలతో మనకు ఉన్న చమురు ఒప్పందాలకు తోడు.. మనకు ఉన్న నిల్వలు 74 రోజులకు సరిపోతాయని తెలిపారు! వాస్తవానికి ఈ జలసంధిని మూసే సాహసం ఇరాన్ గతంలో ఎప్పుడూ చేయలేదు.. ఫ్యూచర్ లో కూడా చేయకపోవచ్చనే చెప్పుకోవాలి. అందుకు కారణం... ఈ దేశం ఉత్పత్తి చేసే చమురులో సుమారు 80% చైనా కొనుగోలు చేస్తుంది. ఈ నేపథ్యంలో హార్మూజ్ జలసంధిని మూస్తే.. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ భారీగా దెబ్బతింటుంది. గతంలో ఇరాన్ – ఇరాక్ యుద్ధ సమయంలో కూడా ఈ జలసంధి తెరిచే ఉందంటే.. ఇది ఎంత ముఖ్యమైందో అర్థం చేసుకోవచ్చు. అయితే.. 1980–88 వరకు జరిగిన ఇరాన్ – ఇరాక్ యుద్ధం ప్రభావం మాత్రం ఈ జలసంధిపై పడింది. నాడు ఇరు దేశాలు పరస్పర ఎగుమతులను దెబ్బతీసేందుకు.. ట్యాంకర్లపై దాడులు చేసుకొన్నాయి. దీనిని “ట్యాంకర్ వార్” అని కూడా అంటారు. ఈ నేపథ్యంలో ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ఈ జలసంధిని మూసే అవకాశాలు అతిస్వల్పం అని అంటున్నారు. ఒకవేళ యుద్ధం కారణంగా మూసినా.. ఆ యుద్ధం రెండు నెలల పాటు కొనసాగే అవకాశాలు మరింత అత్యల్పం అని చెబుతున్నారు. అలాగైతే భారత్ సేఫ్ అనే చెప్పాలి. మన వద్ద 74 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. అలా కాకుండా ఇరాన్ – ఇజ్రాయెల్ యుద్ధ వల్ల సుమారు 3 నెలలు ఈ జలసంధిని మూసివేస్తే మాత్రం.. భారత్ చాలా ఇబ్బందుల్లో పడిపోతుంది.


# జగమెరిగిన మిమిక్రీ కళాకారుడు వేణుమాధవ్ -జూన్ 19... నేరెళ్ల వేణుమాధవ్ వర్ధంతి



భారత దేశంలో మిమిక్రీ కళకు ఆయన ఆద్యుడు. ఎంతో మంది ప్రముఖుల వందలాదిగా గొంతులను సునాయాసంగా, యథాతథంగా అనుకరించేవారు. భారత్‌లో అనుకరించి, నవ్వించే కళగా మాత్రమే ఉన్న మిమిక్రీని ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడు. రాష్ట్రపతులు, ప్రధానుల నుండి సామాన్యుల వరకూ దేశంలో ఆయన అపూర్వ, అపురూప కళను అభినందించని వారుండ రంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు గుర్తు పట్టారనుకుంటా. ఆయనే వందలాది గొంతుకల వేణు మాధవుడు. ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదును పొందిన, తెలంగాణ గర్వించ దగ్గ ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ ( డిసెంబరు 28, 1932 – జూన్ 19, 2018 ) చిన్నప్పుడు ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నారు. అయినా ఆయన అమెరికా, బ్రిటన్ ఇంగ్లిష్ ఉచ్చారణలతో కూడా గొప్ప ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన సొంతంగా ఈ కళను సాధన చేశారు. స్వీయ పరిశీలన, స్వయం అధ్యయనంతో తనను తాను మెరుగు పరచుకుంటూ అత్యున్నత స్థాయిని అందుకున్న ప్రతిభాశాలి. చిన్నతనంలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపారు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. తెలుగు లోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చారు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చారు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్నిచ్చి గౌరవించింది..కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఆయనకు అంకిత మివ్వడం ఆయన గొప్ప తనాన్ని స్పష్టం చేస్తుంది. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. తిరుపతిలో ఆయనకు గజారోహణం, పౌర సన్మానం జరిగాయి. ఆయన స్వయంగా నేరెళ్ళ వేణుమాధవ్ సాంస్కృతిక సంస్థను స్థాపించి ప్రతి యేటా ఒక కళాకారుడిని సన్మానించారు. హనుమ కొండలో ఆయన పేరు మీదుగా డా. నేరెళ్ళ వేణుమాధవ్ కళా ప్రాంగణం నిర్మించారు. నేరెళ్ళ వేణుమాధవ్ వరంగల్ పట్టణం లోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. పండితుడైన తండ్రి, వరంగల్ పట్టణానికి వచ్చే ప్రముఖులందరికీ తన ఇంట్లోనే ఆతిథ్యం ఇస్తుండగా, అలా వచ్చిన వారిలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, వడ్డాది సుబ్బా రాయుడు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, యర్రమిల్లి జగ్గన్న శాస్త్రి వంటి గొప్పవారి సాహితీ గోష్ఠుల ప్రభావం వేణుమాధవ్ మీద పడింది. సినిమాలంటే ఎంతో ఇష్టం. చిత్తూరు నాగయ్య నటించిన గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి, నాగయ్య కూడా ధ్వన్యనుకరణ చేయగలవారు కావడంతో ఆయన పై అభిమానంతో కేవలం స్వయం పరిశీలనతోనే ఆ రంగంలో ప్రవేశించారు. అలాగే వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన సినిమాలు చూసి, ఇంటికి రాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవారు. అలా మొదలయ్యింది అయన మిమిక్రీ ప్రస్థానం. 1950 లో మెట్రిక్యులేషన్, 1952 లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సు, ఇతర లెక్చరర్లు వారించినా వినకుండా, గుడ్ కాండక్టు కింద వేణుమాధవ్ కు ఆ రోజుల్లో అరవై రూపాయల స్కాలర్ షిప్ ( బర్సరీ ) మంజూరు చేశారు. ఆ డబ్బుతో పలు ఇంగ్లీషు సినిమాల్ని చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్నివేశాలు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్ తో సహా వినిపిస్తే, రామనర్సు పరమానంద భరితులై “యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్” అని, అయితే నీవు నా రెండవ కుమారుడవు అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే ఆయనను ‘విశ్వ విఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్’ గా ఎదిగేలా చేసాయి. 1953 లో ప్రభుత్వ పాఠశాల (జి సి ఎస్ స్కూలు హనుమకొండ) లో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మ సాగరం, హనుమకొండ లోని ప్రాక్టీసింగ్ స్కూలు, మట్వాడ ఉన్నత పాఠశాల, జనగామ, శంభునిపేట పాఠశాలల్లో పని చేశారు. అనంతర కాలంలో ప్రైవేటుగా బీ.ఏ. బీ. కాం పాసయ్యారు. తొలి ప్రదర్శన 1947 లో ఇచ్చారు. మలి ప్రదర్శన 1953 లో రాజమండ్రిలో జరిగిన థియేటర్స్ ఫెడరేషన్ కాన్ఫరెన్స్ లో బలరాజ సహానీ అధ్యక్షతన, గరికపాటి రాజారావు, దాడి గోవింద రాజులు, స్థానం నరసింహారావు, చాగంటి సన్యాసి రాజు తదితర ప్రముఖుల సమక్షంలో ఇచ్చారు. ఆయన ప్రదర్శనలు చూసిన పలువురు రాజకీయ ప్రముఖుల్లో దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, దివంగత ప్రధానులు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు లాంటి ఎంతోమంది ఉన్నారు. ఆస్ట్రేలియా, ఫిజీ దీవులు –1965, సింగపూర్, మలేషియా – 1968, పశ్చిమ జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా, కెనెడా, లెబనాన్ – 1971, ఐక్యరాజ్య సమితిలో ప్రదర్శన – 1971, సింగపూర్,మలేషియా – 1975, అమెరికా, కెనెడా – 1976, దక్షిణాఫ్రికా, మారిషస్, సీషెల్స్ – 1976, సింగపూర్, మలేషియా –1977, అమెరికా, కెనెడా – 1982, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ – 1987, మారిషస్ – 1990 తదితర దేశాలలో పర్యటించి ప్రదర్శనలు ఇచ్చారు. వేణుమాధవ్ గారు నిర్వహించిన పదవుల్లో ఎం.ఎల్.సీ (1972–78), ఎఫ్.డీ.సీ డైరెక్టర్ (1976–77), సంగీత నాటక అకాడమీ సభ్యుడు (1974–78), సౌత్ జోన్ కల్చరల్ కమిటీ, తంజావూరు సభ్యుడు, దూరదర్శన్ ప్రోగ్రాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (1993–94), టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (1993–96), రైల్వే జోనల్ యూజర్స్ కమిటీ సభ్యుడు (1993–96), ఎ.పి.లెజిస్లేటివ్ లైబ్రరీ కమిటీ సభ్యుడు (1972–75), రవీంద్ర భారతి కమిటీ సభ్యుడు (1974–78), ప్రభుత్వ అకాడమిక్ రివ్యూ కమిటీ సభ్యుడు (1975–76) తదితర పదవులు నిర్వహించారు. ధ్వన్యనుకరణ సామ్రాట్, మిమిక్రీ సామ్రాట్, చుపే రుస్తుం ధ్వన్యను కరణ చక్రవర్తి, కళా సరస్వతి, స్వర్ కే రాజా, ధ్వన్యను కరణ ప్రవీణ, ధ్వన్యను కరణ కళానిధి, మిమిక్రీ రత్న, విశ్వ విఖ్యాత ధ్వన్యను కరణ సార్వభౌమ, మున్నగు బిరుదులు వరించాయి. 1977 ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి కళా ప్రపూర్ణ బిరుదు, 1982 రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 1987 జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వ విద్యాలయం, 1992 కాకతీయ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు...1997 కనకాభిషేకం, 1998 ఎన్టీఆర్ ఆత్మ గౌరవ పురస్కారం, 2001 పద్మశ్రీ, 2005 తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు – 2018లో భాగంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పురస్కారం అందజేయబడింది. తిరుపతి పట్టణంలో గజారోహణం, పౌర సన్మానం జరిగాయి. పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ తమ 85వ యేట కన్నుమూశారు. హనుమకొండ పట్టణంలో నిర్మింపబడ్డ ‘డా.నేరెళ్ళ వేణుమాధవ్ గారి కళాప్రాంగణం ‘ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు చక్కని వేదికగా ఉపయోగ పడుతున్నది. నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్’ ను స్థాపించి ప్రతియేటా తన పుట్టిన రోజైన డిసెంబర్ 28న ప్రముఖ కళాకారులను పదివేల రూపాయల పురస్కారంతో సత్కరిస్తున్నారు. 2017లో నేరెళ్ల వేణుమాధవ్ పేరుతో పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. ఆయన పుట్టిన రోజైన డిసెంబర్ 28వ తేదీని తెలుగు రాష్ట్రాల్లో ‘మిమిక్రీ డే’గా జరుపు కుంటారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భాషాశాస్త్ర విజ్ఞానానికి దిక్సూచి...భద్రిరాజు కృష్ణమూర్తి - జూన్ 19...భద్రిరాజు కృష్ణమూర్తి జయంతి


భద్రిరాజు కృష్ణమూర్తి ు తెలుగు భాషాశాస్త్ర రంగంలో వెలుగొందిన ప్రఖ్యాత పండితుడు. ద్రావిడ భాషల తులనాత్మక అధ్యయనం, శబ్ద నిర్మాణ విశ్లేషణ, వ్యాకరణ రూప పరిణామం వంటి విభాగాలలో ఆయన సాధించిన శాస్త్రీయ పరిశోధనలు భారత భాషాశాస్త్ర పరిణామాన్ని విశ్వవేదికలపై ప్రతిష్ఠాపించాయి. భాషలను కేవలం వాడుకకే పరిమితం కాక, వాటి మూలాలకు, నిర్మాణాలకు అర్థం తెలిపేలా చేసిన పరిశోధనల్లో ఆయన పాత్ర అపూర్వమైనది. ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లాలోని వెలుగుబండ గ్రామంలో 1928 జూన్ 19న జన్మించిన భద్రిరాజు చిన్ననాటి నుంచే బుద్ధిమంతుడిగా గుర్తింపునందుకున్నారు. పిఠాపురం వయోజన విద్యాసంస్థల ద్వారా ప్రాథమిక విద్యనభ్యసించిన ఆయన, అనంతరం బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో సంస్కృతంలో ఎం.ఎ. పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, బర్కిలీ నుండి భాషాశాస్త్రంలో పి.హెచ్.డి. పొందారు. అక్కడ ఆయన చార్లెస్ హాకెట్, ముర్రే ఎమెన్యూ వంటి భాషా శాస్త్రవేత్తల శిక్షణలో శాస్త్రీయ దృక్పథాన్ని సంపాదించారు. ఆయన విద్యా, పరిశోధనా ప్రస్థానం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు, ద్రావిడ భాషాశాస్త్ర విభాగానికి ప్రొఫెసర్‌గా కొనసాగింది. 1962 నుండి 1988 వరకు ఆయన ఆచార్య పదవిలో ఉన్నారు. ఈ కాలంలో తెలుగు భాషాశాస్త్ర అధ్యయనానికి కొత్త వెలుగు చూపించి, పరిశోధనలకు మార్గనిర్దేశం చేశారు. భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలన్న దృక్పథాన్ని ఆయన విద్యార్థులకు నాటించారు. ఆయన శిష్యులలో ఎందరో నేటికీ వివిధ విశ్వవిద్యాలయాలలో ప్రఖ్యాతులుగా ఉన్నారు. 1961లో




ప్రచురితమైన “Telugu Verbal Bases” అనే గ్రంథం ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. తెలుగు క్రియారూపాల తులనాత్మక అధ్యయనం, ద్రావిడ మూలాల అన్వేషణ ఈ గ్రంథంలో శాస్త్రీయంగా విశ్లేషించబడింది. తరువాత కాలంలో వచ్చిన “Comparative Dravidian Linguistics: Current Perspectives”, “The Dravidian Languages A Grammar of Modern Telugu” వంటి గ్రంథాలు ద్రావిడ భాషాశాస్త్ర విభాగంలో ప్రామాణిక గ్రంథాలుగా నిలిచాయి. భద్రిరాజు కృష్ణమూర్తి పరిశోధనలు భాష శాస్త్రపు వివిధ విభాగాలకు వ్యాపించాయి ు వ్యాకరణ శాస్త్రం, శబ్ద నిర్మాణం, భాషా పరిణామ క్రమం, మాండలిక అధ్యయనం, శాసనాల్లోని భాషాపరమైన అంశాల విశ్లేషణ మొదలైన అంశాలలో ఆయన సుదీర్ఘంగా కృషి చేశారు. భాషను కేవలం వ్యాకరణ పరిమితుల్లో కాక, సంస్కృతి, చరిత్ర, సమాజంతో ముడిపెట్టి అధ్యయనం చేసిన ఆయన దృక్పథం ఎంతో విశాలమైనది. కేంద్ర భాషా సంస్థ (CIIL - మైసూరు) కు తొలి డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన, భారత భాషల అధ్యయనానికి సాంకేతిక, శాస్త్రీయ దిశల్ని సూచించారు. భారత ప్రభుత్వ భాషా కమిషన్, సాహిత్య అకాడమీ, యునెస్కో భాషా ప్రాజెక్టుల్లో సలహాదారుడిగా కీలకంగా పని చేశారు. అంతర్జాతీయ విశ్వ విద్యాలయాల్లో అతిథి అధ్యాపకుడిగా సేవలందించారు. ఆయనకు లభించిన పురస్కారాలు ఆయన గొప్పతనానికి నిదర్శనంగా నిలిచాయి. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (1993), పద్మభూషణ్ (2000), భాషా గౌరవ పురస్కారాలతో పాటు అనేక విశ్వ విద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు పొందారు. 2012 ఫిబ్రవరి 1న భద్రిరాజు కృష్ణమూర్తి గారు మృతి చెందినా, ఆయన చేసిన కృషి శాశ్వతంగా భాషా ప్రపంచంలో నిలిచిపోతుంది. ఆయన జీవితం భాషాపరంగా పరిశోధన చేయాలనుకునే ప్రతిభావంతుల కోసం మార్గదర్శక దీపంలా నిలుస్తుంది. భద్రిరాజు కృష్ణమూర్తి గారి పేరే భారత భాషాశాస్త్ర వికాసానికి ప్రతీకగా నిలిచి ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# హాస్య రస గుళికలు...జంధ్యాల రచనలు - జూన్ 19...హాస్యబ్రహ్మ జంధ్యాల వర్ధంతి



జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ఈ పేరు తెలుగు ప్రజలకు దాదాపు తెలియదనే చెప్పాలి. కనీసం ఆ పేరు గల వ్యక్తి ఉన్నారని గాని, ఆయన సుపరిచితు లేనని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అత్యంత ప్రజాదరణ పొందిన విజయ వంతమైన సినిమాలకు కథలు, ఆకట్టుకునే సంభాషణలు సమకూర్చారని, చిరకాలం గుర్తుండి పోయే చిత్రాలకు దర్శకత్వం వహించారని సినిమాలతో పరిచయం, సంబంధం ఉన్నా చాలా మందికి తెలియదు. ఆయనే ..హాస్యబ్రహ్మ గా పేరు పొంది, ఇంటి పేరుతో ప్రఖ్యాతి గాంచిన వెండితెర హాస్య బ్రహ్మ జంధ్యాల. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (జనవరి 14, 1951 – జూన్ 19, 2001 ) తెలుగు సినిమా రచయిత, దర్శకులు. జంధ్యాల అని ఇంటిపేరుతోటే సుప్రసిద్ధుడైన ఆయన అసలుపేరు జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ప్రత్యేకించి హాస్యకథా చిత్రాలు తీయటంలో ఆయనది అందె వేసిన చెయ్యి. జంధ్యాల చెప్పిన ప్రసిద్ధ వాక్యం – నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వక పోవడం ఒక రోగం. అనేది నానుడి. జంధ్యాల 1951 జనవరి 14 న పశ్చిమ గోదావరి జిల్లా నరసా పురంలో జన్మించాడు. బి.కామ్ వరకు చదువుకున్నారు. చిన్నతనం నుండి నాటకాల పట్ల ఆసక్తిగా ఉండేవారు. స్వయంగా నాటకాలు రచించారు. ఆయన రాసిన నాటకాల్లో “ఏక్ దిన్ కా సుల్తాన్, గుండెలు మార్చబడును” ప్రముఖమైనవి. ఆయన నాటకాలు అనేక బహుమతులు అందుకున్నాయి. 1974లో జంధ్యాల సినిమా రంగ ప్రవేశం చేసారు. శంకరాభరణం, సాగర సంగమం, అడవి రాముడు, వేటగాడు వంటి అనేక విజయ వంతమైన సినిమాలకు మాటలు రాశారు. ముద్ద మందారం సినిమాతో దర్శకుడిగా మారి, శ్రీవారికి ప్రేమలేఖ వంటి చిరస్మరణీయ చిత్రాన్ని సృజించారు. 1976 లో దేవుడు చేసిన బొమ్మలు చిత్రం ద్వారా మాటల రచయితగా తన సినిమా జీవితం మొదలు పెట్టారు. ఐదేళ్ళలో సుమారు 85 సినిమాలకు రచయితగా పనిచేయగా అందులో 80 శాతం సినిమాలు ఘనవిజయం సాధించడంతో మంచి రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత దర్శకుడిగా మారి, అనేక హాస్య చిత్రాలను రూపొందించారు. ఆరోగ్య కరమైన హాస్యానికి జంధ్యాల పేరు గాంచాడు. హాస్యబ్రహ్మ అని పేరు పొందారు. రచయితగా 300కు పైగా సినిమాలు, దర్శకుడు గా షుమారు 50 సినిమాలు చేసారు. అప్పటి కామెడీ హీరోలకు లైఫ్ ఇచ్చాయి ఈయన సినిమాలు. ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించారు. శ్రీలక్ష్మి, బ్రహ్మానందం లాంటి వారిని ఈ రోజుకి ప్రేక్షకులు గుర్తుంచు కున్నారంటే ఆయన సినిమాలే కారణమనేది వాస్తవం. జంధ్యాల కేవలం హాస్యమే కాకుండా అన్ని రకాల ఎమోషన్స్ రచించేవారు. అజరామర ‘శంకరాభరణం’ చిత్రంతో పాటు ‘సప్తపది’ జంధ్యాల రచనకు తార్కాణాలుగా నిలిచాయి. సినిమా పరిశ్రమలో జంధ్యాల, కె.రాఘవేంద్రరావుల కాంబినేషన్ కు విశేష ప్రత్యేకత ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘అడవి రాముడు’, ‘వేటగాడు’, ‘డ్రైవర్ రాముడు’, ‘జగదేక వీరుడు అతిలోక సుందరి’ వంటి చిత్రాలను జన రంజకంగా రూపొందించడంలో జంధ్యాల పాత్ర కీలకంగా నిలిచింది. అలాగే కె.విశ్వనాథ్, జంధ్యాల కాంబినేషన్ కూడా సూపర్‌హిట్ చిత్రాలకు పెట్టింది పేరు. ఈ కాంబినేషన్‌లో ‘శంకరాభరణం’, ‘సాగర సంగమం’ వంటి చిత్రాలొచ్చాయి. దర్శకుడుగా ఆయన మొదటి సినిమా ముద్ద మందారం ఈరోజుకి అంత ఆదరణ పొందుతోంది అంటే ఆయన దర్శకత్వ ప్రతిభే. కామెడీ చిత్రాలకు ఎక్కువగా పనిచేసిన జంధ్యాల వేగవంతమైన రచయితగా పేరు తెచ్చు కున్నారు. పది రోజుల్లో సినిమాకు మాటలు రాసేవారు. ఆయన కళాత్మక చిత్రాలకు ఎంత హృద్యంగా రాశారో, హాస్య భరిత చిత్రాలకు అంత చిలిపిగా రాశారు. 1983లో, “ఆనంద భైరవి” చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రం దర్శకుడు జాతీయ అవార్డు, 1983లో, “ఆనంద భైరవి” చిత్రానికి ఉత్తమ దర్శకుడు నంది అవార్డు, 1987లో, “పడమటి సంధ్యారాగం” చిత్రానికి ఉత్తమ కథారచయిత అవార్డు, 1992లో, “ఆపద్బాంధవుడు” చిత్రానికి ఉత్తమ మాటల రచయిత అవార్డు లభించాయి. జంధ్యాల తన సినిమాల ద్వారా అనేక మంది నటులను... బ్రహ్మానందం, నరేష్, ప్రదీప్, సుత్తి వీరభద్రరావు, సుత్తి వేలు తదితర నటీనటులను జంధ్యాల సినీ రంగానికి పరిచయం చేశారు. ఇంటి పేరు తోటే ప్రసిద్ధుడైన జంధ్యాలను మీ అసలు పేరు ఏమిటి అని అడిగితే ఆయన ఇలా అనేవాడు: “నేను రామానాయుడి సినిమాకు పనిచేసేటపుడు నాపేరు జంధ్యాల రామానాయుడు, విశ్వనాథ్ గారి సినిమాకు పనిచేసేటపుడు నా పేరు జంధ్యాల విశ్వనాథ్”... అలా అనేవారు తప్ప, తన అసలుపేరు ఎక్కడా చెప్పు కోలేదు. జంధ్యాల 2001 జూన్ 19 న హైదరాబాదులో గుండె పోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు.... పేర్లు సాహితి, సంపద. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పదేళ్లలో 18 మంది

వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపే బదిలీపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన కె.వినోద్‌రెడ్డి బదిలీపై దేవాదాయశాఖ హైదరాబాద్ కార్యాలయానికి డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో వేములవాడ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న రాధాబాయి ఈ నెల 13న ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలను చేపట్టారు.

**మొదటి నుంచీ ఇంతే..**

మొదటిసారిగా 1956లో ఆలయానికి కార్యనిర్వహణాధికారిని నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 80 మంది ఈవోలుగా బాధ్యతలు నిర్వహించారు. కొందరు రెండు, మూడు దఫాలుగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ వారు సైతం ఏడాదిలోపే బదిలీ అయ్యారు. 1956 నుంచి 1965 వరకు రూప్‌లాల్ ముంతాజియం ఒక్కరే పదేళ్లపాటు ఈవోగా బాధ్యతలు నిర్వహించగా.. మిగిలిన వారిలో ఏ ఒక్కరూ చాలాకాలం పని చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. పదేళ్లలో 18 మంది ఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. ఈవో రాజేశ్వర్ 2014 నుంచి 2017 వరకు విధులు నిర్వహించారు. అనంతరం 2019 వరకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. క్రిష్ణప్రసాద్ 2020 నుంచి 2022 వరకు తిరిగి 2022 నుంచి 2024 బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత రామక్రిష్ణారావు కేవలం 36 రోజులు మాత్రమే ఈవోగా ఉన్నారు. ఆ తరువాత వినోద్ కుమార్ నెలపాటు విధులు నిర్వహించిన అనంతరం ఆగస్టు 2024 నుంచి 13 జూన్ 2025 వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. 17 జనవరి 2022 నుంచి 9 ఆగస్టు 2022 వరకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించి ఎనిమిది నెలల్లోనే బదిలీ అయ్యారు.

**పట్టు సాధించేలోపే..**

ఆలయ కార్యనిర్వహణాధికారుల బదిలీల వెనుక అనేక కారణాలున్నా



యని ప్రచారం జరుగుతోంది. పైస్థాయి అధికారుల ప్రమేయం, రాజకీయ ఒత్తిళ్లు, ఆలయంలో ప్రొటోకాల్ వివాదాలు, విజిలెన్స్, ఏసీబీ అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న అవకతవకల వంటివి కారణంగా భావిస్తున్నారు.

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆలయంలో అనేక సంస్కరణలు చేపట్టారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉన్న కొద్దికాలంలో భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేసి భక్తులు మన్ననలు పొందారు. సంస్కరణలు గిట్టని కొందరు ఆలయ ఉద్యోగులు, నాయకులు ఇక్కడి నుంచి సాగనంపారనే ఆరోపణలు ఉన్నాయి. ఈవోలుగా వచ్చిన వారు ఆలయంలోని వివిధ విభాగాలపై అవగాహనకు వచ్చి పట్టు సాధించేలోపే బదిలీ కావడంతో భక్తులకు మెరుగైన సేవలు అందలేకపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన వినోద్‌కుమార్ పట్టు సాధించి సంస్కరణలు చేస్తున్న క్రమంలో బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో రాధాబాయికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలతో వేలల్లో వచ్చే భక్తులకు ఏ మేరకు సేవలు అందుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం ఆలయానికి ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలనే డిమాండ్ భక్తుల్లో, స్థానిక నాయకుల్లో వినిపిస్తోంది.

# చెరువులను చెరబట్టారు

పెద్దపల్లి: ఇటుక బట్టీ నిర్వాహకులు చెరువులను చెర బడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలించి వాటి విధ్వంసానికి పాల్పడుతున్నారు. చెరువులో పూడిక తీస్తున్నారని నీటిపారుదలశాఖ, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గనులశాఖ, గ్రామానికి చందాలిస్తున్నారని గ్రామాభివృద్ధి కమిటీలు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఉమ్మడి జిల్లాలోని చెరువులు రూపం కోల్పోతున్నాయి. యంత్రాలతో తోడటమే కాకుండా, జలాశయాల్లోని మట్టిని పూర్తిగా తరలించేందుకు చెరువుల మధ్యలో రోడ్లు నిర్మించారు. ఎక్కడ, ఎంత లోతులో తీయాలనే అంశాలేవి బట్టీ నిర్వాహకులు పట్టించుకోకపోవడం, అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది.

**అంతటా అదే దోపిడీ**

ఉమ్మడి జిల్లాలో ఇటుక తయారీ పరిశ్రమకు సంబంధించి పెద్దపల్లి ప్రాంతంలో నాణ్యమైన చెరువు మట్టితోపాటు ఎన్టీపీసీ బూడిద అందుబాటులో ఉండటంతో.. ఈ ప్రాంతంలో 200కుపైగా ఇటుక తయారీ పరిశ్రమలున్నాయి. వీటికి అవసరమైన మట్టిని సమీప చెరువుల నుంచి తరలిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ తరలింపు ప్రక్రియ తరుచూ వివాదస్పదమవుతోంది. చెరువులో ఒక మీటరు కంటే ఎక్కువ లోతు మట్టి తీయొద్దనే నిబంధన ఎక్కడ అమలు కావడంలేదు. భారీ యంత్రాలతో తరలించడంతో కనీసం పది నుంచి 20 అడుగుల గుంతలు ఏర్పడుతున్నాయి.

**రెట్టింపు పరిమాణంలో తరలింపు**

తాజాగా పెద్దపల్లి మండలం బొంపల్లిలోని రాచర్లకుంటలో ఏకంగా రోడ్డును నిర్మించి, మట్టిని తరలిస్తున్నారు. వర్షం నీరు చెరువులోకి రాకుండా చుట్టూ కందకాలు తవ్వి, నీటిని బయటకు పంపించేందుకు కచ్చా కాలువలు తవ్వారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. జమ్మికుంట, హుజురాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో చెరువుల నుంచి అనుమతించిన దాటికంటే రెట్టింపు పరిమాణంలో మట్టిని తరలిస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో చెరువులతోపాటు మానేరు జలాశయం నుంచి కూడా మట్టిని తరలిస్తున్నారు. గతేడాది ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ ప్రాంతం నుంచి మట్టి తరలించడం వివాదానికి దారితీసింది.

**భారీగా వసూళ్లు**

బట్టీ నిర్వాహకుల బలహీనతను ఆసరా చేసుకొని మట్టి ధరను రెట్టింపు చేయడంపై ఉన్న దృష్టి చెరువు పరిరక్షణపై లేకుండా పోతుంది. నిబంధనల ప్రకారం మట్టి లేదా ఇసుకకు క్యూబిక్ మీటర్ చొప్పున రేటు నిర్ణయించి పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో టిప్పర్(సుమారు 40 మెట్రిక్ టన్నులు)కు రూ.వెయ్యి వరకు చెల్లిస్తే సరిపోతుంది. అయితే పెద్దపల్లిలో మాత్రం దాదాపు రూ.2700 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులు బావుల మాదిరిగా మారిపోయి, దిగువకు నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది. చెరువుల్లో మోటార్లు పెట్టుకొని రైతులు సాగు చేసే దుస్థితి వచ్చినా ఆశ్చర్యం కలగకపోవచ్చు.

# బీమా.. ఏదీ ధీమా!



వికారాబాద్ : వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైందంటే చాలా బీమా కంపెనీలు అన్నదాతల వద్దకు రెక్కలు కట్టుకొని వాలిపోతుంటాయి. బీమా చెల్లిస్తే ఎంతో మేలని, పంటలు నష్టపోతే రూ.లక్షల్లో పరిహారం వస్తుందని ఊదరగొడుతుంటాయి. ప్రీమియం కట్టించుకున్నాక.. నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. ఈ కంపెనీలతోపాటు బ్యాంకులూ పంట రుణాలు తీసుకున్న రైతుల నుంచి బీమా సొమ్ము వసూలు చేస్తుంటాయి. ప్రతి వానాకాలం, యాసంగి సీజన్లలో రైతుల నుంచి రూ.కోట్లు దండుకుంటున్నాయి. గత వానాకాలంలో పత్తి, మొక్కజొన్న, జొన్న, వరి, కూరగాయల పంటలు తీవ్రంగా నష్టపోయినా అన్నదాతలకు పరిహారం మాత్రం అందలేదు.

**సమాచారమూ లేదు..** జిల్లాలో నాలుగేళ్లుగా బీమాకు సంబంధించి ఇంతవరకు ఒక్క క్లెయిమ్‌నూ పరిష్కరించలేదు. ఈ ఏడాదీ పెద్ద ఎత్తున బీమా ప్రీమియం వసూలు చేశారు. జిల్లాలో ఎంత మందికి మంజూరైందనే సమాచారం ఇంతవరకు రాలేదు. ఓ బీమా కంపెనీ రైతుల నుంచి ప్రీమియం వసూలు చేసింది. జిల్లావ్యాప్తంగా బ్యాంకుల్లో రుణం తీసుకోని 550 మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించారు. వారి వాటాగా రైతులు ఎకరాకు రూ.1,200 చొప్పున, మరో రూ.1,200 ప్రభుత్వం భరించింది. జిల్లాలో 1.2 లక్షల మంది బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందారు. వారిలో రుణాలు రెన్యువల్ చేసుకున్న 38,600 మంది బీమా ప్రీమియం చెల్లించారు. మరో కంపెనీ వరి, పెసర, మినుము, కంది, మొక్కజొన్నకు సంబంధించి 8,500 మంది రైతుల నుంచి రూ.1.69 కోట్లు వసూలు చేసింది. మిరపకు రైతు వాటా రూ.1,700, మిగతా రూ.1,700 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాయి. వరికి ఎకరాకు రూ.540, పెసరకు రూ.260, కందికి రూ.280, మొక్కజొన్నకు రూ.500 రైతులు చెల్లించారు. జిల్లాలో మొత్తంగా రైతులు అన్ని పంటలకు కలిపి 2.42 కోట్ల బీమా ప్రీమియం చెల్లించారు. డీసీసీబీలో రుణం తీసుకున్న 5,600 మందికే పరిహారం వచ్చింది. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికి మాత్రం ఇంత వరకు రాలేదు.

**క్లెయిమ్‌ల పరిష్కారంలో నిర్లక్ష్యం..-వీరేశం, మైలార్‌దేవరంపల్లి, వికారాబాద్**

ఆరేళ్లుగా పత్తి, మొక్కజొన్నకు బీమా ప్రీమియం చెల్లిస్తున్నా. 2018-19 వానాకాలానికి సంబంధించి ఇంతవరకు క్లెయిమ్ పరిష్కరించలేదు. గత వానాకాలంలో భారీ వర్షాలకు నాలుగెకరాల్లో వేసిన పత్తి పంట నష్టపోయినా పరిహారం రాలేదు. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించినా తెలియదని సమాధానం చెబుతున్నారు.

# సాగులో సాంకేతిక ఒరవడి




పరిగి : అన్నదాతల ఆర్థికాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. సాగులో నూతన ఒరవడి తీసుకురావాలన్న లక్ష్యంతో రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని రైతు వేదికల్లో కొత్తగా 34 యూనిట్లను ప్రారంభించేందుకు జిల్లా వ్యవసాయశాఖ సర్వం సిద్ధం చేసింది. దీంతో వీటి సంఖ్య 53కు చేరనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 1,510 యూనిట్లను రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. జిల్లా నుంచి వంద మంది రైతులు కార్యక్రమంలో పాల్గొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధం చేసింది.

**నిర్వహణ బాధ్యతలు ఏఈవోలకు..**

జిల్లావ్యాప్తంగా 20 మండలాలు, 100 క్లస్టర్ల పరిధిలో 2,26,253 మంది రైతులున్నారు. దృశ్య శ్రవణ పరికరాలను మొదటి దశలో 3, రెండో దశలో 14 చొప్పున ప్రారంభించారు. అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. వీటి నిర్వహణ బాధ్యతను ఏఈవోలకు అప్పగించారు.

**ప్రయోజనం ఇలా..** వ్యవసాయమంటేనే మూడడుగులు ముందు కు.. ఆరడుగులు వెనక్కి అన్నట్లు ఉంటుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, ధరలు పడిపోవడం, సాంకేతికతపై అవగాహన లేకపోవడం, పంట మార్పిడి పాటించని కారణంగా అన్నదాతలు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు శాస్త్రవిజ్ఞానంతోపాటు సాంకేతిక సహకారాన్ని అందించేందుకు దృశ్య శ్రవణం ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రతి మంగళవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏరువాక శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులతో ముఖాముఖి నిర్వహిస్తోంది. ఏఈవోల సహకారంతో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహిస్తోంది. రైతుల సందేహాలకు పరిష్కార మార్గాలు చూపుతున్నారు. తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా ప్రోత్సహిస్తున్నారు.

**ఆర్థికాభివృద్ధికి దోహదం..-ఎన్.మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి**

రైతు వేదికల ద్వారా దృశ్య మాధ్యమంతో సమస్యలను పరిష్కరించుకునేందుకు ఇది చక్కటి అవకాశం. విత్తన ఎంపిక మొదలు పంటకాలం పూర్తయ్యే వరకు ఎలాంటి సమస్యలు, సందేహాలనైనా నేరుగా శాస్త్రవేత్తలతో పంచుకోవచ్చు. కాలానుగుణంగా మార్పు తెచ్చి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తున్నాం.

# అనుమతుల్లేవు.. సౌకర్యాలు కరవు




తాండూరు: జిల్లాలో తాండూరు పట్టణానికి వ్యాపార, వాణిజ్య కేంద్రంగా పేరుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన కార్మికులు, వ్యాపారులు ఇక్కడికొచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. నాపరాళ్లు, సుద్ద, సిమెంటు, రవాణాతోపాటు ఇతర రంగాల్లో చాలామంది ఉపాధి పొందుతున్నారు. రైతులతోపాటు మధ%రి%్యతరగతి ప్రజలు వారి పిల్లల చదువులకు ఇక్కడికొచ్చి ఉంటున్నారు. దీంతో పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. పట్టణానికి వచ్చిన వారిలో 60 శాతానికిపైగా మందికి సొంత ఇళ్లు లేవు. వారంతా అద్దె గృహాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇలాంటి వారి అవసరాలే వెంచర్లకు కాసుల పంట కురిపిస్తున్నాయి.

**సొంతిల్లు అందరి కల..**

చాలామంది స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకోవాలని ఉత్సాహం చూపుతున్నారు. మరికొందరు ప్రస్తుతం స్థలం కొని భవిష్యత్తులో ఇల్లు నిర్మించుకోవచ్చని భావిస్తున్నారు. ఆర్థిక వెసులుబాటునుబట్టి పట్టణానికి కొద్ది దూరంలోని శివారు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇలాంటి వారి అవసరాలను ఆసరాగా చేసుకున్న పలువురు ఎకరాల కొద్దీ పొలాలను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రాంతాన్నిబట్టి గజం ధర రూ.8- 20వేల వరకు విక్రయిస్తూ రూ.కోట్లలో ఆర్జిస్తున్నారు.

**విస్తరిస్తున్న శివారు ప్రాంతాలివే..**

కోకట్ రోడ్, చెంగేష్‌పూరు రోడ్, గౌతాపూరు, కందనెల్లి రోడ్డు, బషీర్‌మియా తండా, బామ్లానాయక్ తండా, రసూల్‌పూరు, నారాయణపూరు రోడ్, మల్‌రెడ్డిపల్లి, అంతారం రోడ్డు, ఇందిరానగర్, పాత తాండూరు, కొడంగల్ రోడ్డు, సాయిపూరు

**తప్పని అవస్థలు..**

అధికారిక లేఅవుట్లలో విక్రయించిన ప్లాట్ల ద్వారా ప్రభుత్వానికి, పురపాలికకు ఆదాయం సమకూరుతుంది. పొలాల్లో డీటీసీపీ లేఅవుట్ చేయాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే అనుమతి రూపంలోనూ ఆదాయం వస్తుంది. ఆ ఆదాయంతో అధికారులు ఆయా కాలనీలకు రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి తదితర సౌకర్యాలు కల్పిస్తారు. తాండూరులో 7 మాత్రమే అధికారిక లేఅవుట్‌లున్నాయి. అనధికారిక లేఅవుట్లే ఎక్కువగా ఉన్నాయి. పట్టణ శివారులో డీటీసీపీ అనుమతి లేకుండానే వేల ప్లాట్లు విక్రయించారు. వాటిలో నిర్మించిన ఇళ్లకు ఎలాంటి సౌకర్యాల్లేవు. వర్షాకాలంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. డీటీసీపీ అనుమతి లేకపోవడంతో రుణాల కోసం బ్యాంకులకు వెళితే తిరస్కరిస్తున్నారు. వ్యవసాయ భూములను అక్రమ పద్ధతిలో ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నా చివరికి జరిమానాలు చెల్లించక తప్పదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

# మీనం మెరవాలె.!

కమ్మర్‌పల్లి : రాష్ట్రంలోనే చేప పిల్లల ఉత్పత్తికి అనువైన ప్రదేశం పోచంపాడ్. ఇక్కడ నెలకొల్పిన జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్ర సామర్థ్యమూ ఎక్కువే. ఏటా రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలుస్తున్న దీనికి మరోసారి భారీ లక్ష్యాన్ని విధించారు. మత్స్యశాఖ అధికారులు తల్లి చేపలను సేకరిస్తూ నీటికుంటల్లో నిల్వ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే జులైలో విత్తనోత్పత్తి చేపడతారు.

**ఎనిమిది కోట్లు.. :** భూవిస్తీర్ణం, నీటి లభ్యతతో పోచంపాడ్ విత్తన చేపకు అనువుగా మారింది. ఈఏడాది 8 కోట్ల స్పాన్, 45 లక్షల అడ్వాన్స్ ఫ్రై లక్ష్యంగా విధించారు. దీనిని సాధించాలంటే జులై మొదటి వారంలోనే ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించాలి. వర్షాలు కురుస్తూ వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ప్రక్రియ చేపడితేనే గుడ్డు(సెన) స్పాన్(చిచ్చుర చేప)గా మారుతుంది. వాటిని సిమెంట్ కుండీల్లో వేసి పెంచాలి. పెంచిన చేప పిల్లలు అడ్వాన్స్‌డ్ ఫ్రై(35-40 ఎం.ఎం) సైజులోకి రాగానే మత్స్యకారులకు పంపిణీ చేస్తారు.

**చైనీస్, ఎకో హెచరీలతో.. :** 2016లో రూ.4.30 కోట్ల ఫిష్‌సీడ్ ఫారం నిధులతో కేంద్ర సామర్థ్యాన్ని పెంచారు. 114 పాత సిమెంట్ నర్సరీ(నీటికుండీలు)లకు అదనంగా మరో 140 నిర్మించారు. ఈ కేంద్రంలోని మొట్టమొదటి జార్ హెచరీ లీకేజీలతో నిరుపయోగంగా మారగా, ఈసారి కొత్తగా నిర్మించిన చైనీస్ హెచరీతోపాటు ఎకో హెచరీతో ఉత్పత్తి చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న రెండు యూనిట్ల ఎకో హెచరీలకు అదనంగా నిర్మల్ నుంచి తెచ్చిన మరో



యూనిట్‌ను సిద్ధం చేశారు. ఒక యూనిట్‌లో 30 లక్షల చొప్పున.. మూడింటిలో మొత్తం 90 లక్షలు, చైనీస్ హెచరీలో 50 లక్షల స్పాన్ ఉత్పత్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. వీటికి ఆహారంగా తవుడు, పశువుల పేడ, ఇతర పదార్థాలు ఇవ్వాల్సి ఉండడంతో సమకూరుస్తున్నారు.

**1000 కిలోల తల్లి చేపలు**

ఈ ఏడాది కేంద్రానికి భారీ లక్ష్యం విధించడంతో 1000 కిలోల తల్లి చేపలు అవసరం కాగా.. ఇప్పటివరకు బొత్స, రవ్వ, మిరగ, బంగారు తీగ రకాలతో 300 కిలోల తల్లి చేపలను సేకరించారు. మిగతా 700 కిలోలను సమీపంలోని చెరువుల్లో సేకరిస్తున్నారు.

జులైలో ప్రారంభిస్తాం: దామోదర్, మత్స్యశాఖ అధికారి, పోచంపాడ్ ఉత్పత్తికి సన్నాహాలు మొదలయ్యాయి. అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భారీ లక్ష్యం విధించారు. జులైలో ఉత్పత్తి ప్రక్రియ చేపడతాం. రాష్ట్రంలో మళ్లీ ప్రథమస్థానంలో నిలువడానికి కృషి చేస్తాం.

# భారం.. ఇక దూరం

ఇందల్‌వాయి: నెల వారీగా అద్దె చెల్లించడంలో తీవ్ర జాప్యంతో పలు సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు తాళాలు పడేవి. పాఠశాలల్లో సరైన వసతులు లేనప్పటికీ ప్రిన్సిపాళ్లు యజమానులను గట్టిగా అడగలేని పరిస్థితులుండేవి.. ఇలా చివరకు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మరికొన్నిచోట్ల అద్దె ఒప్పందం ముగియడంతో యజమానులు భవనం ఖాళీ చేయించడంతో నూతన భవనం కోసం అధికారులు నానా కష్టాలు పడేవారు. ఇలాంటి వాటికి ఈ విద్యాసంవత్సరం నుంచి తెర దించాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. బోధకులకు వేతనాలతోపాటు గురుకుల భవనాలకు నెలవారీగా అద్దె చెల్లించనున్నట్లు ప్రకటించడంతో ప్రిన్సిపాళ్లు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **సగం విద్యాసంస్థలు.. :** సామాజిక వర్గాల వారీగా విద్యార్థులకు వసతితో కూడిన ఉచిత విద్యనందించేందుకు అయిదో తరగతి నుంచి డిగ్రీ వరకు గురుకులాలు ఉపయోగపడుతున్నాయి. జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 49 గురుకులాలుంటే.. 24 విద్యాసంస్థలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు, నగరాల వారీగా సొసైటీలు నెలకు రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నాయి. భవన యజమానులతో చేసుకున్న ఒప్పందం మేరకు రెండేళ్లకోసారి అద్దెలను సవరించాల్సి ఉంటుంది. సంక్షేమ సొసైటీలు బిల్లులను ట్రెజరీ కార్యాలయానికి పంపిస్తున్నా.. పలు ఆంక్షలతో అక్కడే నిలిచిపోతున్నాయి. ఫలితంగా రూ.కోట్లలో అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.

**వసతులు మెరుగవుతాయి..** ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఉన్నతాధికారులు నెలవారీగా బోధకుల వేతనాలతో పాటే భవనాల అద్దె చెల్లించాలని నిర్ణయించారు. ఇది అమలైతే ప్రిన్సిపాళ్లపై చాలా వరకు భారం తగ్గుతుంది. నెలవారీగా అద్దె చెల్లిస్తే యజమానులను సైతం వసతులు కల్పించాలని డిమాండ్ చేయవచ్చు.

పూర్ణచంద్రరావు, జోనల్ అధికారి, సాంఘిక సంక్షేమ గురుకులాలు

# పర్యావరణంపై అవగాహనకు ఎకో క్లబ్‌లు

కామారెడ్డి : పర్యావరణ హితానికి విద్యార్థులు అడుగులు వేస్తున్నారు. పుడమి తల్లిని రక్షించుకోవడానికి పాటుపడుతున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్యావరణంపై మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 20వ తేదీ నుంచి వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. బడుల్లో మరిన్ని ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. కేంద్ర సర్కారు 'మేరి లైఫ్' పథకంలో భాగంగా ఈ ఏడాది కూడా పర్యావరణం- వనరుల పునర్వినియోగం పేరిట కార్యక్రమాలను నిర్వహించనున్నారు. **నిత్యం ఒక్కో అంశం ఆధారంగా..**

ఉమ్మడి జిల్లాలో 2,247 ప్రభుత్వ బడులు ఉన్నాయి. ఇందులో 1.56 లక్షల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హరిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. నిత్యం ఒక్కో అంశం ఆధారంగా కార్యక్రమాలను చేపట్టనున్నారు. వివిధ బడుల్లో చేపట్టే కార్యక్రమాల చిత్రాలు, దృశ్యాలు చిత్రీకరించి విద్యాశాఖకు పంపాల్సి ఉంటుంది. పాఠశాల, మండల స్థాయిలో పంచాయతీరాజ్, వ్యవసాయ, అటవీశాఖల సమన్వయంతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయాలి.

**నాటిన మొక్కలకు పేర్లు** బడుల్లో పర్యావరణ పరిరక్షణకు నాటిన మొక్కలను తల్లిలా భావించి సంరక్షించాలని అధికారులు సూచించారు. ప్రతి విద్యార్థి నాటిన మొక్కకు తల్లి పేరు పెట్టాలని పేర్కొన్నారు. పర్యావరణ హితంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థికి తెలిసిన మొక్కపై ప్రత్యేక వ్యాసం రాయాల్సి ఉంటుంది.

# రైల్వే గేటు.. తప్పని పాట్లు

హైదరాబాద్ : అధునాతన హంగులతో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ జరుగుతున్నా రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారులకు పడిగాపులు తప్పడం లేదు. గేటు పడిందంటే సహనానికి పరీక్షే. ప్రతిపాదనలు సిద్ధం చేసినా నిధుల మంజూరు, భూసేకరణలో స్థానికుల నుంచి వ్యతిరేకత, కోర్టు వివాదాలతో పనులు ముందుకు సాగడం లేదు. సుమారు 18 ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలు నిర్మించాలి.

**వాహనదారుల అవస్థలు**

సఫిల్‌గూడ వద్ద గేటు పడితే ఆర్‌కేనగర్ అండర్‌పాస్ మీదుగా 2 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.
బొల్లారం కావల్రీ బ్యారక్స్ ప్రాంతంలో మూడు లెవెల్ క్రాస్‌లతో పాటు అల్వాల్‌లోని లయోలా కాలేజీ సమీపంలోని మరో క్రాసింగ్ వల్ల వాహనదారులు రోజులో 25 సార్లు వేచి ఉండాల్సి వస్తోంది. మేడ్చల్ – గుండ్లపోచంపల్లి మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఖైరతాబాద్ రైల్వే గేట్ పడితే వాహనదారులు కనీసం 20 నిముషాలు ఆగాల్సిందే. మెట్రోస్టేషన్ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంకు పక్కనే ఆర్‌యూబీ ఉన్నప్పటికీ ఆ స్థలం ఆక్రమించడం, పలు వివాదాలు ఉండటంతో వాడుకలో లేదు. రాజ్‌భవన్ ఎదురుగా ఉన్న మక్తాకు వెళ్లే దారిలో ఆర్‌వోబీ లేదా ఆర్‌యూబీ నిర్మించాలన్న ప్రతిపాదలున్నా సాధ్యమయ్యే పని కాదని అధికారులు తేల్చారు. సనత్‌నగర్– అమ్ముగూడ ప్రాంతంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏళ్లు గడుస్తున్నా మోక్షం కలగలేదు. దయానంద్‌నగర్ – మౌలాలీ మార్గంలో 2019లోనే ఆర్‌వోబీ మం



జూరైంది. రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో కాలయాపన జరిగింది. దీంతో 100శాతం ఖర్చు భరిస్తూ పనులు చేపట్టినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.
మౌలాలీ యార్డ్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంది.

**ప్రజాప్రతినిధుల సూచనలు..**

ఆర్‌యూబీ అనుమతికి ప్రయత్నిస్తే ఏడాది సమయం పట్టిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి వాపోగా...సనత్‌నగర్ ఫతేనగర్ మధ్య ఉన్న బస్తీవాసులు రైల్వే ట్రాక్‌ను దాటుతూ మృత్యువాత పడుతున్నారని అవసరమైన చోట్ల ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టాలని ఎంపీ ఈటల బల్దియాకు సర్వసభ్య సమావేశంలో సూచించారు.

**పరిష్కార మార్గాలివే..**


వాహనదారులకు, ప్రయాణికులకు ఉపయోగపడేలా రైళ్ల రాకపోకలు అనుసంధానించిన రియల్ టైమ్ క్రాసింగ్ స్టేటస్ యాప్‌ను రూపొందించాలి. తద్వారా వాహనదారులు వేచి ఉండే సమయం తగ్గడంతో పాటు ఇంధన పొదుపు ఉంటుందని దిల్లీకి చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఐఎస్‌పీపీ) సూచించింది. రైల్వే ప్రమాదాలను నివారించేందుకు ఆటోమెటిక్ వార్నింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి రెడ్‌లైట్ ఫ్లాషింగ్ ద్వారా రైళ్ల రాకపోకలపై పట్టాలు దాటేవారిని అప్రమత్తం చేయొచ్చు.

# నిర్వహణపై నిర్లక్ష్యం

వేములవాడ: ప్రజలు ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై అధికారుల పట్టింపు కరవైంది. కొన్ని వ్యాయామ పరికరాలు ఊడిపోగా మరికొన్ని వదులుగా మారాయి. మున్సిపల్ అధికారులు మరమ్మతులకు పూనుకోకపోవడం తో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రయోజనమున్నా పట్టింపేదీ?**

పట్టణంలో క్రీడా మైదానాలు లేవు. పట్టణ ప్రజలు నడకకు రెండు బైపాస్ రహదారుల వెంబడి, మండల పరిషత్తు కాంప్లెక్స్ ఆవరణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఉపయోగించుకుంటారు. ఇదే ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లను నెలకొల్పడంతో అవి ఉపయోగకరంగా ఉన్నాయి. సెలవు రోజుల్లో మరింత ఎక్కువగా జనం వస్తున్నారు. గుడి చెరువు కట్ట ప్రాంతంలో తొలగించిన జిమ్ పరికరాలను మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఆ పరికరాలను మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రాంతంలో ఓ మూలన పడేయంతో తుప్పు పట్టిపోతున్నాయి.
రెండు నెలల క్రితం ఓపెన్ జిమ్‌లో మరమ్మతులు చేసేందుకు తొలగించిన పరికరం ఇప్పటి వరకు బిగించలేదు. మరో పరికరం ఊడి కిందపడింది. ఇప్పటికైనా జిమ్‌ల నిర్వహణపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని..



పట్టణంలో ముఖ్య కూడళ్లలో మరిన్ని ఓపెన్ జిమ్‌లను నెలకొల్పాలని స్థానికులు కోరుతున్నారు. “పరికరాల కాల పరిమితి ముగిసింది. వెల్డింగ్ చేయిస్తున్నప్పటికీ అవి ఊడిపోతున్నాయి. కొత్త పరికరాల బిగించడానికి చర్యలు తీసుకుంటామ”ని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ పేర్కొన్నారు.

**15 రకాల పరికరాలు**

వేములవాడ పట్టణంలో అయిదేళ్ల క్రితం మున్సిపల్ నిధులతో మండల పరిషత్తు కాంప్లెక్స్ ఆవరణలో, బైపాస్ రోడ్డులోని మూలవాగు గంగమ్మ గుడి ప్రాంతంలో, గుడి చెరువు కట్ట ప్రాంతంలోని జగిత్యాల బస్టాప్ కూడలి వద్ద ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో దానిలో దాదాపు 15 రకాల వ్యాయామ పరికరాలను బిగించారు. గుడి చెరువు కట్ట ప్రాంతంలోని జిమ్ పరికరాలను అభివృద్ధి పనుల్లో భాగంగా పూర్తిగా తొలగించారు. మిగతా రెండు ప్రాంతాల్లోని జిమ్‌లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ వీటి నిర్వహణపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో పరికరాలు మరమ్మతులకు గురవుతుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురువుతున్నాయి. ఎప్పుడు ఏ పరికరం ఊడిపోతుందో తెలియని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చెంతనే మాటేసి.. జీవితాలను కాటేసి



సికింద్రాబాద్ : నగరంలో విద్యుత్తు తీగలు యమపాశాలుగా మారుతున్నాయి. నిర్వహణ లోపాలకు తోడు గాలివానలకు తీగలు రపీమని తెగిపడుతున్నాయి. సాగర్ రోడ్డు సమీపంలో 11కేవీ తీగ తెగి పాదచారుల బాటపై పడటంతో 11వేల వోల్ట్‌ల విద్యుత్తు ప్రసారమై ఇద్దరు కాలిపోయారు. నగరంలో తరచూ ఈ తరహా ఘటనలు జరుగుతున్నా నిర్వహణపై విద్యుత్తు పంపిణీ సంస్థ దృష్టి పెట్టడం లేదు. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో పరిశీలించగా.. అనేక లోపాలు, సమస్యలు వెలుగుచూశాయి.
నల్లగొండ జిల్లాకు చెందిన రమేష్ సంధ్య దంపతులు 20 ఏళ్లుగా జగద్గిరిగుట్ట శ్రీనివాసనగర్‌లో ఉంటున్నారు. రమేష్ భవన నిర్మాణ కార్మికుడు. పదేళ్ల క్రితం నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై పనిచేస్తుండగా విద్యుత్తు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు అతని రెండు కాళ్లు, చేతులు తొలగించారు.

**ప్రాణాలు బలి..**

కుత్బుల్లాపూర్ పరిధి శివాలయనగర్‌లో ఆరున్నరేళ్ల క్రితం ఏసయ్య(11) 130 కేవీ విద్యుత్తు తీగల కింద ఆడుకుంటున్నాడు. విద్యుదాఘాతంతో ఆ బాలుడు చనిపోయాడు. ఇటీవల ఎంఎస్ మక్తాకు చెందిన 12ఏళ్ల బాలుడు నెక్లెస్ రోడ్డులోని ఈద్గాలో క్రికెట్ ఆడుకుంటూ అక్కడే ఉన్న స్తంభాన్ని పట్టుకుని మృతిచెందాడు. మరో ఘటనలో ఓ మహిళ ఇంటిపై దుస్తులు ఆరేస్తుండగా పైనుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు తగిలి మరణించింది.
నాలుగేళ్ల క్రితం జవహర్‌నగర్ అంబేడ్కర్‌నగర్ నోబెల్ పాఠశాల వద్ద ఓ వ్యక్తి రేకులు వేస్తుండగా ఎల్‌టీలైను తగిలి అపస్మారకస్థితికి వెళ్లాడు. ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు.
జవహర్‌నగర్ మల్కారం ప్రాంతంలో ఎనిమిదేళ్ల బాలుడు విద్యుత్తు నియంత్రిక వద్ద తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు.
శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన పట్నూరు సత్యనారాయణ బతుకు దెరువు కోసం 18 ఏళ్ల క్రితం నగరానికి వచ్చాడు. గాజులరామారం షాపూర్‌నగర్‌లో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. 2022 మేలో ఓ దుకాణంపైన బోర్డు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్తు తీగలకు తగిలి రెండు చేతులు కాలిపోయాయి.

**అస్తవ్యస్తంగా..** రహదారులపై అడ్డంగా స్తంభాలు, విరిగిన స్తంభాలు, కిందికి వేలాడే తీగలు.. కాలం చెల్లిన కండక్టర్లు.. ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, సరిగ్గా ఎర్తింగ్ లేని స్తంభాలు, రింగ్ మెయిన్ యూనిట్లు, ఇళ్లపై వేలాడే తీగలు భయపెడుతున్నాయి. వానాకాలం వచ్చిందంటే ప్రమాదం ఏ రూపంలో ముచ్చుకొస్తుందోనని వణికిపోతున్నారు. ప్రమాదాలను పసిగట్టి స్థానికులు విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా స్పందన ఉండటం లేదు. ఎండాకాలం, వానాకాలం ముందు షెడ్యూల్ రూపొందించుకుని నిర్వహణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మమ అనిపిస్తున్నారు.

అడ్డదిడ్డంగా లైన్లు..

సాగర్ రోడ్డులో జరిగిన ప్రమాదానికి లారీ స్తంభాన్ని ఢీకొట్టడం అని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. రహదారి మధ్యలోనే చాలాసార్లు స్తంభాలు ఉంటున్నాయి. వీటిని తొలగించడంలో డిస్కం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. విద్యుత్తు లైన్లు లాగేటప్పుడు ఒక ప్రామాణికమైన అలైన్‌మెంట్ లేకుండా.. ఇష్టారీతిగా వేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా తీగలు లాగకూడదు. కాలనీల్లో పలుచోట్ల ఇలాంటి ఉల్లంఘనలు కనిపిస్తున్నాయి.

**తొలగింపు ఎప్పుడు?**

బస్తీలు, శివార్లలోని పలు కాలనీల్లో జనావాసాల నడమ హైటెన్షన్ తీగలున్నాయి. ఇళ్ల పైనుంచి చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దుస్తులు ఆరేయబోయి, పనులు చేస్తూ, పిల్లలు పతంగులు తీయబోయి ఇలా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నగరంలోని ఇళ్లపై విద్యుత్తు తీగల తొలగింపునకు గతంలో సర్వే చేయగా రూ.250 కోట్లు అవుతుందని తేల్చారు. అంచనాలు పెరిగి ఇప్పుడు ఆ వ్యయం ఆరేడు వందల కోట్లకు చేరిందని అధికారులు చెబుతున్నారు.

**నడవ లేని స్థితిలో....**

సీతారాంబాగ్ న్యూఇంద్రానగర్‌లో తీగలు ఇళ్లపైనుంచి లాగారు. ఏడో తరగతి చదివే సంపత్ గాలిపటం ఎగరేస్తుండగా షాక్‌కొట్టి తొడలు, అవయవాలు కాలిపోయాయి. పైనుంచి పడటంతో తుంటి ఎముక విరిగింది. ఓవర్‌హెడ్ తీగల స్థానంలో ఎయిర్‌బంచ్‌డ్ కేబుల్స్ వేస్తామని అధికారులు హామీ ఇచ్చి మరిచారు.

**తీగలు తెగి పడిన ఘటనల్లో..**

కాటేదాన్ మధుబన్ సమీపంలో 5 నెలల క్రితం నియంత్రిక తీగ తెగి డీసీఎంపై పడింది. డ్రైవర్ మృతి చెందాడు. 2 ఆవులు, 3 మేకలు మృత్యువాత పడ్డాయి.పద్మారావు నగర్‌లో కవర్ కండక్టర్ తెగి ఉదయపు నడకకు వెళ్లిన వ్యక్తిపై పడడంతో చనిపోయాడు.
దుండిగల్ పురపాలికలో రెండు సంవత్సరాల క్రితం మల్లంపేట ఆకాశ్ లేవుట్ సమీపంలో కరెంట్ తీగ రోడ్డుపై పడింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు.

# పల్లె పోరుకు సై..



వికారాబాద్ : ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ.. అనంతరం సర్పంచి ఎన్నికలు నిర్వహిస్తామనడంతో ఆశావహులు ఇప్పట్నుంచే దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవడం మొదలైంది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు రావడంతో జూన్ నెలాఖరుకు ప్రక్రియ ప్రారంభం కానుందని భావిస్తున్నారు.

**పాతదా.. కొత్త విధానమా?**

జిల్లాలోని 20 మండలాల్లో 2019 జనవరి 21, 25, 28వ తేదీల్లో మూడు దశల్లో పంచాయతీ.. మే 6, 10, 14న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించారు. 2024 ఫిబ్రవరి 1 నుంచి గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండగా, జులై 4న జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసింది. రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ విధానం ఉండేలా గత ఎన్నికల్లోనే నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చింది. తరవాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత విధానాన్నే కొనసాగిస్తారా.. ఏవైనా మార్పులు చేస్తారా.. అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. పాత విధానమే అమలు చేస్తే మరోమారు గతంలో ఉన్న వారికి అవకాశాలు లభిస్తాయి. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకునే అవకాశమున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు భావిస్తున్నారు. రెండు మాసాల వ్యవధిలో ప్రాదేశిక, సర్పంచి ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటికే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

**రైతుల్లో సంతోషం..**

ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందనే సమాచారం అన్నదాతల్లో సంతోషం నింపుతోంది. ఎన్నికలొస్తే రైతు భరోసా అందనుందని వారు చర్చించుకుంటున్నారు. దీనికనుగుణంగానే త్వరలో రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం..–జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి**


గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్, లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల అధికారుల నియామకం తదితర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నాం.

# మార్పులు, చేర్పులపై ఉత్కంఠ

కరీంనగర్ : ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా.. మరో వైపు నగరంలో డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పూర్తి కానుంది. ఎలాగైనా మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారనే సంకేతాలు రావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో డివిజన్ల పునర్విభజన ముసాయిదా అభ్యంతరాల పరిష్కార గడువు ముగియనుంది. అభ్యంతరాలలో మార్పులు, చేర్పులు ఏవిధంగా ఉంటాయనేది ఆసక్తిగా మారింది.

**ఆందోళనలో ఆశావహులు**

ఒక్కో డివిజన్‌లో పది వరకు ఫిర్యాదులు రాగా వాటన్నింటిని క్షేత్రస్థాయిలో క్షుణ్నంగా పరిశీలించారు. ఓటర్లు, సరిహద్దులు, సామాజిక ఇళ్లు పూర్తిగా మారిపోవడంతో రిజర్వేషన్లు దెబ్బతీస్తాయనే కోణంలో ప్రధాన పార్టీల నాయకులు, మాజీ కార్పొరేటర్లు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగడంతోపాటు జిల్లా కలెక్టర్‌కు, కమిషనర్‌కు ఫిర్యాదులు అందించిన విషయం తెలిసిందే. నగరంలో 60 డివిజన్ల నుంచి 66కు పెరగడంతో పునర్విభజన తప్పనిసరిగా మారింది. అభ్యంతరాలు స్వీకరించడంతో 242 రాగా వీటన్నింటిని క్షేత్రస్థాయిలో ఒకటికి, రెండుసార్లు ఆయా ప్రాంతాలను పరిశీలించి వివరాలు సేకరించారు. కనిష్ఠం, గరిష్ఠంగా పది శాతానికి మించకుండా ఓటర్లు లెక్కల్లోకి తీసుకోవాలని భావిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన పది డివిజన్ల నుంచి అసలే అభ్యంతరాలు లేకపోగా, 39 డివిజన్ల నుంచి నామమాత్రంగా, 17 డివిజన్ల నుంచి అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో సామాజిక పరిస్థితులు, ఓటర్లు, ఇళ్ల సంఖ్య, సరిహద్దులు, ఓటర్ల తక్కువ, ఎక్కువ విషయాలను పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. న్యాయబద్ధంగా



అభ్యంతరాలు పరిశీలించాలని ఇప్పటికే కమిషనర్ ఆదేశించడంతో అదేవిధంగా చేపడుతున్నారు. తాము సూచించినట్లుగా అభ్యంతరాలు పరిష్కారం అవుతాయా? కావా? అనే విషయాలపై ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. చివరి ప్రయత్నంగా పట్టణ ప్రణాళిక, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచినట్లుగా ప్రచారం జరుగుతుంది.
కొందరు అధికారులు ఈ విషయాలను వింటున్నప్పటికీ.. నిబంధనల ప్రకారం ఏదీ ఎలా ఉంటే అలాగే చేసి చేతులు దులుపుకొనే పనిలో ఉన్నారు.

**నేటితో పరిశీలన పూర్తి**

డివిజన్ల పునర్విభజనపై వచ్చిన అభ్యంతరాలు 5 గంటలకల్లా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వచ్చిన వాటికి సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈనెల 17 నుంచి 18 వరకు జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తారు. ఆ తర్వాత తుది ప్రకటన జారీ చేస్తారు.

# బైపాస్.. ఇక నిరీక్షణకు చెక్

పెద్దపల్లి: పెద్దపల్లి బైపాస్ నిర్మాణం కాకపోవడంతో.. జిల్లా కేంద్రంలోని కమాన్, కునారం రోడ్డు, బస్టాండ్, మంథని ఆర్వోబీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కష్టసాధ్యమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారిపై రోడ్డు దాటేందుకు నిరీక్షించాల్సి వస్తోంది. ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటుచేసిన సిగ్నల్స్, బారికేడ్స్‌ను వాహనదారులు పట్టించుకోవడంలేదు. ఎట్టకేలకు పుష్కరకాలం తరువాత రూ.82 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం బైపాస్ నిర్మాణానికి కార్యాచరణ మొదలుపెట్టింది.

**తప్పని ఎదురుచూపులు**

2013లో మొదటి విడతలో పెద్దపల్లి బైపాస్ నిర్మాణానికి రూ.110 కోట్లు విడుదలయ్యాయి. సర్వే పనులు పూర్తిచేసిన అధికారులు భూసేకరణకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ సమయానికి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి.

**ఇటీవలి ప్రమాదాలు**

జిల్లా కేంద్రంలో మూడు నెలల క్రితం కోర్టు సమీపంలో వెళుతున్న



మహిళలను కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. గత నెలలో కూనారం కూడలిలో ఓ ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. ఇటీవల కలెక్టరేట్ సమీపంలో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదంలో మృతిచెందాడు.

**15 కిలోమీటర్ల మేర నిర్మాణం**

ప్రస్తుతం పెద్దకాల్వల డిగ్రీ కళాశాల వెనుకవైపు నుంచి హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ పైప్‌లైను మీదుగా.. పెద్దపల్లి, చందపల్లి మినీ హైడల్ వరకు నిర్మించనున్నారు. పైప్‌లైన్ కోసం గతంలో సేకరించిన వంద అడుగుల స్థలంలో.. 40 అడుగులను రోడ్డు నిర్మాణానికి ఇచ్చేందుకు సంబంధిత అధికారులు అంగీకరించారు. మిగతా భూమిని సేకరించాల్సి ఉంది. ఈ మార్గంలో రోడ్డు పొడవు 15 కిలోమీటర్ల వరకు ఉండే అవకాశముంది.

**పాలకుల నిర్లక్ష్యం**

జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత భారాస, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులకు దీనిపై చిత్తశుద్ధి లేదు. తప్పని పరిస్థితుల్లో అపసవ్య దిశలో వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల నిర్మాణానికి గతంలో కంటే తక్కువ నిధులు విడుదల చేశారు. రాజ్‌గోపాల్, భాజపా పట్టణాధ్యక్షుడు

**చిత్తశుద్ధి కొరవడింది**

వాహనాల రద్దీతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. బైపాస్ రహదారితో సమస్య తీవ్రత తగ్గుతుంది. నిధుల విడుదల జీవో వచ్చి ఆరు నెలలు గడిచినా.. నిర్మాణానికి సర్వే చేయడంలేదు. పెద్దకల్వల నుంచి నిట్టూరు మీదుగా, పెద్దబొంకూర్ నుంచి చీకురాయి, హన్మంతునిపేట మీదుగా పట్టణానికి ఇరువైపులా రాజీవ్ రహదారిని అనుసంధానం చేసేలా వలయ రోడ్డును నిర్మించాలి.
రాజ్‌కుమార్, భారాస పట్టణాధ్యక్షుడు

# నిబంధనలు అతిక్రమించి.. రోడ్లు ఆక్రమించి

సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణం జిల్లా కేంద్రం అయిన తరువాత జనాభాతోపాటుగా నివాస గృహాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దానికితోడుగా పట్టణంలో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. ఏ రహదారి చూసినా వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా మారుతోంది. ఈ క్రమంలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమించి ర్యాంపులు నిర్మిస్తున్నారు. దీంతో ఉన్న రోడ్ల విస్తీర్ణం కాస్త కుచించుకుపోయి ఇరుకుగా తయారవుతుండగా రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

**పర్యవేక్షణ కరవై..**

సిరిసిల్ల పురపాలికలో దాదాపు 33 వేల నివాసాలు ఉన్నాయి. అధికారులు కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారు కానీ.. మళ్లీ పర్యవేక్షణ చేయడం లేదు. దీంతో ఇంటి యజమానులు నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకరికి మించి మరొకరు ఇంటి ముందున్న రోడ్లను పెద్దమొత్తంలో అక్రమించుకొని మెట్లను లేదా ర్యాంపులను నిర్మించుకుంటూ పోతుండటంతో సమస్య తీవ్రరూపం దాల్చుతోందని



పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఏ వార్డులో చూసినా ఇదే పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. మున్సిపల్ యంత్రాంగం క్షేత్ర స్థాయిల్లో పర్యటించి ఎక్కడికక్కడ శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**నోటీసులు జారీ చేస్తాం** సిరిసిల్ల పట్టణంలోని వీధుల్లో ఇళ్ల యజమానులు మున్సిపల్ రోడ్లను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా మెట్లు లేదా ర్యాంపులు నిర్మిస్తే ఆ యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. సమస్య నివారణకు తదుపరి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. వాణి, సిరిసిల్ల మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్

చురకలు



# వారు తవ్వేస్తున్నారు.. వీరు వదిలేస్తున్నారు

శంకరపట్నం: గ్రామాల్లోని చెరువులు, కుంటలు, గుట్టలు, ప్రభుత్వభూముల్లో అక్రమ తవ్వకాలు జరిపి మట్టి రవాణా చేస్తున్నా.. నియంత్రించే అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ దందాను అడ్డుకునే వారు కరవయ్యారు. మానకొండూర్ పరిధి శంకరపట్నం మండలంలోని కాచాపూర్, కల్వల, గద్దపాక, అర్కండ్ల, కేశవపట్నం, తాడికల్ గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో పొక్లెయిన్ యంత్రాలతో తవ్వకాలు చేస్తూ మట్టి రవాణా సాగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఈ దందా సాగుతున్నా.. అధికారులు చూసి చూడనట్టు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలు వస్తే చాలు తెల్లవారుజామునే పొక్లెయిన్ యంత్రాలు, ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి.



**గుట్టలను సైతం వదలట్లేదు**

ఈనెల 17న గద్దపాక, కల్వల గ్రామాల్లోని చెరువుల్లో మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరికలు చేశారు. అయినప్పటికి ఆదివారం కాచాపూర్ చెరువులో కొందరు ట్రాక్టర్లలో రవాణా సాగించారు. రైతుల వ్యవసాయ పొలాల్లోకి, గ్రామాల్లోని ఇళ్ల నిర్మాణాల పేరిట డబ్బులు దండుకొంటున్నారు. స్థానిక గ్రామాలతో పాటు కల్వల, కాచాపూర్ గ్రామాల్లోని చెరువుల నుంచి ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.వెయ్యి దాకా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లోని గుట్టల ప్రాంతంలో సైతం మట్టి తవ్వకాల తరలింపుతో నగదు దండుకొంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామస్థులు మండిపడుతున్నారు.

**కేసులు నమోదు చేస్తాం**

సమాచారం అందగానే వెళ్లి పరిశీలిస్తే అక్కడ వాహనాలు కనిపించలేదు. చెరువులు, కుంటల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. మట్టి రవాణాకు వినియోగించే వాహన యజమానులకు జరిమానా విధిస్తాం. కవిత, డీఈఈ

# సర్వే సాగక.. కర్షకుల కలత తీరక

సిరిసిల్ల: సర్వేయర్ల కొరత కారణంగా జిల్లాలో భూ కొలతల సమస్య రైతులను వేధిస్తోంది. రెండు రెవెన్యూ డివిజన్లకు 15 మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా.. 8 ఖాళీలు ఉన్నాయి. ఖాళీలున్న చోట పక్క మండలాల వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ అధికారులు రహదారులు, రైల్వే, ప్రాజెక్టులు తదితర అభివృద్ధి పనుల బాధ్యతలు చూస్తున్నారు. ఏళ్ల తరబడి వీటికే ప్రాధాన్యత ఇవ్వడంతో రైతుల భూముల సర్వేలో జాప్యం జరుగుతోంది.

భూ వివాదాలకు అవకాశం లేకుండా, కొత్త చట్టంలో రీసర్వే నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీతోపాటు, అధునాతన పరికరాలు కేటాయించి, సర్వేశాఖను పూర్తిస్థాయి సామర్థ్యంతో సేవలందించే విధంగా సన్నద్ధం చేయాల్సిన అవసరముంది.

భూ భారతి చట్టం అమలులో భాగంగా అర్హులైన సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 17 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో శిక్షణకు 163 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎంపికైనవారికి ఈనెల 26 నుంచి జులై 26 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా ఇప్పటికే జిల్లాలో 19 మంది లైసెన్సుడు సర్వేయర్లు ఉన్నారు.

జిల్లా వివరాలు



సర్వేకు వచ్చిన దరఖాస్తులు: 12,581
అనుమతి పొందినవి : 7069
తిరస్కరించినవి : 4934
పెండింగ్‌లో ఉన్నవి : 578

బదిలీ కాని దస్త్రాలు

దీనికితోడు జిల్లా ఆవిర్భావం తర్వాత చాలా వరకు దస్త్రాలు బదిలీ కాలేదు. అలాగే అటవీ, రెవెన్యూ భూముల వివాదాలు చాలా వరకు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రభుత్వం భూ భారతి చట్టం అమలులో రైతుల భూములకు హద్దులు పక్కగా ఉండాలని నిర్ణయించడంతో.. సర్వేయర్ల ఆవశ్యకత పెరిగింది. ఈ విభాగాన్ని పటిష్ఠం చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఉన్న లైసెన్సుడ్ సర్వేయర్లకు అనుమతులు ఇస్తూనే.. కొత్తవారికి శిక్షణనిచ్చేలా ప్రణాళికలు చేస్తోంది.

**నక్షా ఆధారంగా రిజిస్ట్రేషన్లు**

నిజాం కాలంలో షెత్వార్ పేరిట భూముల సర్వే జరిగింది. రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పట్టాభూముల వివరాలతో కాస్రా–పహాణి తయారు చేశారు. అప్పటినుంచి వాటినే రెవెన్యూశాఖ పరిగణనలోకి తీసుకుంటుంది. రెవెన్యూ సర్వేలాండ్ రికార్డులోని టీపన్(కొలతల పుస్తకం) ఆధారంగా కొలతలు చేపడుతున్నారు. దీని ద్వారా హద్దులు నిర్ణయిస్తున్నారు. వీటిలో స్పష్టతలేక తరచూ భూముల వివాదాలు నెలకొంటున్నాయి. వీటికి శాశ్వత పరిష్కారం దిశగా నక్షా ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో పేర్కొంది.

**ఏడాదిగా పరిష్కారం కాలేదు**

సర్వే దరఖాస్తు పత్రంతో విజయ్, మర్తన్‌పేట

గ్రామంలో మాకు పలు సర్వే నంబర్లలో 11.10 ఎకరాల భూమి ఉంది. పక్కవారితో హద్దుల సమస్య రావడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీని కోసం గతేడాది మేలో సర్వే కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసి ఏడాదవుతున్నా.. సమస్య పరిష్కారం కాలేదు.

# హరిత లక్ష్యం.. కార్యాచరణ సిద్ధం



కోరుట్ల : ప్రభుత్వం హరిత తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో 2014 నుంచి పట్టణాల్లో, గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని అయిదు పట్టణాల్లో పురపాలక సంఘాల ఆధ్వర్యంలో వన మహోత్సవం చేపట్టేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి పట్టణంలో ప్రత్యేకంగా వన నర్సరీలను ఏర్పాటు చేసి ఏటా కూలీలతో ప్రత్యేకంగా మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. జిల్లా అధికారులు ప్రతి పట్టణంలో విస్తృతంగా మొక్కలు నాటించేందుకు ప్రత్యేక లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే పట్టణ ప్రగతి నర్సరీల్లో లక్షల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. లక్ష్యం అందుకునేందుకు సరిపడా మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో మొత్తం 7,81,200 మొక్కలను నాటాలని లక్ష్యం కేటాయించారు. పట్టణ నర్సరీల్లో 5,35,300 మొక్కలు అందుబాటులో ఉన్నట్లు బల్దియా అధికారులు తెలిపారు.

**పట్టణ నర్సరీల్లో విరివిగా పెంపకం**

గతంలో పట్టణాల్లో నర్సరీలు అందుబాటులో ఉండేవి కావు. చుట్టుపక్కల గ్రామాల్లోని పల్లె వన నర్సరీల్లో పెంచిన మొక్కలు తీసుకువచ్చి నాటేవారు. ఇవి సరిపోకపోవడంతో ప్రైవేటు నర్సరీల నుంచి లక్షల రూపాయలను వెచ్చించి మొక్కలను కొనుగోలు చేసి తెచ్చి పట్టణ ప్రజలతో నాటించేవారు. నాలుగేళ్ల క్రితం ప్రతి పట్టణంలో పట్టణ ప్రగతి నిధులను వెచ్చించి వన నర్సరీలను ఏర్పాటు చేశారు. అందులోనే ఆయా పట్టణాల్లోని రోడ్లకిరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో నాటేందుకు, ఇళ్లలో ప్రజలతో నాటించేందుకు కావాల్సిన పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. పట్టణ నర్సరీల్లో ఏడాదంతా మొక్కలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. నాణ్యమైన మొక్కల కోసం పురపాలక సంఘం ఆధ్వర్యంలో తయారు చేసిన సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు.

**వివిధ రకాలు సిద్ధం**

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పురపాలికల్లోని పట్టణ నర్సరీల్లో కేటాయించిన లక్ష్యం సాధించేందుకు కావాల్సిన అన్ని రకాల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. ఇప్పటికే నర్సరీల్లో వేల సంఖ్యలో మొక్కలు ఏపుగా పెరిగి సిద్ధంగా ఉన్నాయి. ప్రతి ఇంటికి 2 నుంచి 5 వరకు పూల, పండ్ల మొక్కలను ఏటా పంచుతున్నారు. రహదారులకు ఇరువైపులా నాటేందుకు నాలుగు, అయిదు అడుగుల ఎత్తు గల మొక్కలను ప్రత్యేకంగా పెంచుతున్నారు. మల్లెపువ్వు, గులాబి, మందార, గోరింటాకు, చామంతి, తులసి, పారిజాతం, కోనోకార్పస్, జామ, ఉసిరి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, అల్లనేరేడు, చింత, వేప, గుల్‌మోహర్, చైనాబాదం, కానుగ, బాదాం, మారేడు, సెల్లోఫాం, టేకొమా, టేకు, నీలగిరి ఇలా సుమారు 35 రకాల మొక్కలను విరివిగా పెంచుతున్నారు.

# అన్నీ మృత్యు కుహరాలే




హైదరాబాద్ : చార్మినార్‌కు అతి సమీపంలోని కృష్ణా ముత్యాల దుకాణంలో అగ్ని ప్రమాదం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. తక్కువ వెడల్పుతో మెట్లు, ఒకే గుమ్మం, చుట్టూ గాలి కూడా దూరలేని విధంగా నిర్మాణాలు, ఏళ్ల నాటి విద్యుత్తు తీగలతో పనిచేస్తోన్న వ్యాపార కేంద్రాలు ఎంత వరకు శ్రేయస్కరం అని జనాల్లో ఆందోళన మొదలైంది. కింది అంతస్తులో చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలో పై అంతస్తులో వారిని బలి తీసుకున్నాయి. దట్టమైన పొగ ఇంటి నిండా వ్యాపించడంతో ఊపిరి పీల్చుకోలేక 17 మంది చనిపోయారు. రెండేళ్ల కిందట సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోనూ అదే జరిగింది. ఈ నేపథ్యంలో చార్మినార్ చుట్టుపక్కల ఉన్న వెయ్యికిపైగా పురాతన కట్టడాల్లో నిర్వహిస్తున్న దుకాణాల భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

**రద్దీ మార్కెట్లే..** అఫ్జల్‌గంజ్, బేగంబజార్ నుంచి మొదలుపెడితే మూసీకి అటువైపున ఉన్న మదీనా మార్కెట్, పత్తర్‌గట్టీ, లాడ్‌బజార్, దాని చుట్టుపక్కలున్న వేర్వేరు మార్కెట్లలో వందేళ్లకు పైబడిన భవనాలు వెయ్యికిపైగా ఉన్నట్టు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. దుకాణాలన్నీ ఒకదానికొకటి ఆనుకొని ఉండటంతో మంటలు సులువుగా వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది.

**నగరంలో 70వేలు**

ప్రమాదం జరిగిన భవన విస్తీర్ణం 77 గజాలు. రెండు ముత్యాల దుకాణాలు, పై అంతస్తుల్లో ఇళ్లున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు లోపలున్న బాధితులు మెట్ల మార్గం నుంచి బయటకు రాలేకపోయారు. నగరంలో 19లక్షల నిర్మాణాలు ఆస్తిపన్ను పరిధిలో ఉండగా, ఇళ్లతోపాటు వ్యాపార కేంద్రాలు కలిసి ఉన్నవి 70వేలు. వాటన్నింటినీ తనిఖీ చేసి, అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలను అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

**భద్రత కోసం నిర్మించిన భవనమే కారణమా?**

గుల్జార్‌హౌజ్ వద్ద దొంగతనాలకు అవకాశం లేకుండా భవనాలను నిర్మించడమే ప్రమాద తీవ్రతకు కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గాలి దూరకుండా, కిటికీలు, షట్టర్లు నిర్మించడంతో ప్రమాదంలో తప్పించుకునే వీలు లేకుండా చేసింది. గుల్జార్‌హౌజ్‌లో ముత్యాల వ్యాపారం జరిగే ప్రతి భవనమూ ఇదే తరహాలో నిర్మించారు. ఆదివారం సహాయక చర్యలు చేపట్టడానికి తొలుత వెనకాడాల్సి వచ్చిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఇలా చేద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం

హైదరాబాద్: నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు నగరవాసులను బెంబేలెత్తిస్తున్నాయి. 18 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పనిసరి చేసిన నేపథ్యంలో అంతకంటే తక్కువ ఎత్తున్న భవనాల్లో భద్రతా ప్రమాణాలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రమాదాల సమయంలో సహాయక చర్యల్లో ఇబ్బందులతో పాటు మరణాలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతి ఇంట్లో ఫైర్ స్మోక్ డిటెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి.

అగ్నిప్రమాదం జరిగినప్పుడు అందరినీ అప్రమత్తం చేసే హారన్ స్విచ్ బోర్డులు ప్రతి అంతస్తులో ఉండాలి.

ప్రతి అంతస్తులో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఏర్పాటు చేసుకోవాలి.

ప్రధానంగా మీటర్ల దగ్గర, ఎలక్ట్రిక్ ఉపకరణాల వద్ద ఫైర్ బాల్స్ ఉండాలి.

ప్రతి అంతస్తు వద్ద ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేసుకోవాలి.

మంటల్లో చిక్కుకుంటే ఇంట్లో దుప్పట్లను నీటిలో తడిపి ఒంటికి చుట్టుకొని అక్కడి నుంచి బయటపడే ప్రయత్నం చేయొచ్చు.

మంటలు అంటుకున్నప్పుడు విలువైన వస్తువుల కోసం చూడకుండా మొదట ప్రాణాలు కాపాడుకోవాలి. ఒక వేళ పొగలో చిక్కుకుంటే కంగారుపడొద్దు. పొగ గది పైభాగంలో ఎక్కువగా, కింది భాగంలో తక్కువగా ఉంటుంది. ముఖానికి తడి రుమాలుతో గానీ టవల్‌ను చుట్టుకోవాలి. నెమ్మదిగా శ్వాస పీలుస్తూ నేలపై పాకుతూ అక్కడి నుంచి బయటపడే ప్రయత్నం చేయాలి.



# తోడుకున్నోళ్లకు 'లెక్క'లేనంత

పెద్దపల్లి: మట్టి.. ఇసుక.. సహజ వనరులు ఏవైనా తరలింపునకు అనుమతించే క్రమంలో ఓ లెక్క ఉంటుంది. పరిమాణాన్ని బట్టి ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో చెరువు మట్టి విషయంలో ఈ నిబంధనను విస్మరించారు. ఏకంగా ట్రిప్పుల చొప్పున లెక్కలు వేసి అనుమతులిచ్చేశారు. దీంతో 'తోడుకున్నోడికి తోడుకున్నంత' అన్న చందాన దోపిడీ సాగుతోంది.

**ఎందుకీ వెసులుబాటు!** జిల్లాలో అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువ ట్రిప్పులు తీసుకెళ్లడం.. వివాదం కోర్టుల వరకు వెళ్లడం.. ఆ తర్వాత తరలించిన మట్టికి కొలతలు వేసి, జరిమానా విధించడం పరిపాటిగా మారింది. గతేడాది కొత్తపల్లి చెరువు నుంచి అనుమతించిన దాని కంటే ఎక్కువ తరలించారు. చివరికి జరిమానా చెల్లించే పరిస్థితి రాగా రాజకీయ పార్టీల జోక్యం పెరగడంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ట్రిప్పునకు రూ.2700గా ధర నిర్ణయించారు.

**ఎన్నెన్నో సందేహాలు**

'ట్రిప్పు' అంటే ఎంత పరిమాణం అనేది ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. టిప్పర్ సామర్థ్యం ఎంత? అందులో ఎంతవరకు అనుమతిస్తారన్నది పరిగణనలోకి తీసుకోలేదు. 10 టైర్ల టిప్పర్‌లో 20 టన్నులు, 12 టైర్ల టిప్పర్‌లో 25 టన్నుల వరకు మట్టిని తరలించే అవకాశముంటుంది. చెరువులో మట్టిని ఎంత లోతు వరకు తవ్వొచ్చనే నిబంధన లేదు. నీటిపారుదల శాఖ నిబంధనల ప్రకారం చెరువులో సాధారణంగా మీటరు కంటే ఎక్కువ లోతు తవ్వడానికి అనుమతి ఉండదు. భారీ యంత్రాలతో అధిక లోతులో తవ్వుతున్నారు. ఓదెల మండలం కొలనూరు అప్పమయ్య చెరువులో 2–3 మీటర్ల మేర తవ్వుతున్నారు. చెరువు వద్ద లస్కర్ మినహా సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అధికారులు పర్యవేక్షించడం లేదు. సదరు లస్కర్ కూడా ట్రిప్పుల సంఖ్య రాసుకునే రెవెన్యూ అధికారి వద్దే కాలక్షేపం చేస్తున్నాడు.

వాహనాల్లో సామర్థ్యానికి మించి మట్టి తరలింపుతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయి. తూకం వేసేందుకు ఇసుక మాదిరిగా



చెరువుల వద్ద వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయలేదు. రవాణా శాఖ అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. సుల్తానాబాద్–శ్రీరాంపూర్ రోడ్డు పక్కనే ఉన్న కొలనూరు చెరువు మట్టిని సుల్తానాబాద్, పెద్దపల్లి మీదుగా ఇటుక బట్టీలకు తరలించుకునే అవకాశముండగా మడిపల్లి కాలనీ, అంకంపల్లి, మూలసాల క్రాస్‌రోడ్డు, ఉప్పరపల్లి, కొత్తపల్లి, పెద్దబొంకూర్‌ల మీదుగా తరలిస్తున్నారు.

**ప్రశ్నించిన వారిపై కేసులు**

జిల్లాలోని 33 చెరువుల నుంచి మట్టి రవాణాకు అధికారులు అనుమతించగా ప్రస్తుతం 10 చెరువుల నుంచి తరలిస్తున్నారు. మట్టి తరలింపుపై ప్రశ్నించిన వారిని బెదిరించడం, కేసులు పెట్టడం పరిపాటిగా మారింది.

**విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

కొలనూరు అప్పమయ్య చెరువులో అనుమతించిన మేరకే మట్టిని తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, చెరువులో నీరు ఊరేటంత లోతులో మట్టి తీస్తే విచారణ జరిపి, చర్యలు తీసుకుంటాం.

ప్రసాద్, నీటిపారుదల శాఖ ఈఈ, సుల్తానాబాద్

# పెట్రోలు బంకుల్లో సదుపాయాలేవీ..!

సిరిసిల్ల : కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు ఉచితంగా వివిధ సౌకర్యాలు కల్పించాలి. కాగా క్షేత్ర స్థాయిలో ఇవి ఎక్కడా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి బంకులో ఇంధనం నాణ్యతను పరీక్షించే పరికరాలు అందుబాటులో ఉండాలి. రక్షిత తాగునీరు, శౌచాలయాలు, అత్యవసర సమయంలో ఫోన్ చేసుకునే సదుపాయం మొదలైనవి కల్పించాలి. వాహనాల టైర్లలో ఉచితంగా గాలి నింపాలి. జిల్లా వ్యాప్తంగా 85 పెట్రోలు బంకులు ఉండగా చాలాచోట్ల సదుపాయాలు కనిపించడం లేదు. చాలా బంకుల్లో గాలి నింపే యంత్రాలు పని చేయకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. గత్యంతరం లేకపోవడంతో వాహనదారులు డబ్బులు చెల్లించి వాహనాల్లో గాలి నింపించుకుంటున్నారు. మండు వేసవిలో తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉండగా అవేమీ కనిపించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

**అధికారులు పర్యవేక్షిస్తే మేలు**



బంకుల్లో సేవా లోపం ఉంటే ఫిర్యాదు చేసేందుకు తప్పని సరిగా రిజిస్టర్లు అందుబాటులో ఉండాలి. అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించి ఇంధనం నాణ్యత పరీక్షిస్తూ ఉండాలి. అగ్నిమాపక పరికరాలు(ఫైర్ సేఫ్టీ) సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకోవాలి. వినియోగదారులకు అందాల్సిన కనీస సౌకర్యాలను పర్యవేక్షించాలి. కాగా క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదన్న విమర్శలున్నాయి.

**నోటీసులు జారీ చేస్తాం**

జిల్లావ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. నిబంధనలు పాటించకుంటే నోటీసులు జారీ చేస్తాం. వినియోగదారులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. వసంతలక్ష్మి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

చురకలు



# నాడు-నేడు.. పూర్తి ఎప్పుడు..?

పెనుమూరు : వైకాపా హయాంలో పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదుల కొరత అధిగమించే నిమిత్తం నాడు-నేడు పథకాన్ని ఆర్భాటంగా తీసుకొచ్చారు. కానీ అమలులో ఆమడ దూరం లో ఉంది.. నాటి పాలకుల పుణ్యమా అని జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఇప్పటికీ అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి.. ఫలితంగా విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యాబోధన సాగించాల్సిన పరిస్థితి. పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చుతామని ప్రగల్భాలు పలికిన వైకాపా పాలకులు చివరకు వాటిని అసౌకర్యాల్లోకి నెట్టి తమ ఘనత చాటుకున్నారు. ప్రారంభంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కొద్దికాలానికి నిధుల కొరత ఏర్పడటంతో పనులు చాలావరకు ఆగిపోయాయి. ఇప్పటికీ ఆయా పాఠశాలల్లో పనులు



అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్నిచోట్ల గోడలు, పునాదులు, మోల్డింగ్ పనులతో ఆగిపోయాయి.

**కూటమి ప్రభుత్వంపై ఆశలు..**

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అధికారంలోకి వస్తే పాఠశాలల దశాదిశా మారుస్తామని చెప్పారు. విద్యామంత్రి నారా లోకేశ్ అసంపూర్తి భవనాల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడంతో పనులు సాగలేదు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరుచేసి భవనాలు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

**జిల్లాలో నాడు-నేడు పాఠశాలల వివరాలు**

మంజూరైన అదనపు తరగతి గదులు 645
పనులు ప్రారంభించినవి 641
పూర్తైన గదులు 27 వివిధ దశల్లో ఉన్నవి 614

# ఇక 'మొక్క'లేను

భీమవరం : పట్టణంలోని పురపాలక ఖాళీ స్థలాల్లో నాటేందుకు రెండు వేల మొక్కలు 2024లో కొన్నారు. ఒక్కొక్కటి రూ.200. వీటికి రక్షణగా ట్రీగార్డులు, కర్రలకు అదనంగా మరికొంత అయింది. అప్పట్లో ఇందిరమ్మ కాలనీ, బైపాస్ రోడ్డు పొడవునా నాటారు. గునుపూడి సోమగుండం చెరువు గట్టున రెండు మొక్కలు నాటారు. అవి ఇప్పుడు కనుమరుగయ్యాయి.

పచ్చని గోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడులో ఏటా వర్షాకాలంలో 15 వేలకు పైగా మొక్కలు నాటుతున్నారు. కొన్ని పట్టణాల్లో ఒకే ఏడాదిలో పలు కార్యక్రమాల్లో 3500 నుంచి 8 వేలు వేస్తున్నట్లు దస్త్రాల్లో చూపుతున్నారు. వీటిలో కనీసం 10 శాతం మొక్కలు బతికితే పట్టణాలు పచ్చదనంతో కళకళలాడుతాయి. కానీ.. వాటిని సంరక్షించకపోవడంతో అవి కొద్దిరోజులకే ఎండుతున్నాయి. మరికొన్నింటిని పశువులు



తినేస్తున్నాయి. ట్రీగార్డ్సు అక్రమార్కుల పాలవుతున్నాయి. మరుసటి ఏడాది అక్కడే మళ్లీ మొక్కలు నాటడం పరిపాటిగా మారింది.

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3.85 లక్షలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని జూన్ 5న ప్రారంభించారు. ప్రముఖులతో అక్కడక్కడా నాలుగైదు వేయించి మమ అనిపించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా మొక్కలు నాటడం లేదు. కొన్ని రోజుల తర్వాత ఎండ తీవ్రత పెరిగిందంటూ వదిలేయడంతో రూ.లక్షల విలువైనవి ఎండిపోతున్నాయి.

**ఆర్డీ ఏమన్నారంటే..** ప్రతి పట్టణంలో మొక్కల పర్యవేక్షణకు పర్యావరణ ఇంజినీరు ఉన్నారు. వారికి వేరొక బాధ్యతలు అప్పగించకుండా కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే చూడాలని ఆదేశించాం. సీహెచ్ నాగనరసింహారావు, పురపాలక ఆర్డీ

# పండుగొప్ప.. రైతుకు ధరల దెబ్బ

మొగల్తూరు : పండుగొప్ప చేపలకు మార్కెట్లో ధరల పతనం కొనసాగు తుండటంతో ఆక్వా చెరువుల్లో వాటిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. సీబాస్‌గా పిలిచే వీటి ధరలు గతంలో ఆశాజనకంగా ఉండేవి. రాష్ట్రంలో సముద్ర తీరంలోని పశ్చిమగోదావ రి, ఎన్టీఆర్ కృష్ణా, ప్రకాశం తదితర జిల్లాల్లో తక్కువ విస్తీర్ణంలో ఈ సాగు చేసేవారు. వనామీ సాగులో నష్టాలు సంభవిస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండుగప్ప వైపు మళ్లారు. పశ్చిమగోదావరి జిల్లాలో గతంలో సుమారు 600 ఎకరాల్లో వీటి పెంపకం చేసేవారు. ప్రస్తుతం రెండు వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు.

**పెరిగిన దిగుబడులు..** గతంలో ఎకరం చెరువులో 400 నుంచి 500 వరకు పండుగొప్ప చేపలను పెంచేవారు. ప్రస్తుతం ఎకరం చెరువులో వేయి నుంచి రెండు వేలు పెంచుతున్నారు. సాగు విస్తీర్ణం, దిగుబడులు కూడా పెరిగాయి. ఆ మేరకు ఎగుమతులు పెరగలేదు. ఈ చేపలు దిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నై, బెంగళూరు, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. పూర్తిగా దేశీయ మార్కెట్లే ఆధారం. విదేశాలకు ఎగుమతి ఉండదు. సముద్ర వేట నిషేధం ముగియడంతో.. సముద్రంలో చేపలవేట నిషేధ కాలంలో వీటి ధరలు పెరుగుతాయని ఆక్వా రైతులు ఆశించారు. వేట నిషేధకాలం ముగిసింది. దీంతో వీటి ధరలు పెరిగే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కిలో నుంచి రెండు కిలోల బరువు పెరిగిన పండుగొప్ప చేపలకు కిలోకు రూ.400 నుంచి రూ.440 వరకూ చెల్లించి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం కిలో బరువు పెరిగిన చేపకు రూ.340 చెల్లిస్తున్నా రు. నాలుగు కిలోల నుంచి ఐదు కిలోల లోపు బరువు పెరిగిన చేపలకు కిలోకు రూ.365, ఐదు కిలోలు ఆ పై బరువు పెరిగిన చేపలకు కిలోకు రూ.375 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాము నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# రైతన్నకు వరం.. పింఛను పథకం



అనకాపల్లి : వృద్ధాప్యంలో రైతన్నను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజనను ప్రవేశపెట్టింది. యుక్త వయసులో కష్టపడి వ్యవసాయం చేసిన రైతులు వృద్ధాప్యంలో పనిచేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి వారికి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున జీవితకాలం పింఛనుగా ఇచ్చి కేంద్ర ప్రభుత్వం ఆదుకోనుంది. 60 ఏళ్లు దాటిన సన్న, చిన్నకారు రైతులకు ఆసరా కల్పించేందుకు ఈ పథకం అమలులోకి రానుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు.

**అర్హులెవరు?**

18 నుంచి 40 ఏళ్లలోపు వయసుండి సొంతంగా భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులందరూ అర్హులే. అనకాపల్లి జిల్లాలో 3.64 లక్షల మంది రైతులు ఉండగా వీరిలో 40 ఏళ్లలోపు వారు 78 వేల మంది ఉంటారని అంచనా. రైతు పేరున ఐదు ఎకరాల్లోపు పొలం ఉండాలి. భర్తభార్యల పేరున భూమి ఉండి ఇద్దరికీ వేర్వేరుగా పాసు పుస్తకాలుంటే ఇద్దరూ అర్హులే.

**దరఖాస్తు ఇలా..** ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు, ఫోన్ నంబరుతో మీ సేవా కేంద్రాల్లో సంప్రదించాలి. పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి. మొదట ఆధార్, నామినీ వివరాలతో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. అనంతరం పింఛను కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. ప్రీమియం మొత్తంలో సగం రైతు చెల్లిస్తే మిగతా సగం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది.

**ప్రయోజనాలివీ..** భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) పెన్షన్ ఫండ్ నుంచి రైతులకు పింఛను చెల్లిస్తుంది. 60 ఏళ్లలోపు మరణం సంభవిస్తే అప్పటివరకు రైతు చెల్లించిన ప్రీమియం, ప్రభుత్వం చెల్లించిన మొత్తంవడ్డీతో కలిపి జీవిత భాగస్వామికి చెల్లిస్తారు. జీవిత భాగస్వామి లేకపోతే నామినికీ చెల్లిస్తారు. 60 ఏళ్లు దాటాక చనిపోతే జీవిత భాగస్వామికి సగం పింఛను అంటే రూ.1,500 చొప్పున ప్రతి నెలా చెల్లిస్తారు.

**ప్రీమియం ఎంతంటే..**

రైతు వయసు ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయసున్న వారు నెలకు రూ.55 చెల్లిస్తే.. కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.55 కలిపి మొత్తం రూ.110 చెల్లిస్తుంది. 21 ఏళ్ల వయసున్న వారు రూ.61, 25 – రూ.80, 30 – రూ.106, 35 – రూ.159, 40 ఏళ్లున్న వారు రూ.200 చెల్లించాలి. కనీసం ఐదేళ్లు ప్రీమియం చెల్లించాలి. ఆసక్తి లేకుంటే మధ్యలోనైనా వైదొలగవచ్చు. అప్పటివరకు రైతులు చెల్లించిన ప్రీమియం, ప్రభుత్వ వాటా వడ్డీతో కలిపి తిరిగి చెల్లిస్తారు.

# సెజ్‌కు కొత్త కళ



అనకాపల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరవాత పారిశ్రామికవేత్తలు జిల్లావైపు చూస్తున్నారు. విశాఖ నగరానికి సమీపంలో ఉండటం.. సముద్ర తీరం, రైలు, రోడ్డు రవాణాలకు అనుకూలంగా ఉండటంతో చాలా కంపెనీలు ఇటువైపు రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో (సెజ్) కొత్తగా పలు పరిశ్రమలు కొలువుదీరుతున్నాయి. వీటిద్వారా జిల్లాలోని వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించను న్నాయి. రాంబిల్లి మండలం కృష్ణంపాలెంలో గతంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల మండలి (ఏపీఐఐసీ) సెజ్ రెండోవిడత కింద సుమారు 3400 ఎకరాల వరకు భూములు సేకరించింది. అరకొర మౌలిక సదుపాయాలు కల్పించి వదిలేయడంతో గత ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమ కూడా ఇటువైపు కన్నెత్తికూడా చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చింది. కొత్త రోడ్ల నిర్మాణం, పరిశ్రమల అవసరాలకు సరిపడా నీటి సరఫరా, విద్యుత్తు సదుపాయానికి అంచనా టెండర్లను సైతం పిలుస్తున్నారు.

దీంతోపాటు ప్రభుత్వం పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని ప్రకటించింది. దీంతో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో రెండోవిడత సెజ్ భూముల్లో 'యాక్షన్ తెసా' కంపెనీ రూ.200 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి సంస్థ ప్రతినిధులు కర్మాగారం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు.

**నాలుగువేలకు పైగా ఉద్యోగాలు:** యాక్షన్ తెసా కంపెనీ.. ఎండీఎఫ్, హెచ్‌డీఎఫ్ పార్టికల్ బోర్డులతోపాటు లామినేట్ చెక్క ఫ్లోరింగ్ వంటి ఉత్పత్తులను తయారు చేయడంతో ప్రసిద్ధి చెందింది. ఈ పరిశ్రమ నిర్మాణం పూర్తయితే.. ప్రత్యేక్షంగా, పరోక్షంగా నాలుగువేలకు పైగా ఉద్యోగ ఉపాధి కలగనుంది. స్థానిక, నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

# తవ్వేయ్ కొండ.. అమ్మేయ్ గ్రానైట్



చిత్తూరు : లక్షలాది రూపాయల విలువైన ఖనిజ సంపద అక్రమంగా సరిహద్దులు దాటుతూ.. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. స్థానికులు అభ్యంతరాలు చెప్పినా.. బేఖాతరు చేస్తూ కొండల్ని ధ్వంసం చేస్తున్నారు. అదెక్కడో కాదండోయ్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని చిత్తూరు మండలం నాయనిచెరువు, పెద్దిశెట్టిపల్లెల్లోనే. ఈతంతు కొన్ని నెలలుగా సాగుతున్నా పట్టించుకొనేవారు కరవైనట్లు స్థానికంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

నాయనిచెరువు సమీపంలోని ఓ కొండపై స్థానిక నేత కన్నుపడింది. రాత్రివేళ పేలుడు పదార్థాలతో కొండను కొల్లగొడుతూ తమిళనాడు సరిహద్దు గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తూ రోజుకు రూ.10 లక్షల పైనే జేబుల్లో వేసుకుంటున్నారు. గ్రానైట్ తవ్వకాలు, తరలింపుతో ఆప్రాంత రహదారులు దెబ్బతినడంతోపాటు రాత్రివేళ పేలుడు శబ్దాలతో స్థానికులు తిప్పలు పడుతున్నారు. సదరు నేత అక్రమాలపై రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా మామూళ్లు తోడు ఓ ప్రజాప్రతినిధి పేరు చెబుతుండటంతో ఎవరూ అటుగా కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెద్దిశెట్టిపల్లె సమీపంలో ఇలా..** పెద్దిశెట్టిపల్లె సమీపంలోని కొండలపై గుడిపాల మండలానికి చెందిన ఓ నేత, చిత్తూరు నగరానికి చెందిన మరోనేత కలిసి చేపట్టిన అక్రమ మైనింగ్ మూడు నెలలుగా సాగుతోంది. పొక్లెయిన్లు, ఐదుకుపైగా లారీలు ఆ ప్రాంతంలోనే ఉండి తీసిన గ్రానైట్ బండలను తమిళనాడు సరిహద్దు ప్రాంతాల గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తూ రోజూ సంపాదిస్తోంది రూ.25 లక్షలకు పైనే. సీనరేజీ రూపంలో ప్రభుత్వం పెద్దఎత్తున ఆదాయం కోల్పోతున్న నేపథ్యంలో కలెక్టర్ దృష్టి సారించి అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు.

**అక్రమమని తేలితే చర్యలు..**

నాయనిచెరువు, పెద్దిశెట్టిపల్లె ప్రాంతాలలోని కొండల తవ్వకాలపై మా సిబ్బందిని పంపుతాం. అక్కడ చేపట్టే మైనింగ్ అక్రమమని తేలితే ఎవరినీ ఉపేక్షించం. చర్యలు తీసుకుంటాం.

సత్యనారాయణ, డీడీ, గనులశాఖ

# బిగుస్తున్న తుడా.. అవినీతి ఉచ్చు

తిరుపతి : తుడా.. అక్రమాల వెలికితీతలో విజిలెన్స్ అధికారులు కీలక అడుగులు వేస్తున్నారు. వైకాపా పాలనలో ఐదేళ్లూ తుడా నుంచి ఎటువంటి సమాచారం బయటకు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు సాగించారు. అనంతరం నిధులు ఇష్టారాజ్యంగా కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి విచారణ ప్రారంభించింది. 2024 డిసెంబర్‌లో విజిలెన్స్ అధికారుల విచారణ ప్రారంభమైనా మొన్నటి వరకు సమాచార సేకరణ వారికి పెద్ద సవాలుగా మారింది.

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) లో వైకాపా హయాంలో చట్టాలకు, నిబంధనలకు పాతరేశారు. తుడా పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా పెద్దఎత్తున ఆస్తులు తెగనమ్మారు. ఆ సొమ్మును ఇంజినీరింగ్, ఉద్యాన, పరిపాలనా విభాగాలు ఖర్చు చేశాయి. తుడా అధికారుల అత్యుత్సాహంతో చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఎంపీడీవోలు సైతం తుడా నిధులను నీళ్లప్రాయంగా ఖర్చుచేశారు. ఈ లెక్కలు రూ.240 కోట్ల వరకు ఉండగా ఇంజినీరింగ్ విభాగం మరో రూ. 250 కోట్ల వరకు ఖర్చు చేసింది. ఉద్యాన విభాగం ద్వారా రూ.30 కోట్ల వరకు వెచ్చించి ఉత్తుత్తి మొక్కల పంపిణీ, పచ్చదనం



పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు సమాచారం. పరిపాలనా విభాగానికి సంబంధించి వైద్య శిబిరాలు, టెలీ కాన్ఫరెన్సులు, విమాన ఛార్జీలు, ఇంధన ఖర్చు, వాహనాల కొనుగోలు, అద్దెలు, ప్రచార కార్యక్రమాలు, వాలంటీర్లకు బహుమతుల ప్రదానం, సభలు సమావేశాలు, రాజకీయ కార్యక్రమాలు ఇలా మరో రూ.50 కోట్లకు పైగా వెచ్చించినట్లు తెలుస్తోంది.

**నోటీసులు అందుకోనున్న ఇంకొందరు**

తుడా అధ్యక్షులుగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన తనయుడు మోహిత్ రెడ్డి పనిచేసిన కాలంలో తుడాలో కీలక పోస్టుల్లో పనిచేసిన అధికారులకు ఇప్పటికే విజిలెన్స్ అధికారులు తాఖీదులు జారీ చేశారు. చెవిరెడ్డితోపాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, చంద్రగిరి నియోజకవర్గంలోని 15 మంది ఎంపీడీవోలకు తాఖీదులు ఇప్పటికే జారీ అయ్యాయి. వీరు సమాధానం ఇవ్వడానికి సోమవారం వరకు గడువు ఉంది. ఇంజినీరింగ్, ఉద్యాన, పరిపాలనా విభాగంలో వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులకు త్వరలో తాఖీదులు అందనున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆర్అండ్‌బీ అధికారులకు, చెవిరెడ్డి వద్ద పనిచేసిన ప్రత్యేకాధికారులకు సైతం తాఖీదులు జారీ కానున్నాయని తెలుస్తోంది.

# అక్రమ గుట్టలు.. ఆర్జనకు బాటలు

భీమవరం : గోదావరికి వరదల సమయంలో ఇసుక లభ్యత తగ్గుతోంది. ఇదే అదనుగా ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఇసుక నిల్వలు చేస్తున్నారు. దానిని రెట్టింపు ధరలకు విక్రయించేందుకు పన్నాగం పన్నుతున్నారు. నిల్వల విషయమై స్థానిక అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవ డంతో అవి మరింత పెరుగుతున్నాయి.

**తూర్పుగోదావరి నుంచి..**

జిల్లాలోని రీచ్‌లు కోస్టల్ రెగ్యులేషన్ (సీఆర్) జోన్ పరిధిలో ఉండటతో ఇసుక తవ్వకాలకు అవకాశం లేదు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, పెండ్యాల, ఖండవల్లితో పాటు రావులపాలెం రీచ్‌ల నుంచి జిల్లా పరిధిలో వివిధ ప్రాంతలకు సరఫరా చేస్తున్నారు. నెలకు మూడు లక్షల టన్నుల వరకు అవసరం ఉంది. అయితే జులై, ఆగస్టు నెలల్లో గోదావరికి వరదల నేపథ్యంలో రీచ్‌లలో తవ్వకాలు నిలిచిపోతాయి. ఇదే అదనుగా కొందరు జిల్లాలోని సిద్ధాంతం, దొంగరావిపాలెం, ఇలపర్రు, నడిపూడి, రామన్నపాలెం తదితర ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తున్నారు.

ఓపెన్ రీచ్‌లు: 5
బోటమెన్ ర్యాంపులు: 6
వర్షాకాలం ఇసుక అవసరాల అంచనా 5 లక్షల టన్నులు



**వైకాపా వైఫల్యంతో..**

గోదావరి తీరం వెంబడి పుష్కలంగా నిల్వలున్నా గత వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ఉచిత ఇసుక విధానానికి అవరోధంగా మారాయి. రీచ్‌లకు పర్యావరణ, కాలుష్య, ఇతర అనుమతులు ముగియగా వాటి పునరుద్ధరణపై పాలకులు దృష్టి పెట్టలేదు. గతంలో ఓపెన్‌రీచ్‌ల పరిధిలో 6 లక్షల నుంచి 8 లక్షల టన్నుల వరకు ఇసుక నిల్వ చేసేవారు. వర్షాకాలంలో ఇసుక అవసరాల కోసం దాదాపు 5లక్షల టన్నులు అవసరమతుందని అంచనా వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భవన నిర్మాణ రంగం ఊపందుకున్న నేపథ్యంలో అక్రమార్కులు ఖాళీ స్థలాలు, తోటల్లో పెద్ద ఎత్తున నిల్వలు చేస్తున్నారు. సమయాన్ని బట్టి రెట్టింపు ధరలకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

యలమంచిలి మండలం దొడ్డిపట్ల, వడ్డిలంకలో బోట్‌మెన్ ర్యాంపులు పనిచేస్తున్నా అక్కడి ఇసుకలో ఉప్పుశాతం అధికంగా ఉండటంతో నిర్మాణదారులు కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలకు ముందే అనధికారికంగా ఇసుక నిల్వ చేసిన దళారులు, వ్యాపారులకు డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం స్టాకు పాయింట్ల కంటే ప్రైవేటు వ్యక్తులు, వ్యాపారులు నిర్మాణాలు పేరిట ఖాళీ ప్రదేశాల్లో ఇసుక నిల్వ చేస్తున్నారు.

'ప్రభుత్వం స్టాకు పాయింట్లు ఏర్పాటు చేసింది. అవి కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ నిల్వలు ఉన్నా వాటిని సీజ్ చేస్తాం. అవసరమైతే కేసులు పెడతాం' అని గనుల శాఖ ఏడీ రవికాంత్ తెలిపారు.

# ప్రకృతిలోకి వెళదాం.. ఆరోగ్య పాఠాలు నేర్చుకుందాం!

ఆరిలోవ : 'ఈ వైద్యాలయంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రకృతి వైద్యం అందిస్తున్నాం. పూర్వ రికార్డులు పరిశీలించి వ్యక్తి మొత్తం ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటాం. అనారోగ్యానికి మూల కారణాలు విశ్లేషిస్తాం. శరీర సహజ రక్షణ సామర్థ్యాన్ని పెంచేలా చికిత్స అందిస్తున్నాం'. అని డాక్టర్ సౌమ్య తెలిపారు.

మారిన జీవనశైలి వ్యాధులకు ప్రధాన కారణమవుతోంది. వ్యాధులకు వాడే మందులు ఒక వయసు దాటిన తర్వాత దుష్ప్రభావం చూపిస్తున్నాయి. ఇటువంటి వారికి స్వస్థత చేకూర్చడానికి ప్రకృతి చికిత్స అందిస్తోంది శ్రీకృష్ణాపురం గోశాల ఆవరణలోని ప్రహ్లాద యోగ, ప్రకృతి చికిత్సాలయం. సింహాచలం దేవస్థానం నిర్వహణలో ఈ వైద్యాలయం నడుస్తోంది. ఇక్కడ ఆరోగ్యంగా జీవించేందుకు అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నారు. నిష్ణాతులైన ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రవేశ రుసుం రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.



గోశాల ఆవరణలో తిప్పతీగ, పొడపత్రి, నేల ఉసిరి, లవంగ, తులసి తదితర 12 రకాల ఔషధ మొక్కలు పెంచుతున్నారు. ఈ మొక్కలతో తయారు చేసిన ఆయుర్వేద మందులను రోగులకు అందజేస్తారు.

ఇక్కడ మలివయసులో అంటే 70ఏళ్లు దాటిన తర్వాత ఆరోగ్యంగా జీవించేందుకు ఉపయుక్తమైన యోగా, వ్యాయామం, ఆహార నియమాలు, నిద్ర, సహజ జీవనశైలిపై అవగాహన కల్పిస్తారు. మంచి వ్యాపకం, పుస్తక పఠనం, మొక్కలు పెంచడం, ఆనందకర అంశాలను మననం చేసుకోవడం, స్వలాభాపేక్ష వీడడం, కొంత సమయం సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, మౌనం, ఉపవాసం, మితాహారం పాటించేలా సూచనలిచ్చి ఆరోగ్య జీవనానికి బాటలు వేయిస్తారు.

# గురుకులం.. పాముల భయం

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని కొర్రపాడు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విద్యార్థులకు పాముల భయం పట్టుకుంది. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. గురుకుల పాఠశాలను దాదాపుగా 13 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. పక్కాభవనాలు నిర్మించి మూడేళ్ల నుంచి ఇక్కడి నుంచే తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతి వరకు 500 మందికి పైగా



విద్యార్థినులు చదువుతున్నారు.

గురుకుల మైదానంలో ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, గడ్డిజాతి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పాములు, తేళ్లు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. గతంలో పాములు విద్యార్థినుల వసతిగృహాల్లోకి నేరుగా చొరబడటంతో వెంటనే అప్రమత్తమై చంపేశారు. ఈనెల 12వ తేదీ నుంచి విద్యార్థినులకు తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థినులు దుస్తులు శుభ్రం చేసుకునే ప్రదేశం, వసతి గృహాల వద్ద పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉంది. దీనికితోడు తాగునీటికోసం ఏర్పాటు చేసి బోరు దగ్గరకు విద్యుత్తు తీగలను కర్రలపై ఏర్పాటు చేశారు. కర్రలు విరిగితే తీగలు కిందపడితే విద్యార్థినుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికైనా గురుకులం అధికారులు స్పందించి విద్యాలయంలో పిచ్చిమొక్కలు తొగించడంతో పాటు, విద్యుత్తు తీగలకు స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పండ్ల తోటలకు.. వందశాతం ప్రోత్సాహం

చిత్తూరు : మెట్ట ప్రాంతంలో పండ్లతోటల పెంపకానికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఐదెకరాలలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర చిన్న, సన్నకారు రైతులకు వందశాతం ఉపాధి నిధులు వెచ్చించనున్నారు. రెండు నుంచి మూడేళ్లపాటు ఎకరానికి రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకు రైతులకు చెల్లించనున్నట్లు వెల్లడించింది. పోషణకు ఎరువులు,పురుగు మందులు సైతం ఉచితంగా ఇస్తారు. తొలకరిలో నాటితే చక్కగా ఎదిగే అవకాశం ఉంది.

**18 రకాల పండ్ల తోటలకు:** జిల్లా పరిధిలో 18 రకాల పండ్ల తోటలు, 2 రకాల పూల తోటల సాగు, మునగ పంటతో కలిపి 21 రకాల



మొక్కల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించనుంది. సొంత భూమి, నీటి వసతి ఉన్న రైతులు ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదిస్తే మొక్కలు ఇప్పిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి:** ఉపాధిహామీ పథకం కింద రైతులు పండ్లతోటలు పెంచుకోవచ్చు. పెట్టుబడిని పూర్తిగా ప్రభుత్వమే అందజేస్తుంది. మొక్కల సంరక్షణకు నిధులు లబ్ధిదారుల ఖాతాలకే జమచేస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రవికుమార్, పీడీ, డ్వామా

# తుంగభద్ర నీటి విడుదలపై సందిగ్ధం



అనంతపురం : జులై ఒకటో తేదీన అన్ని ప్రధాన కాలువలకు నీరు విడుదల చేస్తామన్న టీబీ ప్రాజెక్టు అధికారుల సంకేతాలు హెచ్చెల్సీ అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే ఈ ప్రధాన కాలువకు పైన పేర్కొన్న తేదీలో నీటిని తీసుకునే స్థితిలో ఇక్కడి యంత్రాంగం లేదన్నది నిష్ఠూర సత్యం. కాలువపై 11 రకాల మరమ్మతు, కొత్త పనులు సాగుతున్నా.. కీలకమైన 137.702 కి.మీ. వద్ద పాత అండర్ టన్నెల్ (యూటీ) స్థానంలో కొత్త యూటీ, 117.794 కి.మీ. వద్ద కొత్తగా రెండు వరుసల రహదారి వంతెన (డీఎల్ఆర్బీ) నిర్మాణాలు అసలు సమస్యగా మారాయి. ఆ రెండు పనుల పురోగతి 50 శాతం కూడా పూర్తికానట్లు తెలుస్తోంది. ఇంతటి క్లిష్ట తరుణంలో తుంగభద్ర నుంచి నీరు విడుదలైతే ఏం చేస్తారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. గుత్తేదారుడి నిర్వాకం.. అధికారుల ముందుచూపు కొరవడంతో అన్నదాతల ఆయకట్టుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. తుంగభద్ర యంత్రాంగం జులై ఒకటో తేదీనే నీరు ఇస్తామన్నా.. సదరు పనులు పూర్తి కాకపోవడంతో రెండు వారాలు ఆలస్యంగా నీరు తీసుకుంటామన్న విషయాన్ని ప్రాథమికంగా బోర్డుకు తెలిపినట్లు సమాచారం.

**అసలే అరకొర.. ఆపై ఆలస్యం**తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ల మార్పిడి.. మరమ్మతు.. అభద్రత మూలంగా ఈ దఫా పూర్తిస్థాయి సామర్థ్యం నీటిని నిల్వ చేయలేమని బోర్డు తెగేసి చెప్పింది. 105 టీఎంసీల సామర్థ్యం ఉన్నా.. 80 టీఎంసీలకు మాత్రమే నిల్వ ఉంచాలని ఇటీవల జరిగిన ఎస్ఈల సమీక్షలో నిర్ణయించారు. క్రస్ట్ గేట్ల స్థాయికి నీరు చేరుకోగానే ప్రధాన కాలువలకు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. అంటే.. డ్యాంలో 40 టీఎంసీలు చేరుకోగానే నీటిని ఇస్తారు. ఈ నెలాఖరు నాటికి నిర్దేశిత టీఎంసీల వరద జలాలు వచ్చే వీలుందని భావిస్తున్నారు. అరకొరగా వచ్చే కోటాను కూడా సకాలంలో తీసుకోకపోతే ఆయకట్టుపై ప్రభావం పడుతుంది. ఇప్పుడు ఆలస్యంగా నీరు తీసుకుంటే మరింత నష్టపోయే ప్రమాదం లేకపోలేదు.

**పనుల వేగమే కీలకం**


కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీ పనుల కోసం రూ.33.89 కోట్లు మంజూరు చేసింది. దీనికి రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విశేష కృషి సల్పారు. ఆ తర్వాత పనుల పురోగతిపై తరచూ క్షేత్రస్థాయికి వెళ్లి అనుశీలన చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని క్లిష్ట పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్న నేపథ్యంలో యూటీ, వంతెన పనులు రెట్టింపు స్థాయిలో వేగం పుంజుకోవాల్సిన అవసరం ఉంది. తుంగభద్ర నీటిని వీలైనంత త్వరగా తీసుకోడానికి పనులు వేగంగా చేసేందుకు కృషి చేస్తున్నామని హెచ్చెల్సీ ఎస్ఈ పురర్దనరెడ్డి తెలిపారు.

**తుంగభద్ర జలాశయం వివరాలు**

డ్యాంలో నీటి నిల్వ : 26.873 టీఎంసీలు
ప్రస్తుత సీజన్‌లో లభ్యత : 120 టీఎంసీలు
ఇన్‌ఫ్లో : 8,776 క్యూసెక్కులు
హెచ్చెల్సీ వాటా : 18.396 టీఎంసీలు

# సాంకేతిక విప్లవానికి సమస్యల సెగ!..

## తగ్గిపోతున్న ఫైబర్‌నెట్ కనెక్షన్లు




అగనంపూడి : సాంకేతిక విప్లవానికి ప్రతీకగా ప్రశంసలు అందుకున్న ఫైబర్‌నెట్ ప్రాజెక్టుకు సమస్యల సెగ తగులుతోంది. తరచూ ప్రసారాల్లో అంతరాయాలు, నాణ్యత లేని సేవలతో విసుగు చెందుతున్న వినియోగదారులు ఇతర నెట్‌వర్కులకు మళ్లుతున్నారు. కనెక్షన్ల సంఖ్య భారీగా తగ్గిపోతుండడంతో కేబుల్ ఆపరేటర్లు ఆందోళన చెందుతున్నారు. వైకాపా హయాంలో ఈ ప్రాజెక్టును నిర్వీర్యం చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సంస్థ తిరోగమనంలోకి పయనిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**వైకాపా హయాంలో నిర్వీర్యం:** ప్రజలకు చౌక ధరలో వినోదంతో పాటు విజ్ఞానం అందించాలనే లక్ష్యంతో 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఫైబర్‌నెట్‌ను ప్రారంభించింది. కేవలం రూ. 150కే అంతర్జాలం, టీవీ ఛానళ్లు, ఫోన్ సదుపాయం కల్పించడంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ ఆపరేటర్ల భాగస్వామ్యంతో 10 లక్షలకుపైగా కనెక్షన్లు ఏర్పాటయ్యాయి. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ సంస్థను వైకాపా నేతలు తమ అనుచరులు, కార్యకర్తలకు ఉపాధి కల్పన కేంద్రంగా మార్చేశారు. అయిదేళ్లలో కొత్త బాక్సులు ఇవ్వకపోగా వినియోగంలో ఉన్న వాటికీ సక్రమంగా సేవలు అందించలేదు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరాక ఆయా అక్రమాలపై విచారణకు ఆదేశించడంతో వైకాపా హయాంలో నియమించిన సిబ్బందిని ఇటీవల తొలగించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో సమస్యలు తలెత్తాయి. ఏయూ క్యాంపస్‌లో ఉన్న నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్(ఎన్.ఒ.సి)లో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో సాంకేతిక సమస్య తలెత్తి రాష్ట్రవ్యాప్తంగా ప్రసారాలు ఆగిపోవడంతో ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆపరేటర్లకు గుదిబండగా..:** ఫైబర్‌నెట్ సేవలకు ప్రతి బాక్సుకు నెలకు రూ.59 చొప్పున కేబుల్ ఆపరేటర్ల నుంచి సంస్థ వసూలు చేస్తోంది. బాక్సు పని చేసినా.. చేయక పోయినా ఆపరేటర్లు అద్దె రూపంలో సొమ్ములు చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం సేవా లోపాలతో పలువురు వినియోగదారులు కనెక్షన్లు తొలగించుకోగా, ఆయా బాక్సులను తిరిగి ఇవ్వడం లేదు. కనెక్షన్లు తగ్గిపోయి ఆదాయం పడిపోగా బాక్సుల అద్దెలతో అప్పులపాలవుతున్నామని కేబుల్ ఆపరేటర్లు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కనెక్షన్ల సంఖ్య 3.5 లక్షలకు పడిపోయిందని రాష్ట్ర కేబుల్ ఆపరేటర్ల జేఏసీ ప్రతినిధి ఎ.నారాయణ రావు ఆరోపించారు. తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి ఫైబర్‌నెట్‌ను గాడిలో పెట్టాలని కోరారు.


# చుక్‌చుక్ 'రైలు'.. పట్టాలెక్కలేదు..!

విశాఖపట్నం: విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి మళ్లీ మొదటికి వచ్చింది. అమృత్ భారత్ పథకానికి ఎంపిక చేసిన స్టేషన్లలో ఒక్క విశాఖలో తప్ప మిగిలిన చోట్ల వేగంగా పనులు జరుగుతున్నాయి. పక్కనే ఉన్న భువనేశ్వర్ స్టేషన్‌ను నవీకరించారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో యుద్ధప్రాతిపాదికన పనులు చేస్తున్నారు. ఇక్కడ మాత్రం అడుగు కూడా ముందుకు పడలేదు. అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమనే విమర్శలు వస్తున్నాయి.

**మూడేళ్ల కిందట టెండర్లు :** విశాఖ రైల్వేస్టేషన్ నవీకరణకు 2022లో రైలు ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ) రూ.450 కోట్లతో బిడ్లు ఆహ్వానించింది. సేషన్‌లో ఎనిమిది ప్లాట్‌ఫారాల విస్తరణ, బహుళ అంతస్తుల కార్ల పార్కింగ్ సముదాయం తదితర వసతులు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు నిబంధన పెట్టారు. పునాదులు నిర్మించిన తర్వాత గుత్తేదారు ఒక్కసారిగా అడ్డం తిరిగారు. మూడేళ్లలో పనులు చేయలేనని చేతులెత్తేశారు. నిధులు సరిపోవని పెంచాలని రైల్వే అధికారులను కోరారు. దీనికి రైల్వే అధికారులు అభ్యంతరం తెలపడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా ఇప్పటికే పూర్తవ్వాల్సిన ప్రాజెక్టు ప్రారంభానికే నోచుకోలేదు.

**పనుల ప్రారంభంపై స్పష్టత ఏదీ?:** పనులు నిలిచిపోవడంతో రైల్వేశాఖ కొత్తగా టెండర్లు పిలిచింది. దీనిపై పాత గుత్తేదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రైల్వేకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడంతో టెండర్ల ప్రక్రియ ముందుకు సాగింది. కొత్త గుత్తేదారును ఎంపిక చేశారు. అయినా పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో స్పష్టత లేదు. స్టేషన్ పునరాభివృద్ధి పనులకు సంబంధించి పాత డీపీఆర్‌లో కొన్ని



మార్పులుచేర్పులు చేసి మళ్లీ కొత్తగా తయారు చేసి రైల్వేబోర్డు ఆమోదానికి పంపించారు.

**ప్లాట్‌ఫారాల సంఖ్య పెంచేలా ప్రతిపాదన..:** పాత డీపీఆర్‌లో కొత్తగా రెండు ప్లాట్‌ఫారాలు నిర్మించాలని ప్రతిపాదించారు. కొత్త దాంట్లో నాలుగు నుంచి ఆరు ప్లాట్‌ఫారాలు నిర్మించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. అలాగే ప్రస్తుతమున్న వాటిని వెడల్పు చేసి పురుద్ధరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇవేకాకుండా కోచింగ్ యార్డును నవీకరించనున్నారు. స్టేషన్ నవీకరణ పనులకు సంబంధించి రైల్వే అధికారులు పారదర్శకత పాటించడం లేదు. దీనిపై కూర్మన్నపాలేనికి చెందిన కె.ఈశ్వర్ ఆర్‌టీఐ కింద సమాచారం కోరారు. ఇంజినీరింగ్ ప్రణాళికలు కొనసాగుతున్నాయి, వాటికి ఎంత ఖర్చవుతుందో అంచనాలు తయారు చేస్తున్నట్లు రైల్వే అధికారులు సమాధానం ఇచ్చారు. గతంలో ఒకసారి అడిగితే దాదాపు ఇదే సమాధానం ఇవ్వడం గమనార్హం.

# ఒక్కరొస్తే ఒట్టు!

నర్సీపట్నం : గతేడాది విద్యా సంవత్సరం ముగిసే నాటికి వేములపూడిలోని సమీకృత సంక్షేమ వసతి గృహంలో 293 మంది విద్యార్థులున్నారు. వేసవి సెలవులు ముగియడంతో నాలుగు రోజుల కిందట నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఈ వసతిగృహాన్ని ఆదివారం ఉదయం సందర్శించగా సిబ్బంది నలుగురు ఉండగా.. విద్యార్థులు ఒక్కరూ లేరు. ఎవరైనా వస్తారేమోనని సిబ్బంది ఎదురుచూస్తూ కనిపించారు. ఇదొక్కటే కాదు. నర్సీపట్నం సహా చుట్టుపక్కల మండలాల్లోని అన్ని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లోనూ ఇదే పరిస్థితి. నూతన విద్యా సంవత్సరంతోపాటు ఈ నెల 12న సంక్షేమ వసతిగృహాలు తెరచుకున్నాయి. విద్యార్థులకు వసతిగృహాలకు చేరుకుని పాఠశాలల్లో ప్రభుత్వం అందజేసే పుస్తకాలు, విద్యా సామగ్రి తీసుకోవాల్సి ఉంది. రోజుల తరబడి హాజరు కాకపోతే చదువులో వెనకపడతారు. సమీప గ్రామాల్లోని వారైనా రాకపోవడంతో సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. కొందరైతే నేరుగా ఇళ్లకు వెళ్లి వసతిగృహాలకు పంపాలని కోరుతున్నారు.

నర్సీపట్నం ప్రాంతంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో చాలామంది అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులున్నారు. దూరప్రాంతాలకు చెందిన వారంతా నాలుగు రోజులు ఆగి వెళ్దాంలే అని మిన్నకుండిపోతున్నారు. పాఠశాలలకు



గైర్హాజరయ్యే హాస్టల్ విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం ఇస్తే త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది.

విద్యార్థులు హాస్టళ్లకు రాకపోవడాన్ని బీసీ, ఎస్సీ వసతిగృహాల సహాయ సంచాలకులు గోపినాథరావు దృష్టికి తీసుకువెళ్లగా.. ఈ నెల 11 నాటికే అందరూ రావాలని విద్యా సంవత్సరం ముగింపు రోజునే విద్యార్థులకు చెప్పినట్లు పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచిన మరుసటి రోజే రెండో శనివారం, ఆదివారం రావడంతో సోమవారం నుంచి హాస్టల్‌కు వస్తామని విద్యార్థులు సంక్షేమాధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చారన్నారు. హాజరు శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ నర్సీపట్నం సహాయ సంచాలకుల పరిధిలోని 11 వసతిగృహాల్లో 1500 మంది, 12 బీసీ సంక్షేమ వసతిగృహాల్లో 750 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. గతంలో వసతి గృహాలకు విద్యార్థులు రోజుల తరబడి రాకపోయినా హాజరైనట్లు చూపేవారు. ఇప్పుడు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు. దీంతో ఎంతమంది హాజరవుతున్నారో స్పష్టంగా తెలిసిపోతోంది.

# సిండికేటా.. మజాకా..!

చిత్తూరు : అంతా మా ఇష్టం.. మేం చెప్పిందే ధర.. మేము కొనిందే కాయ.. ఎవరి మాట వినాల్సిన అవసరం లేదు.. ఇదీ జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమల సిండికేట్ వ్యవహారం. సిండికేట్ దెబ్బకు మామిడి రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. తోతాపురి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి.. సర్వశక్తులూ ఒడ్డినప్పటికీ ఫలితం కానరాలేదు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గుడిపాల మండలంలో గుజ్జు పరిశ్రమ పరిశీలించి టన్నుకు రూ.8 వేలు చెల్లించాలని ఆదేశించినా యజమాన్యంలో మార్పు రాలేదు. సదరు పరిశ్రమలోనే టన్నుపై రూ.2 వేలు తగ్గించి రూ.6 వేలకే కొనుగోలు చేస్తున్నారంటే పరిశ్రమల సిండికేట్ ఎంత గట్టిగా ఉందో అర్థమవుతోంది. మంత్రి ఆదేశాలను పరిశ్రమలు బేఖాతరు చేయడంతో రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి.

**అప్రమత్తమైనా ఫలితమేదీ..?:** తోతాపురి ధరలు ఈ ఏడాది గణనీయంగా తగ్గుతాయని భావించి ప్రభుత్వం ముందస్తుగానే చర్యలు చేపట్టింది. టన్నుకు రూ.4 వేలు అదనంగా ఇస్తామని, యాజమాన్యాలు రూ.8 వేలకు కొనాలని స్పష్టం చేసినా అవి అమలు చేయలేదు.



**అధికార యంత్రాంగం వైఫల్యం:** మద్దతు ధర అమలులో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. పరిశ్రమలపై చర్యలు కరవయ్యాయి. ఆదివారం గుజ్జు పరిశ్రమలు రూ.5-6వేలకు కొనుగోలు చేయగా ర్యాంపుల నిర్వాహకులు రూ.3,500 నుంచి రూ.4 వేలు చెల్లించారు.

పత్తాలేని అధికారులు..: జిల్లాలో 30 ర్యాంపులకు అనుమతులు ఇచ్చారు. వీటిలో 12 చోట్ల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇక్కడ అధికారులను నియమించకపోవడంతో.. రైతుల నుంచి ఎంత కొనుగోలు చేశారు..? ఎంత తరలించారు..? వంటి వివరాల్లేవు.

**అప్పుడు నష్టం రాలేదా..? :** నాలుగైదేళ్ల క్రితం తోతాపురి కాయలు టన్ను రూ.50-60 వేలకు పరిశ్రమలు కొనుగోలు చేశాయి. అప్పుడు నష్టం రాలేదు. ప్రస్తుతం రూ.8 వేలకు కొనడానికి నిరాకరించడాన్ని రైతులు తప్పుబడుతున్నారు.

**రైతుల పడిగాపులు**

మామిడి దిగుబడులు అమ్ముకోవడానికి అన్నదాతలు గుజ్జు పరిశ్రమల వద్ద పడిగాపులు కాస్తున్నారు కాయలు దింపుకోవడానికి స్థలం లేదని రెండ్రోజుల తర్వాత అనుమతి ఇస్తామని చెప్పడంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. సకాలంలో కాయలు కోయాలంటే జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో గుజ్జు తయారీ చేపట్టాలి. మొగిలి, మొగిలి వెంకటగిరి వద్ద ఉన్న పరిశ్రమల్లో గుజ్జు తయారీ ఇప్పటివరకు మొదలుపెట్టనే లేదు.ర్యాంపుల ధరల బోర్డు పెట్టాలని రైతులు కోరుతున్నారు.

**సీఎం స్పందించి ఆదుకోవాలి:** మా తోటలో 100-120 టన్నుల తోతాపురి మామిడి కాయలు ఉన్నాయి. పరిశ్రమలు రూ.5-6వేలకే కొనుగోలు చేస్తున్నాయి. సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించి తోతాపురి మామిడి రైతులకు న్యాయం చేయాలి. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో పర్యటించినా రైతులకు నిరాశే తప్ప ప్రయోజనం లేదు. గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించేస్తున్నాయి. మునీశ్వరరెడ్డి, జిల్లేడుపల్లె, బంగారుపాళ్యం మండలం

# నకిలీ బిల్లు.. పన్నుకు చిల్లు

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 14న 52 క్వింటాళ్ల వరి ధాన్యం విక్రయానికొచ్చింది. క్వింటా మద్దతు ధర రూ.2 వేలకు పైగా ఉండగా గరిష్ఠంగా రూ.1,611 కనిష్ఠంగా రూ.1,471 పలికింది. ధరలు పతనం కావడంతో వ్యాపారులు అన్నదాతల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. దొంగ బిల్లులతో మార్కెట్ ఫీజు (సెస్)కు ఎగనామం పెడుతున్నారు. తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది జేబులు నింపి సరిహద్దులు దాటిస్తున్నారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో సిబ్బంది వసూళ్ల దుకాణం పెట్టారు.

**తక్కువ ధరకు కొనుగోలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రబీలో 25,524 హెక్టార్లలో వరి సాగైంది. ఇందులో ఒక్క నంద్యాల జిల్లాలోనే 23,044 హెక్టార్లలో సాగు చేశారు. వరి ధాన్యం మద్దతు ధర ఏ-గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300లుగా నిర్ణయించారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.. రైతులకు వ్యాపారులే దిక్కయ్యారు. దీన్ని ఆసరాగా తీసుకొని ధర అమాంతం తగ్గించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు సరిహద్దు జిల్లాలకు తరలిస్తున్నారు. అక్కడ నేరుగా బియ్యం మిల్లులకు పంపించి క్వింటాపై రూ.వెయ్యి వరకు లాభం పొందుతున్నారు.

**అవుకు కేంద్రంగా దందా**

మార్కెటింగ్‌కు శాఖకు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో నకిలీ బిల్లులతో రవాణా చేస్తున్నారు. వైఎస్సార్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ, కమలాపురం పేరుతో ఓ వ్యాపారి నకిలీ బిల్లులు సృష్టించి వరి ధాన్యాన్ని హైదరాబాదు, నెల్లూరు, కర్ణాటక



తరలించి వ్యాపారం చేసుకుంటున్నారు.

అవుకు మండలానికి చెందిన ఓ వ్యాపారి అవుకు, బనగానపల్లి, బేతంచెర్ల కేంద్రాల మీదుగా దాటేస్తున్నారు. ఇప్పటి వరకు 10 లారీలు నకిలీ బిల్లులతో తరలించినట్లు అధికారులు గుర్తించారు.

**సరిహద్దు దాటిస్తున్నారు**

రైతులే స్వయంగా ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని విక్రయించడానికి తరలిస్తే మార్కెట్ కమిటీలకు ఎలాంటి ఫీజు చెల్లించనక్కర్లేదు. వ్యాపారులైతే రెండు శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది.

ఉదాహరణకు ధాన్యం క్వింటా రూ.2 వేల ధర ఉంటే ఒక లారీ 30 టన్నుల సామర్థ్యంతో రవాణా చేస్తారు. ఈ లెక్కన నిబంధనల ప్రకారం మార్కెట్ కమిటీకి 2 శాతం అంటే రూ.12 వేలు ఫీజు చెల్లించి ఎక్కడికైనా తీసుకెళ్లి విక్రయించుకోవచ్చు.

పాణ్యం, నంద్యాల, శిరివెళ్ల, రుద్రవరం, బండిఆత్మకూరు, తుంగభద్ర తీర ప్రాంతం నుంచి వరి ధాన్యాన్ని కర్ణాటక రాష్ట్రంలోని సిరుగుప్ప, తెలంగాణలోని హైదరాబాద్, మిర్యాలగూడ, చెన్నై వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**తనిఖీలు తకరారు**

నంద్యాల జిల్లాలో 24, కర్నూలులో 12 వ్యవసాయ తనిఖీ (చెక్ పోస్టులు) కేంద్రాలు ఉన్నాయి. మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ స్థాయి అధికారులు విధులు నిర్వహించాలి. వారి స్థానంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులైన సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నారు. సెక్యూరిటీ గార్డులు, మార్కెట్ కమిటీ సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు పుస్తకాలు వారి దగ్గరే ఉన్నాయి.. ఐదు లారీలు రవాణా చేస్తే.. ఒక లారీకి మార్కెట్ సెస్ వసూలు చేయడం.. డబ్బులు తీసుకొని మిగిలిన లారీలను పంపిస్తున్నారు. ఇలా ఒక్కో కేంద్రం వద్ద నిత్యం రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు.

గత రెండు నెలలుగా రాత్రి వేళల్లో నిత్యం 30-40 వరకు ధాన్యం లారీలు వెళ్తున్నాయి. ఎలాంటి ఫీజు చెల్లించకుండానే సరిహద్దులు దాటుతున్నాయి. ఎక్కువగా పాణ్యం, కర్నూలు తనిఖీ కేంద్రాల మీదుగానే వెళ్తున్నాయి. పాణ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టు నన్నూరు టోల్ ప్లాజా దగ్గర ఉంది. ఏ సమయానికి వస్తారో.. ఏ సమయానికి వెళ్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. బేతంచెర్ల చెక్ పోస్టులో నకిలీ బిల్లులతో వరి ధాన్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేలింది.

# అందిస్తే సారం.. అందకుంటే నిస్సారం

గరివిడి : జిల్లాలో ఖరీఫ్ పంటల సాగుకు సమయం సమీపిస్తోంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులు తున్నాయని, ఈ నెలాఖరుకు రాష్ట్రానికి చేరే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా. అదే జరిగి వర్షాలు కురిస్తే జూన్‌లో పంటల సాగు మొదలవుతుంది. రైతులు భూసారం తెలుసుకుని సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయి. అవసరమైన భూసార పరీక్షలు పూర్తిచేసి ఫలితాలను విశ్లేషించి రైతులకు అందించాల్సి ఉంది. జిల్లాలో 2024-25 ఖరీఫ్‌లో సేకరించిన 21,200 మట్టి నమూనాలను మినహాయించి మిగతా భూముల్లో 2025- 26 ఖరీఫ్‌నకు 28,392 నమూనాలను సేకరించాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 27,930 నమూనాలను సేకరించారు. వాటిలో ఫలితాలు వచ్చినవి 7,517 మాత్రమే. లక్ష్యం ప్రకారం ఇంకా ఫలితాలు రావాల్సిన నమూనాలు 20,875 వరకు ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభంలోగా అందించాలి.

**అయిదేళ్లు పట్టించుకోలేదు..**

వైకాపా హయాంలో జిల్లాలో భూసార పరీక్షల జోలికి పోలేదు. గత ఖరీఫ్ సీజన్‌కు ముందు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మట్టి పరీక్షలు చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో గత సీజన్‌లో పరీక్షలు ఆలస్యమయ్యాయి. సేకరించిన 21,200 నమూనాల ఫలితాలను ఇటీవలే రైతులకు అందించారు. భూసార వివరాలతో కార్డును ముద్రించి ఇచ్చారు. వీటి ఆధారంగా పంటలు సాగు చేయొచ్చు.

కార్డుల రూపంలో అందజేత.: ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పరీక్షలు జరుగుతున్నాయి. రైతుసేవా కేంద్రాల సిబ్బంది పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష కేంద్రంలో 12 రకాల పరీక్షలు చేస్తున్నారు. ఫలితాలను ఎస్‌హెచ్‌సీ పోర్టల్‌లో పొందుపరుస్తున్నారు. ఫలితాల విశ్లేషణ పత్రాలను రైతులకు కార్డుల రూపంలో అందిస్తారు. పొలంలో ఉన్న పోషకస్థాయిలకు అనుగుణంగా ఎరువులను సూచిస్తారు. బి.భానులత, ఏడీ, భూసార పరీక్ష కేంద్రం, విజయనగరం

# కొండను తొలచి... దారిని పూడ్చి



కదిరి : ఎనభై ఏళ్ల కిందట తమ పూర్వీకులు డి.పట్టా పొందారంటూ కదిరికి చెందిన కొందరు వ్యక్తులు కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండను తొలగిస్తూ, ప్రధాన రహదారిని పూడ్చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. కదిరికి చెందిన ఓ వ్యక్తికి 1941 కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వేనం: 1504లో 3.31 ఎకరాల పట్టా ఇచ్చారు. అప్పటి నుంచి ఆ భూమిలో పంటలు సాగుచేసిన దాఖలాలు లేవు. భూముల విలువ పెరగడంతో డి.పట్టా పొందిన వ్యక్తి వారసులు 2023లో కదిరికి చెందిన వైకాపా నాయకుడి సిఫార్సుతో రెవెన్యూ అధికారులు ఆ భూమికి నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీని) అందజేశారు. దీని ఆధారంగా పట్టా పొందిన వ్యక్తి తమ వారసులకు గిఫ్ట్ డీడ్‌గా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ పత్రాలు ఆధారంగా మూడు వారాల కిందట ప్రైవేటు సర్వేయర్లతో భూమిని కొలతలు వేయించుకుని ప్రధాన రహదారి మొదలుకొని కదిరి లక్ష్మీనరసింహస్వామి కొండను ఆక్రమించుకుంటూ ఆరెకరాల వరకు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు.

**అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన**

1941లో 3.31 ఎకరాల భూమిని సాగుకోసం డి.పట్టా పొందారు. పట్టా ఇచ్చే సమయంలో యాభైఏళ్లుగా ఉన్న ఈ భూమిని ఆ తరువాత సాగుకు అనువైనదిగా మార్చేశారు. యాభైఏళ్లు కింద ఉన్న భూమికి డి.పట్టాలు ఇవ్వకూడదని కొందరు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. డి.పట్టా పొందిన రైతులు 84 నాలుగేళ్లపాటు భూమిలోకి వెళ్లలేదు. దశాబ్దాల పాటు ఆ భూమిని అనుభవంలోకి తీసుకోని కారణంగా పట్టా పొందిన వ్యక్తి హక్కు కోల్పోయి ఉంటారని వారు చెబుతున్నారు. పట్టా పొందిన వ్యక్తి వారసులు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతిలేకుండా కొండను, భూమిలోని బండలను పేలుస్తూ పునాదిరాళ్లు, కంకరను అమ్ముకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు రోడ్డును ఆక్రమిస్తూ కొండలోని మట్టిని తరలిస్తూ భూమిని చదును చేస్తున్నారని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు.

**కదిరికొండ ఆక్రమణను అడ్డుకోండి**

కదిరి ప్రాంతవాసులు పవిత్రంగా భావించే కదిరి లక్ష్మీనరసింహస్వామి కొండ (లఘువమ్మ) ఆక్రమణలకు గురికాకుండా అధికారులు అడ్డుకోవాలని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్రీలక్ష్మీనరసింహస్వామివారి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం రోజున గిరిప్రదక్షిణ చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి

కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి సమీపంలోని లఘువమ్మకొండ సమీపంలో భూమిని చదును చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. కొండతో పాటు రాయచోటి ప్రధాన రహదారిని ఆక్రమిస్తూ చదును చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. సిబ్బందిని పంపి అక్కడ ఎలాంటి పనులు చేపట్టవద్దని హెచ్చరించాం. ఆ భూమిలోకి ప్రవేశించిన వ్యక్తుల వద్ద ఉన్న రికార్డులను తీసుకుని తహసీల్దారు కార్యాలయానికి రావాలని సూచించాం. ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

**తవ్వుతున్న ప్రదేశం పరిశీలిస్తాం..**

పెద్దిరెడ్డి, మైనింగ్‌శాఖ అధికారి

అనుమతిలేకుండా బండరాళ్లను పేల్చి పునాదిరాళ్లు, కంకరగా మార్చడం నేరం. ప్రైవేటు భూమి అయినా నిబంధనలు వర్తిస్తాయి. సంబంధిత అధికారుల అనుమతి లేకుండా మట్టిని తవ్వడం, తరలించే వారిపై చర్యలు తప్పవు. కుమ్మరవాండ్లపల్లి వద్ద కొండను తవ్వుతున్న ప్రదేశాన్ని పరిశీలించాలని సిబ్బందిని ఆదేశిస్తాం. నిబంధనలు ఉల్లంఘించినట్లు రుజువైతే చర్యలు తప్పవు.

# షార్‌లో.. నిశబ్దం



శ్రీహరికోట : సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) రోదసీలోకి విజయవంతంగా రాకెట్లను పంపుతూ దశాబ్దాలుగా తన ప్రత్యేకత చాటుతోంది. ప్రయోగాల్లో అతితక్కువ సంఖ్యలో మాత్రమే వైఫల్యాలు చూసింది. ప్రధానంగా జీఎస్ఎల్‌వీ ప్రయోగాల్లో క్రయోజెనిక్ లోపాలు మింగుడుపడలేదు. తాజాగా ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ-సీ61తో పోలిక ఈ విభాగంలో మూడువరకు వైఫల్యాలు ఎదురయ్యాయి. ఆదివారం జరిగిన ప్రయోగంలో సాలిడ్ మోటారులో సాంకేతిక లోపం తలెత్తడం షార్ యాజమాన్యాన్ని ఉలికిపాటుకు గురిచేసింది. కారణం వీటిని షార్‌లోనే అభివృద్ధి చేస్తుంటారు. దీంతో శాస్త్రవేత్తలు అంతర్మథనంలో పడ్డారు.

**అతిపెద్ద కర్మాగారం**

శ్రీహరికోటలో అతిపెద్ద ఘన ఇంధన కర్మాగారం ఉంది. ఇక్కడ 1200 పైగా ఘన ఇంధన మోటార్లను ఇప్పటివరకు తయారు చేశారు. ఇందులోనా సాలిడ్ మోటార్లు ఉన్నాయి. ఎప్పుడూ వైఫల్యం తలెత్తలేదు. ఆదివారం ప్రయోగంలో మాత్రమే సాంకేతిక లోపం ఏర్పడింది. ఘన ఇంధన తయారీలో అల్యూమినియం పొడరను ఇంధనంగా, అమ్మోనియం పర్ క్లోరైడ్‌ను ఆక్సీకరణిగాను, హైడ్రాక్సిల్ టెర్మినేటెడ్ పాలీబుటాడైయన్‌ను జిగురు పదార్థాన్ని 18 రకాల రసాయనాల సమ్మేళనం తర్వాత ఇంధనాన్ని బౌల్‌లో అత్యంత సురక్షితంగా క్యాస్టింగ్ భవనానికి తీసుకెళ్లి ఘన ఇంధన మోటారు తయారు చేస్తారు. ఈ ప్రక్రియలో సున్నితమైన పరికరాలను వినియోగించి, భద్రత అధికారుల పర్యవేక్షణలో నిర్దిష్టమైన ప్రణాళికలతో మోటార్లను తయారు చేస్తున్నారు. అనంతరం స్థిర పరీక్షలు నిర్వహిస్తారు. సాంకేతికంగా అన్ని పరీక్షలు ముగిసిన తర్వాత రాకెట్‌లో అనుసంధానిస్తారు.

**అనుమానాలెన్నో...!**

ఘన ఇంధన మోటార్ల తయారీకి గతంలో నెలల వ్యవధి పట్టేది. కొన్నాళ్లుగా రోజుల వ్యవధిలోనే తయారు చేస్తున్నారు. పూర్తిస్థాయి తనిఖీలు, పర్యవేక్షణ లేకుండానే మోటార్లు తయారవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే పీఎస్ఎల్‌వీ-సీ61 మూడోదశలో సాలిడ్ మోటారులో సాంకేతిక లోపం తలెత్తిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఘన ఇంధన మోటార్లు ఇలా..**

షార్‌లోని సాలిడ్ ప్రొపెలెంట్ స్పేస్ బూస్టర్ ప్లాంట్(స్ప్రాబ్)లో మొదటగా మీటర్ డయా వ్యాసంతో ఎస్1, పీఎస్0 జనరిక్, పీఎస్0 ఎక్స్‌ఎల్ వర్షన్ మోటారు రూపకల్పన చేశారు. ఇది ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీకి వినియోగించారు. అనంతరం పీఎస్ఎల్‌వీ ప్రయోగాలకు 2.8 దయా మీటర్ల వ్యాసంతో పీఎస్1, మరికొంత కాలానికి పీఎస్ఎల్‌వీలోని మూడోదశలో వినియోగించే పీఎస్3 మోటార్లను ఇక్కడే స్ప్రాబ్‌లో రూపకల్పన చేస్తున్నారు.

# సాగుతోన్న.. సాగరమాల పనులు

కోట : కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా చేపట్టిన 34.88 కి.మీ. ఆరు వరుసల సాగరమాల రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాయుడుపేట నుంచి తూర్పు కనుపూరు వరకు రూ.961.20 కోట్లతో చేపట్టిన ఈ పనులు రెండేళ్లుగా కొలిక్కి రావడం లేదు. పనులు గత ఏడాది డిసెంబరుకే పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటికి 25% మాత్రమే పూర్తిచేశారు. స్వయంగా కలెక్టర్ పరిశీలించి గుత్తేదారులకు సూచనలు అందిస్తున్నా పరుగందుకోవడం లేదు.నాయుడుపేట నుంచి కోట మండలం రుద్రవరం, ఊనుగుంటపాళెం, చెందోడు, గూడలి, నెల్లూరుపల్లి, కొత్తపాళెం, సిద్ధవరం మీదుగా చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. 1,300 మంది రైతుల నుంచి 730 ఎకరాల భూములు సేకరించగా 630 ఎకరాలకు పరిహారం ఇచ్చారు. మరో వంద ఎకరాలకు చెల్లించాల్సి ఉండగా రైతులు పలుచోట్ల అడ్డుకొంటున్నారు. ఉక్రమంలోనే అధికారులు వారితో మాట్లాడి పలుచోట్ల పరిహారం ఇప్పించారు.

**అదనంగా కల్వర్టులు, వంతెనల నిర్మాణానికి ప్రతిపాదన**

ముందుగా 67 వంతెలు, కల్వర్టులు, చప్టాలు నిర్మించేందుకు అంచనాలు వేయగా 2023, 2024లో వచ్చిన భారీ వర్షాల కారణంగా పొలాలు ముంపునకు గురయ్యాయి.

దీంతో ఇరిగేషన్ అధికారులు వంద సంవత్సరాల వర్షపాతం వివరాలు తీసుకొని అదనంగా మరో 97 కల్వర్టులు, వంతెనలకు ప్రతిపాదించడం, డిజైన్ మార్పుల నేపథ్యంలో ప్రతిబంధకం ఏర్పడింది.

**వేగవంతం చేస్తున్నాం: ప్రసాద్, నేషనల్ హైవే అధికారి**

సాగరమాల రోడ్డు పనులు వేగవంతం చేస్తున్నాం. రైతుల పరిహారం సమస్యతోపాటు మట్టి నిల్వల సమస్యఉన్నాయి. డిజైన్ మార్పులతో కొంతవరకు జాప్యం జరిగింది. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం.

# గుండె దడ

నంద్యాల : " దీబగుంట్లకు చెందిన మద్దమ్మకు ఉదయం ఛాతీనొప్పి రావడంతో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికొచ్చారు. ఆమెకు గుండె సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రథమచికిత్స చేసిన అనంతరం కర్నూలుకు రెఫర్ చేశారు. వృద్ధురైన ఆమె భర్త ఇద్దరు చిన్నపిల్లలతో కర్నూలులోని సర్వజన ఆసుపత్రికి చికిత్సకు 108లో వెళ్లారు."గుండెజబ్బుతో బాధపడుతూ జిల్లా కేంద్రం ఆసుపత్రికొస్తున్న రోగులను బయటకు పంపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ పూర్తిస్థాయిలో వైద్యం అందక కర్నూలు లేదా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సర్వజన ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

**నిత్యం 30 మంది వరకు**



నంద్యాల సర్వజన ఆసుపత్రిలో రోజూ ఓపీ 1000 నుంచి 1200 వరకు ఉంటోంది. గుండె సమస్యలతో బాధపడే వారు 30 మంది వరకు వస్తున్నారు. యాంజియోగ్రామ్, స్టెంట్, బైపాస్ సర్జరీ చేయించడానికి కర్నూలు లేదా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపుతున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోజూ 10 నుంచి 15 మంది గుండె సంబంధిత రోగులు చికిత్స పొందుతున్నారు. అత్యవసర సమయంలో రోగులు కర్నూలుకు వెళ్లాలంటే 80 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఇలాంటి వారు నిత్యం 5 నుంచి 8 మంది వరకు ఉంటున్నారు.

**క్యాథ్‌ల్యాబ్** ఆసుపత్రిలో కార్డియాలజీకి సంబంధించిన వైద్యుల పోస్టుల కేటాయింపు జరగలేదు. ప్రస్తుతం ఉన్న జనరల్ ఫిజీషియన్ వైద్యులు కనీసం యాంజియోగ్రామ్ చేయాలన్నా క్యాథ్‌ల్యాబ్ ఉండాలి. ఎలాంటి వసతులు ఆసుపత్రిలో లేకపోవడంతో రోగులకు నాణ్యమైన సేవలు అందడం లేదు. పూర్తిస్థాయిలో గుండె సంబంధిత వ్యాధి నిర్ధారణకు 2డీ ఏకో వంటివి చేయడం లేదు. కొన్ని వైద్య పరికరాలు ఉన్నప్పటికీ పక్కన పెట్టేశారు. దీంతో రోగులకు గుండె వైద్యం ఏమాత్రం అందడం లేదు.**పోస్టుల కేటాయింపు లేదు-డా.వెంకటేశ్వర్లు, ఆర్ఎంవో, జీజీహెచ్, నంద్యాల** ప్రస్తుతం న్యూరో, యూరో, యూరాలజీ, నెఫ్రాలజీ సేవలు మాత్రమే ఉన్నాయి. కార్డియాలజీ సేవలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం రోగులను కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నాం.

# రామా.. కనవేమిరా!

నెల్లిమర్ల : జిల్లాకు జీవనాడి అయిన తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు రెండడుగులు ముందుకు.. నాలుగడుగులు వెనక్కిలా ఉన్నాయి. రెండు దశాబ్దాలైనా ప్రాజెక్టుకి దీని నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వలేదు. 2005లో అప్పటి ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా రూ.220 కోట్లతో ఈ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టింది. 2008 నాటికి లక్ష్యంగా పెట్టుకుంది. పరిహారం, పునరావాసం సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ రూ.281 కోట్లు ఖర్చు చేయగా, అందులో భూసేకరణకే రూ.201 కోట్లు వెచ్చించారు. అంటే కేవలం రూ.80 కోట్ల పనులే జరిగాయి.

**ముంపు గ్రామాల పరిస్థితేంటి?**

గత ప్రభుత్వం ప్రాజెక్టు ముంపు గ్రామాలుగా ఏటీ.అగ్రహారం, కోరాడపేట, పడాలపేటను గుర్తించి, భూసేకరణ చేపట్టి, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఏటీ.అగ్రహారంలో 300 ఎకరాలు, కోరాడపేటలో 180 ఎకరాలకు ప్రభుత్వ ధర ప్రకారం ఎకరాకు రూ.1.50 లక్షల చొప్పున చెల్లించారు. ఏటీ.అగ్రహారంలోని 592 మంది నిర్వాసితులను పీడీఎఫ్ సభ్యులుగా గుర్తించి, ఒక్కొక్కరికీ రూ.6.75 లక్షల పరిహారం, మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికీ పూర్తిస్థాయి పరిహారం చెల్లించకుండానే పనులు ప్రారంభించారు.



కోరాడపేటకు నెల్లిమర్లలో 16 ఎకరాలు ఇళ్ల స్థలాలు, పడాలపేటలో 30 ఎకరాల భూమి, 10 కుటుంబాలకు పీడీఎఫ్ పరిహారం ఇవ్వాలి.

**సారిపల్లికి ప్యాకేజీ**

ప్రాజెక్టు నిర్మాణానికి సారిపల్లి గ్రామానికి చెందిన 2100 ఎకరాల భూమి సేకరించారు. ఈ గ్రామంతో పాటు కుదిపి, నీలరాజుపేటలకు చెందిన 1400 కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5.50 లక్షలు పీఎఫ్ (ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీస్) పరిహారం ఇచ్చేందుకు ప్రతిపాదించారు. ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు.

**రూ.3 కోట్లు కోర్టులో జమ**

ప్రాజెక్టుకు సంబంధించిన సప్లస్‌వేర్ నిర్మాణానికి 15.41 ఎకరాలు సేకరించారు. ఇందుకు 58 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ.3 కోట్ల నిధులను కోర్టులో జమ చేశారు. సకాలంలో వారు తీసుకోకపోవడంతో ఇలా జమచేశామని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇటీవల ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ.68 కోట్లు మంజూరు చేసింది. వీటితో గుర్ల అనందపురం వద్ద బ్యారేజీ, రిజర్వాయర్‌కు మళ్లింపు కాలువ పనులు చేస్తున్నారు.**గడువులోగా పూర్తి చేస్తాం.. :** తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తాం. ప్రస్తుతం బ్యారేజీ, మళ్లింపు కాలువ పనులు జరుగుతున్నాయి. నిధులు రాగానే నిర్వాసితుల ప్యాకేజీ అందిస్తాం. అప్పలనాయుడు, ప్రాజెక్టు ఈఈ

# గుజ్జు పరిశ్రమల్లో కొనుగోళ్లు ప్రారంభం

చిత్తూరు : వేసవిలో అందరి దృష్టి మామిడి పైనే. మధుర ఫలానికి జిల్లా పెట్టింది పేరు. జిల్లాలో మామిడి వ్యాపారం మొదలైంది. చిత్తూరులోని యార్డుకు బేనీషా, కాదర్, పుల్లేర, తోతాపురి(బెంగళూర) లైన్ కాయలు చేరుకుంటున్నాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, దిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన ఎగుమతిదారులు, వ్యాపారులు రెండ్రోజుల్లో చిత్తూరుకు చేరుకోనున్నారు. ఆవెంటనే ఇతర రాష్ట్రాలకు టేబుల్ రకాలు ఎగుమతి కానున్నాయి. ఆదివారం బేనీషా, కాదర్, పుల్లేరా, తోతాపురి లైన్ కాయలు చేరుకున్నాయని, నాలుగు రోజుల్లో వ్యాపారం జోరందుకోనున్నదని మండీల యజమానులు, వ్యాపారులు వెల్లడించారు.



**సహకరించని వాతావరణం**

జిల్లాలో ఆరు మామిడి గుజ్జు(పల్ప్) పరిశ్రమలు కార్యకలాపాలు ప్రారంభించాయి. చిత్తూరు, గుడిపాల, పూతలపట్టు ప్రాంతాల్లోని పరిశ్రమల్లో సందడి ప్రారంభమైంది. మామిడి కాయలను యార్డులు సహా ఆయా కంపెనీలకు రైతులు తరలిస్తున్నారు. మిగిలిన పరిశ్రమలు త్వరలో సీజన్‌ను ప్రారంభించనున్నాయి. గుజ్జు పరిశ్రమలు తోతాపురి కాయలను నెలాఖరు నుంచి కొనుగోలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ ఏడాది వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా దిగుబడులు తగ్గాయి. ఈ పంట సైతం పెనుగాలులతో కూడిన వర్షంతో కాయలు నేల రాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తిరుపతి జిల్లాలోని పాకాల, దామలచెరువు, పుత్తూరు సహా చిత్తూరు, పెనుమూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు తదితర ప్రాంతాల్లో కాయలు భారీగా నేల రాలాయి. కొన్నిచోట్ల ఏనుగులు మామిడి చెట్లు విరిచేశాయి. ఇలా అన్ని విధాలా మామిడి రైతుకు కన్నీళ్లు తప్పలేదు. మరోవైపున ఈ ఏడాది మామిడికి మంచి ధర లభిస్తుందని ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు.

# కాసులిస్తే 'కట్ట'దిట్టం

శ్రీశైలం : శ్రీశైలం ఆనకట్ట భద్రతకు నిధుల కొరత వెంటాడుతోంది. 15 ఏళ్ల కిందట వరద పోటెత్తడంతో కట్ట దిగువభాగం, అప్రోచ్‌రోడ్డు కోతకు గురయ్యాయి. మరమ్మతులకు అవసరమైన నిధుల కేటాయింపుపై ప్రభుత్వాలు దృష్టిపెట్టకపోవడం శాపంగా మారింది. సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు కేంద్రం అమలు చేస్తున్న డ్రిప్ పథకం కింద పైసా రాలేదు. ఒకట్రెండు రోజుల్లో పరిశీలనకు సెంట్రల్ వాటర్ కమిషన్ ప్రతినిధులు వస్తున్నట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. వారిచ్చే నివేదికలతో అయినా ప్రభుత్వాల్లో కదలికొస్తేనే శ్రీశైలం జలాశయం భద్రతకు భరోసా లభిస్తుంది.

**పనికొచ్చే పనులకు పైసా ఇవ్వలే**

2009లో పోటెత్తిన వరదలకు ఆనకట్ట కుడివైపు కొండచరియలు, అప్రోచ్‌రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఆనకట్ట స్పిల్‌వే ఎదురుగా ఉన్న ఏప్రాన్ ముందు దృఢమైన బండపరుపు కొంతవరకు కొట్టుకుపోయింది. వీటిని పునరుద్ధరించాలని అప్పట్లోనే నిపుణులు సూచనలు చేసినా పట్టించుకోలేదు. ః కుడిగట్టు కొండ చరియలకు (ఆనకట్టకు పక్కన) ఆనుకొని ఉన్న అప్రోచ్ రోడ్డు వరదలకు కొట్టుకుపోయింది. పునరుద్ధరణకు ఇంతవరకు చిల్లిగవ్వ విడుదల చేయలేదు. ః అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ జరిగితేనే మరమ్మతులకు అవసరమైన వస్తువులు, యంత్ర సామగ్రిని ఏప్రాన్ వద్దకు తీసుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుంది.

**రూ.100 కోట్లు అవసరం**

2009 వరదలకు తీవ్రస్థాయిలో దెబ్బతిన్న శ్రీశైలం ఆనకట్ట భద్రత, పునరుద్ధరణ కోసం రూ.100 కోట్లయినా అవసరం అవుతుంది. కుడిగట్టు వైపు అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణకే రూ.43.60 కోట్లు అవసరమని ఇంజినీర్లు మూడేళ్ల కిందటే ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



ఆనకట్ట దిగువన ఏప్రాన్ బలోపేతం, విస్తరణ కోసం మరో రూ.41.30 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. స్పిల్‌వే రక్షణ, కుడి, ఎడమ వైపు కొండ చరియలను సరిచేయడానికి నిధులు అవసరమని కోరారు.

**డ్రిప్.. ఉఫ్**

దేశంలోని అన్ని ఆనకట్టల భద్రత కోసం కేంద్ర జల వనరుల శాఖ 2020లో ఆనకట్టల పునరుద్ధరణ, మెరుగుదల ప్రాజెక్టు (డ్రిప్) పథకాన్ని అమలు చేసింది. శ్రీశైలం ఆనకట్టకు ఇచ్చేందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది.

ప్రపంచ బ్యాంకు నిధులొస్తాయని 2020లో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ కింద అకౌంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ ఏబీ పాండ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ నిపుణుల కమిటీ ప్రతినిధులు 2021, 2022లో రెండుసార్లు శ్రీశైలం ఆనకట్టను సందర్శించి నివేదికలు సిద్ధం చేశారు. వాటి ప్రకారం ఆనకట్ట ఇంజినీర్లు ప్రతిపాదనలు సమర్పించారు. ఇంతవరకు డ్రిప్ నిధుల ఊసే లేకుండాపోయింది.

# పర్యావరణ హితం.. ఉపాధికి ఊతం



అనంతపురం : నగర, పట్టణాల్లో పర్యావరణ పరిరక్షణకు అడుగులు పడుతున్నాయి. స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు స్వయం ఉపాధికి ఊతమిస్తూనే పర్యావరణ హితానికి నాంది పలుకుతున్నారు. ఇంధన రహిత వాహనాలతో ఉపాధికి ఊతమిస్తున్నారు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం.

ప్రస్తుతం ఎలక్ట్రిక్ ఆటోలు, ద్విచక్ర వాహనాలను బ్యాంకు ద్వారా కంతుల వారీగా చెల్లించే విధానానికి శ్రీకారం చుట్టారు. నగరం, పట్టణాల్లోనే ఎక్కువగా డిమాండ్ ఉండటంతో జనాభా ప్రాతిపదికన లక్ష్యం నిర్దేశించారు. మహిళలు, వారి కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ర్యాపిడో సంస్థతో సీఎం చంద్రబాబు, మెప్మా మిషన్ డైరెక్టరు తేజ్ భరత్ సమక్షంలో ఇటీవల అవగాహన ఒప్పందం చేసుకున్నారు. వారికి మాత్రమే కొన్ని ప్రత్యేక మినహాయింపులు, రాయితీలు కల్పించారు.

సొంతంగా ఆటోలు, ద్విచక్రవాహనం నడపడం కంటే ఇలా సంస్థకు అనుసంధానంగా ఉంటే సుస్థిరమైన, స్థిరమైన ఉపాధి పొందుతారనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అర్హులైన వారిని ఎంపిక చేసే బాధ్యతను అనంతపురం నగరంతోపాటు ఇతర పట్టణాల్లో మెప్మా విభాగం సిబ్బందికి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికే గుంతకల్లులో ఒక లబ్ధిదారు ఆటో పొంది ఉపాధి పొందుతున్నారు.

**ప్రయోజనం ఇలా..**

మూడు నెలల పాటు ర్యాపిడో మొబైల్ అప్లికేషన్స్ ఛార్జీలు రూ.3 వేలు మాఫీ చేశారు. ద్విచక్రవాహనం, ఆటో ద్వారా రోజుకు 9 గంటలు లాగిన్‌తో ర్యాపిడో ఫ్లాట్‌ఫాం వాడుకొని 300 రైడ్ అభ్యర్థనల్లో కనీసం 150 అభ్యర్థనలు పూర్తి చేస్తే నెలకు రూ.1,000 నెలవారీ ఈఎంఐ మద్దతు అందిస్తారు.

రుణం మొత్తం చెల్లించేలోపు ద్విచక్రవాహనం అయితే రూ. 27వేలు, ఆటోకు రూ.50 వేల వరకు ప్రయోజనం ఒనగూరుతుంది.

బ్యాంకు రుణం మహిళల పేరుతో ఇస్తారు. బీ సదరు మహిళకు డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే కుటుంబంలో డ్రైవింగ్ లైసెన్సు ఎవరికైనా ఉంటే బ్యాంకు ద్వారా రుణం పొందొచ్చు.

ద్విచక్రవాహనం రూ.1.21 లక్షలు రూ.1.23 లక్షలు, ఆటో రూ.3.35 లక్షలు, రూ.3.60 లక్షల మోడల్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

బ్యాంకు రుణాన్ని నెలకోసారి చొప్పున ద్విచక్ర వాహనానికి 3 నుంచి 5 సంవత్సరాలు, ఆటోకు 5 నుంచి 7 సంవత్సరాల్లో చెల్లించవచ్చు. రోజుకు ద్విచక్ర వాహనంతో 100 కిలోమీటర్లు చొప్పున నెలకు రూ.14,600, ఆటో ద్వారా రోజుకు 130 కిలోమీటర్లు చొప్పున నెలకు రూ.17 వేలు వరకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చితే ఉపాధి పొందవచ్చు. ఇంకా ఎక్కువ సమయం, కిలోమీటర్లు వెళితే ఆ మేరకు ఉపాధి పొందొచ్చు.

# 517 చెరువులు.. 5.609 టీఎంసీలు



అనంతపురం : మూడు నెలలుగా భానుడి ఉగ్రరూపంతో విలవిల్లాడిన ఉమ్మడి అనంత జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. వరుణుడు ముందస్తుగా కరుణించడంతో చల్లని గాలులు వీస్తున్నాయి. వారం పది రోజుల్లో రుతు పవనాలు జిల్లాలో ప్రవేశిస్తాయని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించింది. ఆ లోపే అకాల వర్షాలు కురవడంతో ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. అనేక ప్రాంతాల్లో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పారుతున్నాయి. చెరువులకు కొత్త నీరు చేరుతుండటంతో 'జలకళ'లాడుతున్నాయి. ఎగువన కర్ణాటకలోనూ అకాల వర్షాలొస్తున్నాయి. ఆ నీరు సైతం దిగువన ఉమ్మడి అనంత జిల్లాలోకి ప్రవేశిస్తోంది. దీంతో ఎక్కడికక్కడ చెరువుల్లోకి నీరు వేగంగా చేరుతోంది.

**1.23 లక్షల ఎకరాల ఆయకట్టు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,484 చెరువుల కింద 1,22,529 ఎకరాల ఆయకట్టు ఉంది. అనంత జిల్లాతో పోల్చితే శ్రీసత్యసాయి జిల్లాలోనే అత్యధికంగా చెరువులు ఉన్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెండు జిల్లాల్లోనూ 49 చెరువులు పూర్తిగా నిండి మరువ పారుతున్నాయి. మరో 30 చెరువుల్లోకి 75 శాతం మేర నీరు చేరాయి. 66 చెరువులు యాభై శాతం నిండాయి. ఇరవై ఐదు శాతం నిండిన చెరువులు 372 ఉండగా.. అసలు చుక్కనీరు చేరని చెరువులు 967 ఉండటం విశేషం. ఉమ్మడి జిల్లాలో మొత్తం 517 చెరువుల్లో 5.609 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నీటి ఎద్దడితో సతమతం అవుతున్న తరుణంలో వాన నీరు చెరువుల్లో నిల్వ ఉండటంతో భూగర్భ నీటిమట్టం పెరుగుతోంది. అనంత జిల్లాలో నీటి మట్టం సగటున 11.15 మీటర్లకు చేరింది. శ్రీసత్యసాయి జిల్లాలో 13.67 మీటర్లలో ఉంది. ఇక అనంత జిల్లాలో ఏప్రిల్‌లో 11.9 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 64.95 మి.మీ. నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో 13.26 మి.మీ.కిగాను 40.71, ప్రస్తుత నెల్లో 15.51 మి.మీ.కి 69.84 మి.మీ. కురిసింది. రెండు జిల్లాల్లోనూ భూగర్భ నీటిమట్టం కొద్దిమేర పెరిగింది.

**అనంతలో ఎక్కువ..**

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా చూస్తే ఎక్కువగా అనంత జిల్లాలోనే వాన పడింది. వంద శాతం నిండిన చెరువులు 35 ఉంటే.. శ్రీసత్యసాయి జిల్లాలో 14 ఉన్నాయి. అనంత జిల్లా పరిధిలో అనంతపురం, ఆత్మకూరు, పెద్దవడుగూరు, రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ, యాడికిలో ఒక్కొక్క చెరువు, విడపనకల్లు, బెళుగుప్పలో రెండ్రెండు, గుత్తిలో నాలుగు, పామిడిలో ఆరు, గుంతకల్లు, వజ్రకరూరులో ఏడు చెరువుల ప్రకారం నిండాయి. శ్రీసత్యసాయి జిల్లాలో తనకల్లు, ముదిగుబ్బ, కొత్తచెరువులో ఒక్కొక్క చెరువు, ధర్మవరంలో ఐదు, నల్లచెరువులో ఆరు చెరువులు భర్తీ అయినట్లు ఆన్‌లైన్ నివేదిక చెబుతోంది.

# అక్రమాలు నిగ్గు తేల్చండి





చిత్తూరు : జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు వద్ద సీసీగా బాధ్యతలు నిర్వర్తించిన సురేంద్రరెడ్డి అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.. వైకాపా హయాంలో అన్నీ తానై వ్యవహరించి ఉద్యోగులను ఇబ్బంది పెట్టిన నేపథ్యంలో ఆయనపై అప్పట్లోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని విశ్రాంత ఎంపీడీవో కనకరాజుల నాయుడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహా పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సారథ్యంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు రంగంలోకి దిగి విచారణ చేపట్టనున్నారు. సురేంద్రరెడ్డి ప్రస్తుతం జీడీనెల్లూరులో ఏవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. జడ్పీలో అన్నీ తానై వ్యవహరించి ప్రశ్నించిన ఉద్యోగులను సస్పెండ్ చేయించడం.. జిల్లాలో దూరప్రాంతాలకు బదిలీ చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ఆరోపణలు వచ్చిన, బదిలీ అయిన, సస్పెండ్ అయిన తదితర కారణాలను ఎదుర్కొంటున్న ఉద్యోగులకు సంబంధించి 300 పైగా దస్త్రాలు కనిపించకపోవడం, కొందరు ఉద్యోగుల ఎస్‌ఆర్‌లు తదితర ముఖ్యమైన దస్త్రాలు మాయమవడం వెనుక అతడి హస్తం ఉందని నాటి సీఈవో గ్లోరియా విచారణలో తేలడంతో అతడిని ఇక్కడి నుంచి పంపేశారు. జడ్పీ కార్యాలయంలో ఏవోలు, సిబ్బంది ఆయా విభాగాల్లో ఏమి చేస్తున్నారు, వారితో ఎవరు మాట్లాడుతున్నారని తెలుసుకునేందుకు ప్రతి సెక్షన్‌లో, ఆవరణంలో 36 నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. జీడీనెల్లూరు వెళ్లినా తన మొబైల్‌లో సీసీ కెమెరాల ఫుటేజీ అనుసంధానం చేసుకుని పర్యవేక్షిస్తూ అడ్డంగా దొరికిపోవడంతో అతడిపై తీవ్ర చర్యలకు ఉపక్రమించారు. సస్పెన్షన్ వరకు వెళ్లడంతో హుటాహుటిన వాటిని తొలగించాడు. ఆపై జరిగిన విచారణలో అతడు దాచిపెట్టిన 300 పైగా దస్త్రాలు, ఎస్‌ఆర్‌లు తిరిగి అప్పగించడంతో అందరూ నివ్వెరపోయారు.

**మళ్లీ వచ్చేందుకు యత్నం..?**

జడ్పీ కార్యాలయం నుంచి వెళ్లిపోయిన అతడు మరోసారి అదే పోస్టులో పనిచేయాలని ప్రయత్నించగా కొందరు అడ్డుకున్నారని సమాచారం. సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందేందుకు సీనియారిటీ జాబితాలో ఉన్నాడు. అతడు ఎక్కడ పనిచేసినా అక్కడ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, గుత్తేదారులతో ఘర్షణ పడేవాడని సమాచారం. అతడిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని పీఆర్ కమిషనర్ కృష్ణతేజ తాజాగా ఆదేశించడంతో నాటి వైకాపా హయాంలో జడ్పీలో ఇంకెన్ని అక్రమాలు వెలుగు చూస్తాయనేది వేచిచూడాల్సిందే.

# పెన్నాలో పంటల సాగు

తాడిపత్రి : గత వైకాపా ప్రభుత్వంలో పెన్నానదిలో భారీగా ఆక్రమణలు జరిగాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పలువురు నదిని ఆక్రమించి హద్దులు వేసి ఇసుకను అమ్ముకుని లక్షలు గడించారు. ఈకోవలోనే నది ఆక్రమించి పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల్లో సుమారు 64 కి.మీ.ల మేర పెన్నానది ప్రవహిస్తోంది. తాడిపత్రిలో 24 కి.మీ.లు కిలోమీటర్ వెడెల్పులో నది విస్తరించి ఉంది. కొన్నాళ్లుగా ఆక్రమణలు జరగడంతో ప్రస్తుతం నది వంద మీటర్లు కూడా లేని పరిస్థితి ఉంది. తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె, నందలపాడు, చిన్నపొలమడ గ్రామాల్లో భారీగా పంటలను సాగు చేశారు. ప్రధానంగా మామిడి, సపోటా, వరి, అల్లనేరేడు తదితర పంటలను సుమారు ఏడు వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వాస్తవానికి మూడు మండలాలకు సంబంధించి వెయ్యి ఎకరాలకు పైగానే ఉంటుందని ఆయా మండలాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటిని ఏళ్ల తరబడి ఇటు నాయకులు, అటు అధికారులు చూస్తున్నా ఎటువంటి చర్యలు లేవని వారు వాపోయారు.



మరోవైపు ఇసుక మాఫీయా కూడా చెలరేగిపోతోంది. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా నదిలో తవ్వకాలు చేపడుతున్నారు. ఒక వైపు నదిలో తవ్వకాలు, మరో వైపు పంటల సాగుతో నది ఉనికి కోల్పోతోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

**నోటీసులు అందించాం**

రజాక్‌వలి, తహసీల్దార్, తాడిపత్రి

తాడిపత్రి పరివాహక ప్రాంతంలో పెన్నానది ఆక్రమించిన విషయం తెలిసిందే. దీనిపై లోకాయుక్తా కూడా చర్యలు తీసుకోవాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా తాము కూడా నదిని ఆక్రమించి సాగు చేస్తున్న వారు, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. నదిలోని ఆక్రమణలను అరికట్టి వాటిని పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

# చేతులు కలిపారు.. కొండను కరిగించారు

రేణిగుంట : రహదారికి మట్టి అమ్మకాల పేరిట కొండలనే మాయం చేస్తున్నారు అక్రమార్కులు. గతంలో వైకాపా నేతలు అక్రమంగా తవ్వకాలు జరిపి అమ్మకాలు చేపడితే ఇప్పుడు అదే వర్గంతో చేతులు కలిపారు స్థానిక నేతలు. రేణిగుంట మండలం కరకంబాడి కేంద్రంగా పెద్దఎత్తున దందా జరుగుతున్నా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కరకంబాడి సమీపంలోని మల్లెమడుగు వెనక శేషాచల కొండలున్నాయి. స్థానికంగా జాతీయ రహదారుల పనులు ఊపందుకోవడంతో 2022 నుంచి వైకాపా నేతలు పెద్దఎత్తున తవ్వకాలు చేపట్టి మట్టి విక్రయించారు. కొద్దికాలంగా స్థానిక నేతలు కొండపై పెత్తనం తీసుకున్నారు. ఇందులో అప్పటికే బలంగా పాతుకుపోయిన వైకాపా నేతలతో కలిసి దందా కొనసాగించాలని నిశ్చయించారు. ఏకంగా కొండనే కనుమరుగు చేసేశారు. గతంలో స్థానిక రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన కందకాలను సైతం పూడ్చివేసి పనులు సాగిస్తున్నారు. ముఖ్యంగా



రోడ్డుపై టిప్పర్ల హల్‌చల్‌తో ప్రజలు హడలిపోతున్నారు. స్థానిక దారులు ధ్వంసమవుతున్నాయి. వాటి అతివేగంతో ప్రజల ప్రాణాలు గాల్లో దీపంలా మారాయి.

**తెరవెనుక ఆ ఇద్దరు...**

మట్టి తవ్వకాల వెనుక నియోజకవర్గ నేతకు చెందిన ఇద్దరు అనుచరులు ఉన్నట్లు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఏఅధికారులూ ఇటువైపు రాకుండా సామదాన దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. మట్టి తరలింపుపై సంబంధిత అధికారులను వివరణ కోరగా తవ్వకాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బదులిచ్చారు.

**నెలకు రూ.1.80 కోట్ల అక్రమ సంపాదన**

రోజూ రాత్రివేళల్లో పెద్దఎత్తున టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. దీంతో ఒకప్పుడు కొండ ఉండగా ఇప్పుడు అక్కడ లోయలు కనిపించేలా ఆ ప్రాంతం తయారైంది. టిప్పర్‌కు రూ.10 వేలకు పైగానే వసూలు చేస్తుండగా సగటున రోజుకు సుమారు రూ.6 లక్షలు నెలకు రూ.1.80 కోట్ల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు అంచనా.

# తీపి తక్కువ.. పోషకాలెక్కువ

ఆళ్లగడ్డ: బాల్యం బక్కచిక్కుతోంది..పోషకాహార లేమితో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పంపిణీ చేసే ఆహారం ఆరోగ్యకరంగా, బలవర్ధకంగా ఉండేలా చర్యలు చేపట్టింది. వచ్చే నెల నుంచి అమల్లోకి తీసుకురానున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3,558 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో 6 నెలల నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు 2,71,588 మంది వరకు ఉన్నారు. వీరిలో 3-6 ఏళ్ల చిన్నారులకు అల్పాహారంగా ఉడికించిన కోడిగుడ్డు, 100 ఎం.ఎల్. పాలు, మధ్యాహ్నం పప్పుతో కూడిన భోజనం అందిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం ప్యాకెట్లు ఇస్తున్నారు.

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు నుంచి మూడేళ్ల పిల్లలను ఒకే సమూహంగా పరిగణించేవారు. ప్రస్తుతం వారిని 6 నుంచి 12 నెలలు, 12 నెలల నుంచి మూడేళ్ల చిన్నారులుగా రెండుగా విభజించారు.

3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వారంలో రెండు మార్లు ఎగ్‌ఫ్రైడ్ రైస్ అందించనున్నారు. ఉదయం ఉడికించిన శనగలు ఇవ్వనున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు అందించే బాలామృతంలో తీపి శాతాన్ని తొలగించనున్నారు. ఈ మార్పును అమలు చేసే కార్యక్రమంలో భాగంగా మొదట ప్రతి జిల్లాకు ఓ కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బి.క్యాంప్ ప్రాజెక్టులోని ఒక కేంద్రాన్ని ఎంపిక చేశారు.

# న్యూస్ పేపర్ లాంటి డ్రెస్సులో అశురెడ్డి.. బ్రేకింగ్ లుక్!

సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారిన ఆషు రెడ్డి ఎప్పుడూ తన స్టైల్ స్టేట్మెంట్‌తో ట్రెండ్ అవుతుంటారు. తాజాగా ఆమె షేర్ చేసిన టెన్నిస్ కోర్ట్ ఫొటోషూట్‌లో ఒకసారి మెరిసిపోయారు. న్యూస్ పేపర్ ప్రింట్ డిజైన్‌తో ఉన్న ఓ బాడీ హగ్ డ్రెస్‌లో ఆమె అందాన్ని మరింతగా హైలైట్ చేస్తూ ఇచ్చిన స్టిల్స్ నెట్టింట్లో వైరల్‌గా మారాయి. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు "గ్లామర్ బ్రేకింగ్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. బ్లాక్ అండ్ వైట్ టోన్‌లో ఉన్న డ్రెస్, ఆమె హై పోనీ హెయిర్ స్టైల్, అన్నీ కలసి ట్రెండీ యాక్టివిటీగా కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఈ లుక్స్ తక్కువ సమయంలోనే వేల సంఖ్యలో లైక్స్‌ని రాబట్టాయి. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో కూడా తన గ్లామర్ స్టైల్‌ను మిస్ కాకుండా ప్రెజెంట్ చేయడం ఆమెలో ఉన్న ఫ్యాషన్ పర్సనాలిటీని స్పష్టంగా చెప్పకనే చెబుతోంది. ఆషు



రెడ్డి టాలీవుడ్‌కు మొదట చిన్న సినిమాలలో స్మాల్ రోల్‌తో ఎంట్రీ ఇచ్చారు. కానీ అసలైన పాపులారిటీ ఆమెకు 'బిగ్ బాస్' షో ద్వారా వచ్చింది. తన ధైర్యమైన మాటలు, స్పష్టమైన అభిప్రాయాలు, మరియు ఓపెన్ అటిట్యూడ్‌తో ఆమె అక్కడే స్పెషల్ గుర్తింపు పొందారు. ఆ తర్వాత ఓటీటీ లో కొన్ని గ్లామర్ వెబ్ షోస్, యూట్యూబ్ ఇంటర్వ్యూలు, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా ఆమె తనదైన మార్క్ వేసారు. ప్రస్తుతం ఆమె ఫొటోషూట్స్, వీడియో రీల్స్, ట్రావెల్ లాగ్స్ ద్వారా సోషల్ మీడియా యాక్టివిటీ బాగా పెంచారు. ప్రతి పోస్ట్‌లోనూ కొత్తదనం, స్టైల్, హాట్నెస్‌తో ఆమె ఫాలోవర్స్‌ను అలరిస్తున్నారు. బ్రాండ్ ప్రమోషన్స్‌లోనూ ఆమె క్రేజ్ పెరిగిపోతోంది. ఆమె పెట్టే ప్రతి పోస్టు ఓ ట్రెండ్‌గా మారుతోంది. మొత్తంగా చూస్తే.. ఆషు రెడ్డి తనదైన యాటిట్యూడ్‌తో సోషల్ మీడియా వేదికపై నిరంతరం తన స్టైల్‌ను ఎక్స్‌ప్లోర్ చేస్తూ వెళ్తోంది. మరి ఈ గ్లామర్ ద్వారా అమ్మడికి ఎలాంటి అవకాశాలు వస్తాయో చూడాలి.

# వాటి మీదే ఆశలు పెట్టుకున్న బ్యూటీ..!

మలయాళ భామ సంయుక్త మీనన్ తెలుగులో భీమ్లా నాయక్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాలో ఆమెకు ఇచ్చిన పాత్రలో ఇంప్రెస్ చేసింది అమ్మడు. ఆ తర్వాత విరూపాక్ష, సార్ సినిమాలతో మెప్పించింది. తెలుగులో వచ్చిన పాపులారిటీతో తమిళ్ లో కూడా వరుస ఛాన్స్ లు అందుకుంటుంది సంయుక్త. ప్రస్తుతం అమ్మడు తెలుగులో స్వయంభు, నారి నారి నడుమ మురారి సినిమాల్లో నటిస్తుంది. నిఖిల్ స్వయంభు సినిమా పీరియాడికల్ కథతో వస్తుంది. ఆ సినిమా కోసం సంయుక్త కూడా గుర్రపు స్వారి నేర్చుకుని మరీ యాక్షన్ సీన్స్ చేసిందని టాక్. ఇక ఈ సినిమాతో పాటు శర్వానంద్ తో నారి నారి నడుమ మురారి సినిమా చేస్తుంది సంయుక్త మీనన్. ఆ సినిమా యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఈమధ్యనే నారి నారి నడుమ మురారి సినిమా నుంచి వచ్చిన సాంగ్ ఒకటి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ రెండు సినిమాలే కాదు అమ్మడు బాలకృష్ణ అఖండ 2 లో కూడా స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. అఖండ లో ప్రగ్యా నటించగా అఖండ 2 లో సంయుక్త



ఛాన్స్ అందుకుంది. బాలయ్య తో ఛాన్స్ తప్పకుండా అమ్మడి కెరీర్ కి హెల్ప్ అవుతుందని చెప్పొచ్చు. ఐతే అఖండ 2 లో సంయుక్త రోల్ ఏంటన్నది ఇంకా క్లారిటీ రాలేదు. ఐతే సంయుక్త తెలుగులో ఎందుకో వెనకబడింది. రాబోతున్న రెండు సినిమాల మీదే సంయుక్త తన ఆశలన్నీ పెట్టుకుంది. ఈ సినిమాల ఫలితాల మీదే ఈ హీరోయిన్ నెక్స్ట్ సినిమాల అవకాశాలు ఉంటాయి. మరి ఈ రెండిటితో సంయుక్త తిరిగి హిట్ ట్రాక్ లోకి వస్తుందా లేదా అన్నది చూడాలి. సంయుక్త మీనన్ ని తెలుగు ఆడియన్స్ ఓన్ చేసుకున్నారు. ఐతే సంయుక్త యూత్ ఫుల్ ఎంటర్టైనర్స్ కి దూరంగా ఉంటుంది. యువతని మెప్పించాలంటే లవ్ స్టోరీస్ లో నటించాలి. కానీ తెలుగులో సంయుక్త డిఫరెంట్ సినిమాలు చేస్తూ వస్తుంది. అందుకే ఆమెకు అంతగా హైప్ రావట్లేదు. ఇప్పటికైనా సంయుక్త తన పంథా మార్చి యూత్ టార్గెట్ సినిమాల్లో నటిస్తే కెరీర్ కి హెల్ప్ అవుతుందని చెప్పొచ్చు. అసలే టాలీవుడ్ లో హీరోయిన్స్ మధ్య ఒక రేంజ్ లో ఫైట్ ఉంటుంది. ఇక్కడ నెగ్గాలంటే మాత్రం రకరకాలుగా ప్రయత్నాలు చేయాల్సిందే. మరి సంయుక్త మీనన్ రాబోతున్న సినిమాలు ఎలా ఉంటాయన్నది చూడాలి.




# నెలకు 6కోట్లు.. నటి రెస్టారెంట్ ఆదాయం



శిల్పా శెట్టి బాలీవుడ్ సహా దక్షిణాది చిత్రసీమకు సుపరిచితమైన పేరు. ఈ భామ ప్రస్తుతం హిందీ సినిమాల్లో నటిస్తోంది. బుల్లితెర రియాలిటీ షోల జడ్జిగాను కొనసాగుతోంది. శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రా ప్రముఖ బిజినెస్ మేన్ అన్న సంగతి తెలిసిందే. అయితే శిల్పాశెట్టికి ఆదాయం కేవలం నటన ద్వారానే కాదు బాస్టియన్ రెస్టారెంట్ చైన్ ద్వారాను ప్రధానంగా ఉంది. మొదట ముంబై బాంద్రాలో ప్రారంభమైన బాస్టియన్, ఆ తర్వాత నెమ్మదిగా నగరంలోని పలు ప్రాంతాలకు విస్తరించింది. 2019లో బాస్టియన్ బ్రాండ్ వ్యవస్థాపకుడు, రెస్టారెంట్ యజమాని రంజిత్ బింద్రాతో శిల్పా భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా పలు మెట్రో నగరాల్లోని బాస్టియన్ రెస్టారెంట్లకు సహ యజమానిగా శిల్పాశెట్టి కొనసాగుతోంది. ఈ బ్రాండ్‌లో 50 శాతం వాటా తన సొంతం. నిజానికి ఆతిథ్య రంగం నా ప్లాన్ బి. నటనా రంగంలో కూడా అద్భుతంగా ఉన్నాను అని చెబుతున్న శిల్పాశెట్టి, బాస్టియన్ ని ముంబై, పూణే, బెంగళూరు, పూణే వంటి చోట్లకు విస్తరించామని తెలిపారు. అంతేకాదు గోవాలో మరో రెండు బాస్టియన్ రెస్టారెంట్లను ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. బాస్టియన్ నుంచి 5-6 కోట్ల మేర నెలవారీ ఆదాయం వస్తోందని అంచనా. అయితే అంతకుమించి ఆర్జిస్తున్నామని, అత్యధిక జీఎస్టీ కట్టిన రెస్టారెంట్ బాస్టియన్ అని కూడా శిల్పాశెట్టి తెలిపింది. ముఖ్యంగా సినీ సెలబ్రిటీలు రెగ్యులర్ గా బాస్టియన్ లో ఆహారం తినేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. అయితే బాస్టియన్ లో పెట్టుబడి పెట్టడానికి ముందు, బాంద్రాలోని తొలి రెస్టారెంట్ లో తినడానికి రాజ్ కుంద్రా- శిల్పా శెట్టి వెళ్లారట. ఆ సమయంలో బాస్టియన్ యజమాని రంజిత్ సరైన పెట్టుబడులు పెట్టే వాటాదారు కోసం వెతుకుతున్నారు. వెంటనే బాస్టియన్ లో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ఆరు చోట్ల బాస్టియన్ రెస్టారెంట్లు ఉన్నాయి. ముంబైలో బాంద్రా, దాదర్, వర్లిలో రెస్టారెంట్లు ఉన్నాయి. పెరువియన్-ఆసియన్ రెస్టారెంట్ అని మరొకటి వీరికి బోండీ ప్రాంతంలో ఉంది. పూణేలో ఒక రెస్టారెంట్ ఉంది. గోవాలో రెండు ప్రారంభిస్తున్నాము.. మాకు 6 కంటే ఎక్కువ రెస్టారెంట్లు ఉన్నాయి అని శిల్పాశెట్టి తెలిపింది. చాలామంది సోషల్ మీడియాలో బాస్టియన్ ఆహారం, ఎగ్జయిట్ చేసే ఇంటీరియర్‌ల గురించి ప్రశంసలు కురిపిస్తారు.. నటి సోనాక్షి సిన్హా, ఆమె భర్త జహీర్ ఇక్బాల్ బాస్టియన్‌లో వారి గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్‌ను కూడా నిర్వహించారు. ఒక అంచనా ప్రకారం.. శిల్పా శెట్టి నికర ఆస్తి విలువ 35 మిలియన్ డాలర్లు. దాదాపు రూ.134 కోట్ల నికర ఆస్తి ఉందని అంచనా. ఆమె భర్త రాజ్ కుంద్రా నికర ఆస్తులు వందల కోట్లు. దుబాయ్ లోను వీరికి విల్లాలు ఉన్నాయి.

# అక్షయ్-ప్రభాస్ కాంబినేషన్‌పైనే ఆసక్తి



మంచు విష్ణు- మంచు మోహన్ బాబుల డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' ట్రైలర్ విడుదలైన సంగతి తెలిసిందే. ప్రస్తుత పాన్ ఇండియా ట్రెండ్ ని అనుసరించి విష్ణు పెద్ద బడ్జెట్ ని రిస్క్ చేస్తున్నాడని అంతా భావిస్తున్నారు. ట్రైలర్ కి స్పందన బాగుంది. నిజానికి ఈ సినిమాలో భక్త కన్నప్పగా నటించిన మంచు విష్ణు పాత్రకు ప్యారలల్ గా శివుడిగా అక్షయ్ కుమార్, కన్నప్పను టెస్ట్ చేసే రుద్ర(మనిషిగా వచ్చే శివుడు)గా ప్రభాస్ నటించడం ఆసక్తిని కలిగించింది. ఇది వింతైన క్రేజీ కాంబినేషన్! అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ముఖ్యంగా అక్షయ్ - ప్రభాస్ కాంబినేషన్ పై ఆసక్తికర చర్చ సాగింది. బాలీవుడ్ లో దిగ్గజ హీరోగా దశాబ్దాల పాటు కొనసాగిన అక్షయ్ కుమార్ ఒక తెలుగు సినిమాకి అంగీకరించడం గొప్ప అనుకుంటే, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో కలిసి అక్కీ నటించడం మరో హైలైట్. పైనుంచి ఆజ్ఞాపించే దేవుడు అక్షయ్ కుమార్ అయితే, భూమిపై భక్తుల్ని టెస్ట్ చేసే దేవుడు ప్రభాస్. ఇద్దరు దేవుళ్లు కన్నప్పకు పరీక్ష పెడుతూనే ఉంటారు. అయితే ట్రైలర్ విడుదలయ్యాక, జనం ఎక్కువగా ప్రభాస్- అక్షయ్ గురించే మాట్లాడుతున్నారు. కన్నప్ప ట్రైలర్‌పై ఒక వ్యక్తి ట్వీట్ చేస్తూ, -మహాదేవ్‌గా ఖిలాడీ .. రుద్రగా రెబల్ స్టార్ ఊహించని కలయిక, చఅక్షయ్ కుమార్ .. చప్రభాస్ ఒకే ఫ్రేమ్‌లో కలిసి ఉన్నారు. ఇది పవర్ ఫుల్ కాంబినేషన్. భవిష్యత్‌లో ఇద్దరూ కలిసి పూర్తి యాక్షన్ మూవీ చేస్తే? ఎలా ఉంటుంది! అనే ఆలోచన కూడా వచ్చింది. అయితే ఆ ఇద్దరినీ కలిపేందుకు సరైన దర్శకుడు, నిర్మాత అవసరం. సరైన బౌండ్ స్క్రిప్ట్ కూడా కుదరాలి. ప్రభాస్ గొప్పతనాన్ని బాలీవుడ్ స్టార్లు అంగీకరిస్తున్నారు కాబట్టి అతడితో కలిసి నటించడానికి వారికి అభ్యంతరం ఉండదు. ఇటీవల సౌత్- నార్త్ కలయికలో భారీ మల్టీస్టారర్లు తెరకెక్కడం ట్రెండ్ గా మారింది. ఇది త్వరలో విడుదలకు రానున్న కన్నప్పకు ఏమేరకు ప్లస్ అవుతుందో వేచి చూడాలి.

# శ్రీలీల వర్సెస మిహీక.. బెస్ట్ స్టైలీ ఎవరు?

అద్భుత నటన, డ్యాన్సింగ్ ప్రతిభతో భారీ ఫాలోయింగ్ సంపాదించుకుంది తెలుగమ్మాయి శ్రీలీల. ఇటు టాలీవుడ్ అటు బాలీవుడ్ లో వరస ఆఫర్లతో వేగంగా దూసుకెళుతోంది. నేటి స్టార్లలో శ్రీలీల దూకుడు గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. టాలీవుడ్ లో ప్రతిభతో దూసుకొచ్చిన స్టార్ గా వెలుగుతోంది. ఇటీవల పుష్ప చిత్రంలో స్పెషల్ నంబర్ దెబ్బలు పడతయి రో శ్రీలీల ఇమేజ్ ని పెంచింది. ఈరోజుతో శ్రీలీల ఒక ఏడాది పెద్దదైంది. జూన్ 14న తన 24వ పుట్టినరోజు జరుపుకుంటోంది. శ్రీలీలను గొప్పగా అభిమానించే తన స్నేహితురాళ్లు సమంత రూత్ ప్రభు, మిహీక బజాజ్ సహా పలువురు బర్త్ డే విషెస్ తెలియజేసారు. రానా సతీమణి మిహీక దగ్గుబాటి శ్రీలీలకు ఈ విధంగా విషెస్ తెలిపారు. "నా సన్ షైన్ గాళ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు! కొంచెం ఆలస్యంగా అయినా ఈ సెలబ్రేషన్ జరుపుకోవడంలో చాలా బిజీగా ఉన్నాను.. ఈ సంవత్సరం నేర్చుకోనివి తిరిగి నేర్చుకునే సంవత్సరంగా ఉండనివ్వండి. మీలోని అమాయకత్వం.. ఉత్సాహంతో పాత ప్రపంచ జ్ఞానాన్ని సమతుల్యం చేయగలరు! నిన్ను ప్రేమిస్తున్నాను!" అని రాసారు. శ్రీలీల- మిహీక ఎంతో సన్నిహితంగా ఉన్న ఓ ఫోటోగ్రాఫ్ ని కూడా మిహీక దగ్గుబాటి



షేర్ చేసారు. సమంత కూడా శ్రీలీల అందమైన ఫోటోని షేర్ చేసి విషెస్ చెప్పారు. "విషింగ్ యు సన్ షైన్, స్టార్‌డస్ట్.. మీనుంచి అన్ని రకాల మాయాజాలాలను కోరుకుంటున్నాను. పుట్టినరోజు శుభాకాంక్షలు- శ్రీలీల. వేగంగా దూసుకెళుతున్న యువ నటిగా వినోద పరిశ్రమలో ఎక్కువగా చర్చించుకున్న పేర్లలో ఒకరిగా మారావు" అని రాసారు. శ్రీలీల ఇప్పటికే దాదాపు డజను చిత్రాలలో నటించింది. తదుపరి కార్తీక్ ఆర్యన్‌తో కలిసి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుంది. ఈ చిత్రం తనకు ఒక బహుమతి అవుతుందని శ్రీలీల ఆనందం వ్యక్తం చేసింది. నటిగానే కాదు వైద్యురాలిగాను శ్రీలీల ప్రొఫెషనల్. డాక్టర్ నాకు తెలిసిన మొదటి స్పెల్లింగ్ అని కూడా శ్రీలీల చెబుతుంది. 2019లో ఎపి అర్జున్ దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం కిస్‌తో శ్రీలీల చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించింది. ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ చిత్రాలలో నటిస్తూ బిజీగా ఉంది.

# పాప్ కల్చర్‌లో పాపులరైతే ఛాన్సులే ఛాన్సులు

గ్లామర్ పరిశ్రమలో అవకాశాలు ఎలా వస్తాయో? అదృష్టం ఎవరిని ఎలా తలుపు తడుతుందో ముందే ఊహించలేం. అందం, ప్రతిభ ఉన్నా చాలా మందికి అవకాశాలు రావు. ఆ రెండిటితో పాటు, ప్రచారంలో దూసుకుపోయే వారికి చాన్సులు రావొచ్చు. ముఖ్యంగా పంజాబీ పాప్ కల్చర్ లో భాగంగా ఉండే నటీమణులకు బాలీవుడ్ ఎప్పుడూ రెడ్ కార్పెట్ వేస్తుంది. కథానాయికలుగా అవకాశం కోసం కలలు కనే చాలా మంది యూత్ పంజాబీ పాప్ పాటలతో పాపులరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇది కేవలం పంజాబ్ కే వర్తించదు. హైదరాబాద్ పరిశ్రమలోను పలు సింగిల్ ఆల్బమ్స్ లో నటించి టాలీవుడ్ లో అవకాశాలు అందుకునేందుకు ప్రయత్నించిన వారు లేకపోలేదు. ఇకపోతే ఇటీవలి కాలంలో పంజాబీ పాప్ కల్చర్



లో పాపులరై, అక్కడ సినిమాల్లో నటించిన సోనమ్ బజ్వా నెమ్మదిగా బాలీవుడ్ లో పాపులరవుతోంది. ఈ భామ ఇప్పుడు బార్డర్ 2 లాంటి క్రేజీ చిత్రంలో నటించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్లలోకి రానుంది. దిల్జీత్ సరసన సోనమ్ నటించనుంది. ఈ నెలాఖరు నాటికి సోనమ్ తన సన్నివేశాలను పూర్తి చేస్తుందని సమాచారం. సోనమ్ బజ్వా పాత్ర పంజాబీ అమ్మాయిగానే ఉంటుందని కూడా తెలిసింది. వార్ డ్రామా ఒకవైపు, ప్రేమ జంటపై సన్నివేశాలు మరోవైపు రక్తి కట్టిస్తాయని కూడా చెబుతున్నారు. సన్నీడియోల్ లాంటి సీనియర్ తో పాటు ఈ చిత్రంలో వరుణ్ ధావన్ కూడా నటిస్తున్నాడు. అతడి సరసన మరో పాపులర్ నటిని ఎంపిక చేయాల్సి ఉంది. ఈ చిత్రం చివరి షెడ్యూల్ జూన్- ఆగస్టులో సాగనుండగా ప్రధాన తారాగణం అటెండవుతారు. సోనమ్ బజ్వా ఇటీవల భారీ చిత్రాల్లో అవకాశాలు అందుకుంటోంది. అక్షయ్ సహా పలువురు అగ్ర తారలు నటించిన హౌస్ ఫుల్ 5లోను సోనమ్ బజ్వా నటించింది. తదుపరి బోర్డర్ 2, భాఘి 4లోను కనిపించనుంది. దీవానియాత్ అనే చిత్రంలోను సోనమ్ బజ్వా నటిస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536